శుక్రవారం 16-2-2024


'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 326

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

పేద, మధ్య తరగతి విద్యార్థులు సైతం అంతర్జాతీయ వర్సిటీలు అందించే కోర్సులను ఉచితంగా చదివేందుకు వీలు కల్పిస్తూ, ఉన్నత విద్యారంగంలో మరో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టిన జగనన్న ప్రభుత్వం..



ప్రముఖ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో..
నేడే రాష్ట్ర ప్రభుత్వం మరియు ప్రపంచ స్థాయి వర్సిటీ కోర్సులను ఆన్‌లైన్‌లో అందించే ప్రముఖ ఈ-లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ "ఎడెక్స్"ల మధ్య ఒప్పందం..


టీచింగ్, లెర్నింగ్ కోసం కొత్త టెక్నాలజీ, బోధనా విధానాలను సంయుక్తంగా రూపొందించిన ఎడెక్స్, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ..

"ఎడెక్స్ ఒప్పందం" ముఖ్యాంశాలు

- మన రాష్ట్రంలోని 12 లక్షల మందికి పైగా విద్యార్థులు వరల్డ్ క్లాస్ వర్సిటీలు, ఇతర విద్యాసంస్థలు అందించే 2,000+ ఎడెక్స్ ఆన్‌లైన్ కోర్సులను రెగ్యులర్ కోర్సులతో పాటు ఉచితంగా చదువుకుని, సర్టిఫికెట్లు పొందే పరిస్థితి..
- ప్రపంచంలో అత్యున్నత స్థాయి విశ్వవిద్యాలయాలు, సంస్థలకు చెందిన అత్యుత్తమ అధ్యాపకులతో మన విద్యార్థులకు బోధన..
- హార్వర్డ్, ఎంఐటీ,ఎల్ఎస్ఈ, కొలంబియా సహా పలు అత్యుత్తమ వర్సిటీల నుంచి ఆ కోర్సు సర్టిఫికెట్లు, క్రెడిట్లు జారీ.. తద్వారా మన విద్యార్థులకు మంచి వేతనాలతో కూడిన జాతీయ మరియు అంతర్జాతీయ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు..

"ఎడెక్స్ ఒప్పందం"తో ప్రయోజనాలు

- ప్రపంచంలో అనూహ్యంగా మారుతున్న శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు సామాజిక, సాంఘిక శాస్త్రాలకు సంబంధించి వివిధ సబ్జెక్టులను మన విద్యార్థులు ఉచితంగా నేర్చుకునే అవకాశం..
- కోర్సుల్లో ఎక్కువ వర్టికల్స్ పెట్టడం ద్వారా విద్యార్థి తనకు కావాల్సిన వర్టికల్స్ చదువుకునే వీలు..
- విదేశాలకు వెళ్లి అక్కడి మేటి కాలేజీల్లో చదువుకోలేని ఎంతో మంది విద్యార్థులు హార్వర్డ్, ఎంఐటీ, కొలంబియా, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, న్యూయార్క్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్స్ , ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్ వంటి ప్రపంచ ప్రసిద్ధి చెందిన యూనివర్సిటీలు రూపొందించిన కోర్సులను సులభంగా నేర్చుకునే వెసులుబాటు.. ఆ యూనివర్సిటీ వారే ఆ సబ్జెక్టులకు ఆన్‌లైన్‌లో ఎగ్జామ్స్ నిర్వహించి సర్టిఫికెట్లు ఇస్తారు. ఆ క్రెడిట్స్ మన కరిక్యులమ్‌లో భాగమవుతాయి. తద్వారా మన పిల్లలు గ్లోబల్ స్టూడెంట్స్‌గా ఎదుగుతారు..
- ప్రొఫెషనల్, సాంప్రదాయ డిగ్రీ విద్యలో లోటుపాట్లను సరిచేసి స్కిల్ ఓరియెంటెడ్ కోర్సులను అందించడం ద్వారా నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి..
- విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన శిక్షణ, అభ్యసనా నైపుణ్యాలను అందించడంలో ఎడెక్స్ సహకారం..



ఉన్నత విద్యలో జగనన్న ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు..

- పేద విద్యార్థులు సైతం ఉన్నత విద్యను అభ్యసించేందుకు వీలు కల్పిస్తూ జగనన్న విద్యా దీవెన ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్.. జగనన్న వసతి దీవెన ద్వారా భోజన, వసతి సౌకర్యాలు, ప్రతి విద్యా సంవత్సరం మొదట్లోనే (జూన్/ జులై), చివరిలో ప్రతి ఏప్రిల్ లోనూ ఇస్తూ..
- జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా క్యూఎస్/టైమ్స్ ర్యాంకింగ్స్‌లో 21 ఫ్యాకల్టీలలో టాప్ - 50 ర్యాంకుల్లో ఉన్న 320 కాలేజీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు రూ. 1.25 కోట్ల వరకు ఆర్థిక సాయం..
- జాబ్ ఓరియెంటెడ్ కరిక్యులమ్‌తో నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులు.. విద్యార్థులలో నైపుణ్యాలను పెంచి వారు వెంటనే ఉపాధి పొందేలా 30 శాతం నైపుణ్యాభివృద్ధి కోర్సులు..
- కరిక్యులమ్ లో భాగంగా సర్టిఫైడ్ ఆన్‌లైన్ వర్టికల్స్.. తద్వారా విద్యార్థులు తాము చదువుతున్న కోర్సులతో పాటు ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు ఆన్ లైన్ లో నేర్చుకునే వెసులుబాటు..
- కరిక్యులమ్ లో 10 నెలల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ పెట్టడం ద్వారా విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం..
- ఇప్పటికే 7 లక్షల మంది విద్యార్థులు 2 నెలల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్స్, 5.2 లక్షల మంది 2 నెలల షార్ట్ టర్మ్ ఇంటర్న్ షిప్ మరియు 2 లక్షల మంది 6 నెలల లాంగ్ టర్మ్ ఇంటర్న్ షిప్ పూర్తి చేయగా మరో 3 లక్షల మంది విద్యార్థులు లాంగ్ టర్మ్ ఇంటర్న్ షిప్ పూర్తి చేయనున్నారు.
- థియరీతో పాటు Industry oriented Courses చేయడం వల్ల 2018-19 విద్యా సంవత్సరంలో 37,000 ఉన్న ప్లేస్ మెంట్స్ ఇప్పుడు (2022-23లో) 1 లక్షకు పెరిగింది.
- నేషనల్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, సెక్టార్ స్కిల్ కౌన్సిల్ లతో ఒప్పందం.. 50 బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ ప్రోగ్రామ్ లతోపాటు 159 సింగిల్ మేజర్ కోర్సులు..
- డిగ్రీ కోర్సులో 2వ సెమిస్టర్ నుంచి AI, IoT, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, సైబర్ ఫోరెన్సిక్స్, రియల్ ఎస్టేట్ మేనేజ్ మెంట్, కమర్షియల్ రియల్ ఎస్టేట్ అనాలసిస్ & ఇన్వెస్ట్ మెంట్స్, లాజిస్టిక్స్, రిస్క్ మేనేజ్ మెంట్, స్టాక్ ఎక్స్ఛేంజ్, ఫైనాన్షియల్ మార్కెట్ అనాలసిస్, వెల్త్ మేనేజ్‌మెంట్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ వంటి మైనర్ కోర్సులు ఆన్‌లైన్ వర్టికల్స్ ద్వారా అందుబాటులోకి..
- డిజిటల్ విద్యలో భాగంగా డిగ్రీలో కూడా బైలింగువల్ పాఠ్యపుస్తకాలు.. 400కు పైగా ద్విభాషా పాడ్ క్యాస్ట్ లు..
- రాష్ట్రంలోని 18 యూనివర్శిటీల్లో ఖాళీగా ఉన్న 3,295 పోస్టుల భర్తీకి మన జగనన్న ప్రభుత్వం సన్నాహాలు.. ఇప్పటికే కోర్టు కేసులు అధిగమించి, నియామక ప్రక్రియ ప్రారంభం..
- మన విద్యార్థులను గ్లోబల్ విద్యార్థులుగా తయారు చేసే క్రమంలో ప్రపంచ ప్రముఖ యూనివర్శిటీలైన స్టెయిన్ బీస్ - జర్మనీ, మెల్బోర్న్-ఆస్ట్రేలియా, కెంపెన్ - జర్మనీ, బ్లెకింగ్ - స్వీడన్, ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- బ్యాంకాక్‌లతో అవగాహన ఒప్పందాలు..
- ఉన్నత విద్యలో నూతన సాంకేతిక పరిజ్ఞానం మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పూర్తి స్థాయి వినియోగానికి చర్యలు.. యూనివర్సిటీల్లో కంప్యూటర్ విజన్, ఇమేజ్ ప్రాసెసింగ్, మెటావర్స్ లెర్నింగ్ జోన్ ల ఏర్పాటు.. ఒక్కో జోన్ కు రూ.10 కోట్ల పెట్టుబడి.. ఇప్పటికే పద్మావతి మహిళా యూనివర్సిటీలో ప్రారంభం..
- యువతలో సామాజిక స్పృహ, సమాజం పట్ల బాధ్యత పెంపొందించటానికి Board for Community Development through Education (BCDE) ఏర్పాటు..
- రాష్ట్ర వ్యాప్తంగా 553 ఇంక్యుబేషన్ సెంటర్స్ ఏర్పాటు.. ఇప్పటి వరకు 10వేల మందికి పైగా నమోదు..
- 2019 నాటికి 257 ఉన్నత విద్యాసంస్థలు మాత్రమే NAAC గుర్తింపు పొందగా, ఈరోజు రాష్ట్రంలో NAAC గుర్తింపు పొందిన విద్యా సంస్థలు 437..

ఎడెక్స్ తో ఒప్పందం - ఉన్నత విద్యలో "గేమ్ ఛేంజర్"

శ్రీ. బొత్స సత్యనారాయణ, విద్యా శాఖా మాత్యులు

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ.వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారి సమక్షంలో 16 ఫిబ్రవరి, 2024 ఉదయం 11 గంటలకు సీఎం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం, ప్రముఖ ఆన్ లైన్ కోర్సుల సంస్థ ఎడెక్స్‌ల మధ్య ఒప్పందం.. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లలో లైవ్ లో వీక్షించవచ్చు.

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఫ్యాషన్







పెళ్లికి ప్రత్యేకం

పెళ్లి వేడుకల్లో ప్రత్యేకత గురించి ఎంతగా పరితపిస్తారో అందరికీ తెలిసిందే! లెహంగా అయినా శారీ అయినా రంగులు, డిజైన్లు, మెటీరియల్ మీద అందరి దృష్టి ఉంటుంది. సౌకర్యంగా ఉంటూనే గ్రాండ్‌గా వెలిగిపోయేలా ఈ వెడ్డింగ్ సీజన్ డ్రెస్సుల మీద అందరి దృష్టిని మరింత ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది.

మహారాణి కళ

గులాబీ పింక్, పీచ్, గ్రీన్ కలర్ డ్రెస్సులు సంప్రదాయ ఎంపికలో వైవిధ్యాన్ని చూపుతాయి. స్టైలిష్‌గానూ కనిపిస్తాయి.

ఎంబ్రాయిడరీ, జరీ వర్క్, స్టోన్స్ సీక్వెన్స్‌తో ఉన్న ఎరుపు రంగు లెహంగా మహారాణి కళ ఉట్టిపడేలా చేస్తూ మళ్లీ వెలుగు చూస్తోంది.

పేస్టల్ లెహంగా

పెళ్లి కూతురు స్నేహితురాళ్లు, దగ్గరి బంధువులు అమ్మాయిలు ధరించే మినిమలిస్టిక్ బ్లాక్, మింట్ గ్రీన్, పౌడర్ బ్లూ, లావెండర్, సాఫ్ట్ పింక్ కలర్స్ రొమాంటిక్ దారులకు స్వాగతం పలుకుతున్నాయి.

ఫిష్ టెయిల్ లెహంగా

ఆధునికత, సంప్రదాయతల కలబోతగా పెళ్లికూతురును అందంగా చూపుతుంది ఫిష్‌టెయిల్ లెహంగా. స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటుంది.

ఫ్లోరల్స్

ప్లెయిన్ లేదా పిమ్మరీ లేదా ఫ్లోరల్ లెహంగా ఉంటే చాలు ప్రత్యేకమైన రోజు మీదే అవుతుంది. ఎకోఫ్రెండ్లీ ఫ్యాబ్రిక్‌తో, ఆర్గానిక్ డైస్‌తో సంప్రదాయ కలనేత టెక్నిక్స్‌తో రూపుదిద్దుకున్న లెహంగా లేదా శారీ ఎప్పుడూ ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది.

పర్సనల్ టచ్

పాతదే అయినా మళ్లీ కొత్తగా కనువిందు చేస్తోంది పర్సనల్ టచ్ ఉండే లెహంగా.

వధూవరుల పేర్లు, వారి పరిచయం వివరాలు.. అందమైన ఎంబ్రాయిడరీ లేదా ఫ్యాబ్రిక్ పెయింట్‌తో చేసిన డిజైన్ మళ్లీ ఆకట్టుకుంటుంది.

ఐవరీ కలర్

క్రీమ్ లేదా ఐవరీ కలర్ లెహంగా లేదా శారీస్ ఈ వెడ్డింగ్ సీజన్‌ని మరింతగా ఆకట్టుకోనున్నాయి. వీటి మీద గోల్డెన్ ఫ్లవర్స్ అదనపు ఆకర్షణ కానున్నాయి. వీటికి కాంట్రాస్ట్ స్టోన్ జ్యువెలరీ ధరిస్తే రాయల్ లుక్ సొంతం కావడమే ఈ ఎంపికకు అసలు కారణం.

ధోతీ లెహంగా

ఇండోవెస్టర్న్ ఫ్యూజన్ లుక్‌తో ధోతీ లెహంగా ఈ యేడాది ట్రెండ్‌లో ఉంది. డ్రేప్డ్ స్కర్ట్ షేప్, క్రాప్‌టాప్ లేదా ప్రత్యేకమైన బ్లౌజ్ ఈ వెడ్డింగ్ సీజన్‌ని బ్రైట్‌గా మార్చనుంది.

ఆలివ్ ఆయిల్

లైట్ ఆలివ్, లైట్ బ్లూ షేడ్స్ ఆర్గంజా మెటీరియల్ లెహంగా లేదా శారీస్ సరైన ఎంపిక అవుతుంది. సౌకర్యంగానూ, స్పెషల్‌గానూ కనిపించే ఈ కలర్ కాంబినేషన్‌లో ఫ్లోరల్ ప్రింట్స్ లేదా ప్లెయిన్ డ్రెస్‌ను ఎంచుకోవచ్చు. సిల్క్, జరీ, వెల్వెట్, ఆర్గంజా లెహంగాలు చాలా ఫ్యాషనబుల్‌గా ఉంటాయి. లైట్ వెయిట్‌గా ఉండటంతో సులువుగా క్యారీ చేయచ్చు.




కిచెన్‌టిప్స్



కాఫీలో కొద్దిగా బోర్నవిటా కలుపుకుంటే కాఫీకి మంచి రుచి వస్తుంది.

కూరల్లో కారం కాస్త ఎక్కువైతే అందులో కొంచెం నిమ్మరసం లేదా రెండు టీస్పూన్ల నెయ్యి కలిపితే కారం తగ్గుతుంది.





ఇడ్లీ చట్నీలో పల్లీలతోపాటు నాలుగైదు బాదం పప్పులు, జీడిపప్పు పలుకులు వేస్తే పోషకాలు అందటంతో పాటు, రుచిగా ఉంటుంది.

బొంబాయి రవ్వ హల్వా మరింత రుచిగా ఉండాలంటే టేబుల్ స్పూన్ శెనగ పిండిని కలుపుకోవాలి.



మిగిలిపోయిన అన్నంలో కొంచెం మసాలా దినుసులు, బ్రెడ్ వేసి అన్నాన్ని మెత్తగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంతో కరకరలాడే పకోడీలు తయారు చేసుకుని తినవచ్చు.



ఐస్‌క్రీమ్ ఇక మన ఫ్రిజ్‌లోనే!

వంటిల్లు

క్యాలెండర్ కాగితాలు వెనక్కి పోతున్నాయి. శీతాకాలం సెలవు తీసుకుంటోంది. వేసవికి స్వాగతం పలుకుతోంది కాలం. ఐస్‌క్రీమ్ యాడ్‌ల కాలం మొదలైంది. పిల్లలకు గుర్తు రాకపోయినా సరే... గుర్తు చేయడానికి ఓ ఇడియట్ బాక్స్ ఉంది. ఇడియట్ బాక్సే కాదు మనింట్లో ఫ్రిజ్ కూడా ఉంది. పిల్లలను పార్లర్‌కు పరుగు పెట్టనివ్వకండి. ఇంట్లోనే హెల్దీగా ఇలా ట్రై చేయండి.



చాకొలేట్ చిప్ ఐస్ క్రీమ్

కావలసినవి: మీగడ – 2 కప్పులు; పాలు – 3 టేబుల్ స్పూన్‌లు; **కోకో పౌడర్** – 3 టేబుల్ స్పూన్‌లు; **కండెన్స్‌డ్ మిల్క్** – అర కప్పు; **చాకొలెట్ చిప్స్** – కప్పు; **బ్రౌన్ షుగర్** – కప్పులో మూడవ వంతు (బ్లీచ్ చేయని చక్కెర, అది లేకపోతే మామూలు చక్కెర తీసుకోవచ్చు)

తయారీ: ● మీగడను పన్నెండు గంటల సేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. ● వెడల్పుగా ఉన్న పాత్రలో పాలు పోసి చిన్న మంట మీద వేడి చేయాలి. పాలు మరగాల్సిన అవసరం లేదు, వేడయితే చాలు (పాశ్చరైజేషన్ జరగని పాలయితే మరిగించి వేడి తగ్గే వరకు పక్కన ఉంచి గోరువెచ్చగా ఉన్నప్పుడు వాడాలి). అందులో కోకో పౌడర్ వేసి బీటర్‌తో కలపాలి. ఆ తర్వాత కండెన్స్‌డ్ మిల్క్ వేసి మొత్తం కలిసే వరకు బీటర్‌తో చిలకాలి. ఇప్పుడు చక్కెర వేసి చిన్న మంట మీద వేడి చేస్తూ కరిగే వరకు చిలకాలి. చక్కెర కరిగిన తర్వాత దించేసి చల్లారే వరకు మిశ్రమాన్ని పక్కన ఉంచాలి. ● ఫ్రిజ్‌లో ఉన్న మీగడను బయటకు తీసి సమంగా కలిసే వరకు చిలకాలి. ఆ తర్వాత ముందుగా తయారు చేసుకుని పక్కన ఉంచిన కోకో మిశ్రమాన్ని మీగడలో వేసి చిలికినట్లు కాకుండా నిదానంగా కలపాలి. ఇప్పుడు చాకొలెట్ చిప్స్ వేసి ఒకసారి కలిపి (చాకొలెట్ చిప్స్ అన్నీ ఐస్ క్రీమ్‌లో ఒకచోట చేరకుండా అక్కడొకటి అక్కడొకటి వచ్చేటట్లు కలిపితే చాలు) మిశ్రమం మొత్తాన్ని ఒక ట్రేలో పోసి అల్యూమినియం ఫాయిల్‌తో కవర్ చేసి ఫ్రీజర్‌లో పెట్టాలి. పది గంటల తర్వాత ట్రేని బయటకు తీసి ఐదారు నిమిషాల తర్వాత అల్యూమినియం ఫాయిల్ తొలగించి ఐస్‌క్రీమ్‌ని కప్పుల్లో వేసి సర్వ్ చేయాలి.

వెనీలా ఐస్ క్రీమ్

కావలసినవి: కండెన్స్‌డ్ మిల్క్ – 400 గ్రా; చిక్కటి మీగడ – 200 గ్రా; వెనీలా ఎక్స్‌ట్రాక్ట్ – 2 టీ స్పూన్‌లు.

తయారీ:
● ఐస్‌క్రీమ్ తయారు చేయడానికి ముందు రోజు రాత్రి మీగడను ఫ్రీజర్‌లో పెట్టాలి. అలాగే ఒక ఖాళీ పాత్రను కూడా ఫ్రిజ్‌లో పెట్టి చల్లబరచాలి. కనీసం పది లేదా పన్నెండు గంటలసేపు ఉంచాలి. ● ఫ్రిజ్‌లో నుంచి తీసిన తరవాత మీగడను ఫ్రిజ్‌లో చల్లబరిచిన పాత్రలో వేసి ఏడు లేదా ఎనిమిది నిమిషాల సేపు చిలకాలి. చిలికేటప్పుడు మొదట మెల్లగా చిలుకుతూ క్రమంగా వేగం పెంచాలి. ఆ తరవాత అందులో కండెన్స్‌డ్ మిల్క్ వేసి మెల్లగా చిలకాలి. ● ఈ మిశ్రమాన్ని ఒక ట్రేలో పోసి సమంగా సర్ది అల్యూమినియం ఫాయిల్ పేపర్ అమర్చి అంచులకు క్లిప్ పెట్టాలి. పేపర్ ఐస్ క్రీమ్ మిశ్రమంలోకి జారిపోకుండా ఈ ఏర్పాటు. ఈ ట్రేని పన్నెండు గంటల సేపు ఫ్రీజర్‌లో ఉంచాలి. ఫ్రీజర్‌లో నుంచి బయటకు తీసిన తర్వాత ఐదారు నిమిషాల సేపు కదిలించకూడదు. ఆ తర్వాత ట్రే మీద కవర్ చేసిన అల్యూమినియం ఫాయిల్‌ని తొలగించి ఐస్‌క్రీమ్‌ని పెద్ద స్పూన్‌తో తీసి కప్పుల్లో వేసి సర్వ్ చేయాలి. ఈ ఐస్ క్రీమ్ కోసం స్టవ్ వెలిగించే పనే లేదు. కావలసిన వస్తువులన్నీ రెడీమేడ్‌గా దొరికేవే కాబట్టి పిల్లలు కూడా పెద్దవాళ్ల సహాయం లేకుండా సొంతంగా చేసుకోవచ్చు.

ఆరెంజ్ ఐస్ క్రీమ్

కావలసినవి: చల్లటి పాలు – అర లీటరు (ఫుల్ క్రీమ్ టిన్‌డ్ మిల్క్); **చక్కెర** – 100 గ్రాములు; **కార్న్‌ఫ్లోర్** – టేబుల్ స్పూన్; **ట్యాంగ్ పౌడర్** – 3 టేబుల్ స్పూన్‌లు (ఆరెంజ్ ఫ్లేవర్); **మీగడ** – వంద గ్రాములు; **ఆరెంజ్ ఎసెన్స్** – నాలుగు చుక్కలు.

తయారీ: ● అర కప్పు పాలలో కార్న్‌ఫ్లోర్ వేసి ఉండలు లేకుండా బీటర్ లేదా ఫోర్క్‌తో బాగా కలపాలి. ● మరొక పాత్రలో మిగిలిన పాలను పోసి చక్కెర వేసి అడుగు పట్టకుండా గరిటతో కలుపుతూ ఐదు నిమిషాల సేపు మరిగించాలి. ఇప్పుడు కార్న్‌ఫ్లోర్ కలిపిన పాలను వేసి కలుపుతూ మీడియం మంట మీద మరో ఐదు నిమిషాల సేపు మరిగించి దించేయాలి. ● పాలు చల్లారిన తర్వాత అందులో ట్యాంగ్ పౌడర్, క్రీమ్ వేసి బీటర్‌తో బాగా చిలకాలి. మృదువుగా తయారైన మిశ్రమాన్ని ఒక పాత్రలో పోసి అల్యూమినియం ఫాయిల్‌తో కవర్ చేసి ఫ్రీజర్‌లో పెట్టాలి. ● ఆరు గంటల తర్వాత తీసి మిక్సీ జార్‌లో వేసి బ్లెండ్ చేసి తిరిగి అదే పాత్రలో పోసి మళ్లీ అల్యూమినియం ఫాయిల్‌తో కవర్ చేసి ఫ్రీజర్‌లో పెట్టాలి. పది గంటల సేపు ఉంచితే ఐస్‌క్రీమ్ గట్టిగా సెట్ అయి ఉంటుంది. ఇప్పుడు కప్పులో వేసి సర్వ్ చేయాలి.

కొత్త ఆలోచన

టెడ్డీబేర్ క్లినిక్స్

**డాక్టర్: నీ టెడ్డీబేర్‌కు ఏమైంది?
చిన్నారి: కాలు నొప్పి
డాక్టర్: ఎక్కడ?
చిన్నారి: ఇక్కడ
డాక్టర్: ఏం కాదు... తగ్గిపోతుంది...
ఇలాంటి క్లినిక్‌లు ఇప్పుడు మంగళూరులోని స్కూళ్లలో నిర్వహిస్తున్నారు డాక్టర్లు. యు.కె.జి. నుంచి 2వ తరగతిలోపు పిల్లల్లో హాస్పిటల్ భయం పోవడానికి వారి ఆరోగ్య సమస్యలు బయటకు చెప్పడానికి ఈ క్లినిక్‌లు ఉపయోగపడుతున్నాయి. పేషెంట్లుగా సొంత టెడ్డీబేర్‌లను తెమ్మనడంతో పిల్లలు వాటిని తీసుకుని ధైర్యంగా వస్తున్నారు. దేశంలోని అన్ని పల్లెల్లో 'బొమ్మల ఆస్పత్రి' పేరుతో ఇలాంటి క్లినిక్‌లు నిర్వహించాల్సిన అవసరం ఉంది.**



మూడేళ్ల లోపు చంటిపిల్లలను హాస్పిటల్‌లో చూపించడం తల్లులకు కష్టం కాదు. కాని ఐదారేళ్లు వచ్చాక పిల్లలకు హాస్పిటల్ అంటే భయం వస్తుంది. డాక్టర్‌ని చూడటం, వ్యాక్సిన్ కోసం సూది వేయించుకోవడం, జ్వరాలకు సిరప్‌లు తాగాల్సి రావడం వారికి హాస్పిటల్ అంటే భయం వేసేలా చేస్తుంది. 5 ఏళ్ల నుంచి 8 ఏళ్ల లోపు పిల్లలు ఈ భయంతో ఏదైనా ఇబ్బంది ఉన్నా తల్లిదండ్రులకు చెప్పకపోవచ్చు– హాస్పిటల్‌కు వెళ్లాల్సి వస్తుందని. అంతేకాదు హాస్పిటల్‌కు తీసుకెళితే డాక్టర్‌కి చూపించి బయటకు వచ్చేంత వరకూ ఏడుస్తూనే మారాం చేస్తూనే ఉంటారు కొందరు పిల్లలు. దీని వల్ల తల్లిదండ్రులకే కాదు... క్లినిక్‌కు వచ్చిన ఇతర పిల్లలు, పెద్దలు కూడా ఇబ్బంది పడతారు. అందుకే వీరికి క్లినిక్‌లంటే భయం పోగొట్టాలి. దానికి ఏం చేయాలి?




టెడ్డీ బేర్ క్లినిక్స్

యూకేలో ఇటీవల కాలంలో 'టెడ్డీ బేర్' క్లినిక్స్ నిర్వహిస్తున్నారు. 5 నుంచి 8 ఏళ్ల లోపు పిల్లలు తమ సొంత టెడ్డీ బేర్‌లను పేషెంట్లకు మల్లే తెచ్చి డాక్టర్‌లకు చూపించడం కాన్సెప్ట్. ఇందు కోసం నిజమైన డాక్టర్లు నిర్దేశిత స్కూల్‌కు టీమ్‌గా వస్తారు.. లేదా ఏదైనా చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో దీనిని నిర్వహిస్తారు. క్లినిక్స్ అంటే భయం పోగొట్టడమే ముఖ్యోద్దేశం. క్లినిక్స్‌లో ఎంత చక్కగా టెడ్డీ బేర్‌లకు వైద్యం జరుగుతుందో చూశాక తమకు కూడా అంతే ఈజీగా వైద్యం చేస్తారు అనే భావన పిల్లల్లో కలుగుతుంది.

మంగుళూరులో ట్రెండ్

గత సంవత్సరం జూలై నుంచి మంగుళూరులోని చాలా స్కూళ్లలో విడతల వారీగా టెడ్డీబేర్ క్లినిక్స్ నడుస్తున్నాయి. ఇందుకు స్కూళ్ల యాజమాన్యాలు సహకరిస్తున్నాయి. ప్రయివేట్ ఆస్పత్రులు తమ ప్రచారం కోసమే కావచ్చు... లేదా పిల్లల పట్ల బాధ్యతతోనే కావచ్చు... చాలా ప్రొఫెషనల్‌గా ఈ క్లినిక్స్‌ను నిర్వహిస్తున్నారు. క్లినిక్ స్కూల్‌లో నడిపే రోజున పిల్లలు తమ సొంత టెడ్డీ బేర్‌ను కాని లేదా మరేదైనా ఆటబొమ్మను (మనిషి, పెట్) తీసుకురావాలి. తమ పేషెంట్ పేరును అచ్చు హాస్పిటల్‌లో ఎలా రిజిస్టర్ చేయిస్తారో అలా చేయించాలి. ఆ తర్వాత ఓ.పీ.కి వెళ్లాలి. ఓ.పీ.లో డాక్టర్లు టెడ్డీబేర్‌కు ఏం ఇబ్బంది ఉందో అడుగుతారు. వైద్యం చేయాలంటే పొడవు, ఎత్తు చూడాలని చెప్పి చూస్తారు. పిల్లలు సాధారణంగా తమకున్న ఇబ్బందులే టెడ్డీ బేర్‌కు ఉన్నట్టుగా చెబుతారు. టెడ్డీబేర్‌ను చూస్తున్నట్టుగా పిల్లల్ని కూడా వారి మూడ్‌ను బట్టి డాక్టర్లు చూస్తారు. పిల్లల హెల్త్ అసెస్‌మెంట్‌ను స్కూల్ సాయంతో పేరెంట్స్‌కు పంపుతారు.

కంటి, పంటి పరీక్ష

చిన్న పిల్లల్లో కంటి, పంటి పరీక్షలు ముఖ్యమైనవి. టెడ్డీబేర్ క్లినిక్స్ పేరుతో పిల్లలను ఉత్సాహపరిచి వారికి కంటి, పంటి పరీక్షలు కూడా డాక్టర్లు నిర్వహిస్తున్నారు. సాధారణ చెకప్‌ల ద్వారా వారిలో తగిన పోషక విలువలు ఉన్నాయా, వారు బలహీనంగా ఉన్నారా అనేవి కూడా చూస్తారు. ఏమైనా డాక్టర్ల పరిశీలన ఆ వయసు పిల్లలకు ప్రతి మూడు నెలలకు అవసరం. మంగుళూరు స్కూళ్లలో ఇదే జరుగుతూ ఉంది.

మిగతా రాష్ట్రాల్లో కూడా పల్లెల్లో చిన్నారులకు ఈ 'బొమ్మల ఆస్పత్రు'లు నడపడం చాలా బాగుంటుంది. పల్లె పిల్లలు డాక్టర్లకు చూపించుకునే వీలుండదు చాలాసార్లు. తల్లిదండ్రులు తీసుకెళ్లరు. ఆస్పత్రులంటే భయపడేవారు కూడా ఎక్కువ మందే ఉంటారు. అందుకోసమే బొమ్మల ఆస్పత్రుల ఐడియాను ప్రభుత్వాలు అందిపుచ్చుకుంటే చిన్నపిల్లల ఆరోగ్యస్థాయి, వారి సాధారణ అనారోగ్య సమస్యలు అంచనాకొస్తాయి.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 326

శుక్రవారం 16-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



నేషనల్ కాన్ఫరెన్స్ యూటర్న్

సొంతంగా పోటీ చేస్తామన్న ఫరూక్.. అలాంటిదేమీ లేదన్న ఒమర్ - 6లో



శతకాలతో శుభారంభం

రోహిత్, జడేజా సెంచరీలు.. రాణించిన సర్ఫరాజ్.. భారత్ 326/5 - 13లో



గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి హాజరైన వలంటీర్లు, అశేష జనసందోహంలో ఓ భాగం

మీరే భావి లీడర్లు

మీరే నా యువ సైన్యం.. 'వలంటీర్లకు వందనం'లో సీఎం వైఎస్ జగన్

మీ సేవా భావానికి ఈ అన్న సెల్యూట్ చేస్తున్నాడు

2లో

- వలంటీర్లను చూస్తే చంద్రబాబుకు గుండెల్లో రైళ్లు
- దోపిడీ కోసమే గంజాయి మొక్కలు లాంటి జన్మభూమి కమిటీలు
- బాబు పాలన విషవృక్షం.. మన పాలన కల్పవృక్షం
- సంక్షేమంతో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ మన స్టార్ క్యాంపెయినర్లే
- రాజధానిలో భూమిలేని నిరుపేదలకు రూ.5,000 పింఛన్



వలంటీర్లకు సెల్యూట్ చేస్తున్న సీఎం వైఎస్ జగన్

తీర్పు వెలువరిస్తున్న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్. చిత్రంలో రాజ్యాంగ ధర్మాసనంలోని ఇతర న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ మనోజ్ మిశ్రా



ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధం

బాండ్ల పథకం లోపభూయిష్టం.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు

మోదీ సర్కారుకు భారీ ఎదురుదెబ్బ!

- సమాచార హక్కును హరిస్తోంది.. భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం
- రాజ్యాంగ ధర్మాసనం స్పష్టీకరణ.. దాన్ని రద్దు చేస్తూ ఏకగ్రీవ నిర్ణయం
- బాండ్ల లావాదేవీల వెల్లడికి ఆదేశం.. ఈసీ వెబ్‌సైట్‌లో పెట్టాలని స్పష్టీకరణ

12లో

ఏమిటీ ఎలక్టోరల్ బాండ్లు! - 6లో

'ఇసుక'పై మళ్లీ అదే అక్కసు

- అక్రమ తవ్వకాలంటూ రామోజీ అర్థం పర్థంలేని ఆరోపణలు.. పర్యావరణ అనుమతులున్న రీచ్‌ల్లోనే ఇసుక తవ్వకాలు
- కలెక్టర్ల తనిఖీలపైనా అడ్డగోలు వ్యాఖ్యలు
- ఒకవైపు తనిఖీలు జరుగుతున్నాయని రాస్తూనే మరోవైపు ఎన్జీటీకి నివేదిక

10లో

ఫ్యాక్ట్‌చెక్

ఇచ్చారంటూ పొంతనలేని రాతలు

- టీడీపీ హయాంలో పెద్దఎత్తున ఇతర రాష్ట్రాలకు ఇసుక అక్రమ తరలింపు

పన్ను చెల్లించే స్థాయికి ఎంఎస్ఎంఈలు



- దేశంలోనే రికార్డు స్థాయిలో ఐటీ రిటర్నుల వృద్ధి రాష్ట్రంలో నమోదు
- గడిచిన నాలుగేళ్లలో ఏపీలో కొత్తగా 18 లక్షల మంది పన్ను రిటర్నులు దాఖలు
- పెరిగిన ఐటీఆర్ ఫైలింగ్స్ 60% ఎంఎస్ఎంఈల వల్లేనని 'ఎస్‌బీఐ రీసెర్చ్' వెల్లడి
- రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో ఉద్యమ్ పోర్టల్‌లో 6.6 లక్షల ఎంఎస్ఎంఈలు నమోదు
- ఇదే సమయంలో రాష్ట్రంలో 4.1 లక్షలు దాటిన జీఎస్టీ రిజిస్ట్రేషన్ల సంఖ్య

11లో



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాలను అందుకుంటున్న వలంటీర్లు (సేవా వజ్ర: వెలాంగిణీసుమ, లక్ష్మీతిరుపతమ్మ, సేవారత్న: జయగోపాల్, కోటేశ్వరరావు, సయ్యద్ మల్లిక, వెనిగండ్ల సాహితి, సేవా మిత్ర: అరుణ, శ్రీలక్ష్మి, శ్రీనివాసరావు)

మీరే భావి లీడర్లు

మీరే నా యువ సైన్యం.. 'వలంటీర్లకు వందనం'లో సీఎం జగన్

> మన జెండా, అజెండాపై మమకారంతో, మన మేనిఫెస్టోపై నమ్మకంతో, నవరత్నాల పథకాలు - పాలనా సంస్కరణలను ప్రజలకు చేరువచేసే బాధ్యత తీసుకున్న యువసైన్యమే మన వలంటీర్ల వ్యవస్థ. ప్రతి నిరుపేద బతుకులు మారాలని, భావి తరం పేదరికం సంకెళ్లు తెంచుకోవాలన్న తపనతో తెచ్చిన విప్లవాత్మక పథకాలను ఒక్క రూపాయి కూడా లంచాలు, వివక్ష లేకుండా అందించాలన్న మీ జగనన్న అజెండాను త్రికరణశుద్ధిగా అమలు చేస్తున్న భావి లీడర్లు వలంటీర్లు.
> - సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వలంటీర్ల అవార్డుల కోసం రూ.392.04 కోట్ల చెక్కుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వలంటీర్లు, మంత్రులు తదితరులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మీరు చేస్తున్నది ఉద్యోగాలు కాదని, రాబోయే రోజుల్లో మీరు లీడర్లు కాబోతున్నారని తాను మొట్ట మొదటిరోజే చెప్పానని వలంటీర్లనుద్దేశించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మీ దగ్గర నుంచి మొదలుపెడితే తన వరకూ 58 నెలలుగా అలసిపోకుండా పేదలకు సేవ చేశామన్నారు. ఇంకా రెండు నెలలు సేవ చేసేందుకు, పేదవాడి భవిష్యత్ మార్చేందుకు యుద్ధానికి సిద్ధమా? అని ప్రశ్నించారు. 2.60 లక్షల మంది నా సైన్యం.. నా వలంటీర్ల సైన్యం అని చెప్పడానికి గర్వపడుతున్నానన్నారు. ఈ సైన్యం గుండెలు టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల మాదిరిగా దోపిడీ గుండెలు కావని, ఇవి సేవా హృదయాలని వ్యాఖ్యానించారు. 'వలంటీర్లకు వందనం'లో భాగంగా వరుసగా నాలుగో ఏడాదీ పురస్కారాలు అందజేసే కార్యక్రమాన్ని గురువారం గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి జగన్ ప్రతిభ కనబరిచిన వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం జగన్ ఏమన్నారంటే..

నాడు దోపిడీ వ్యవస్థ.. నేడు సేవా సైన్యం

చంద్రబాబు హయాంలో ఏర్పాటైన జన్మభూమి కమిటీలు ప్రజలు టీడీపీని అధికారం నుంచి దించేందుకు కారణమైతే మీ అన్న తెచ్చిన సేవా సైన్యం సచివాలయాల వ్యవస్థతో అనుసంధానమై పేదలకు ప్రతి అవసరంలోనూ వారధిగా మారింది. 2019 తర్వాత జరిగిన ప్రతి ఎన్నికలోనూ మీ బిడ్డ ప్రభుత్వం ఘన విజయానికి వలంటీర్లు కారకులయ్యాయని గర్వంగా చెబుతున్నా. పరిపాలనను మార్చిన ఈ ప్రజా వ్యవస్థలే 2024 ఎన్నికల్లోనూ మన ప్రభుత్వ జైత్రయాత్రకు దారులు వేస్తాయి. మన వ్యవస్థలు , మన ప్రభుత్వం, మన మేనిఫెస్టో, మన నవరత్నాలు, మన అజెండా ప్రకారం సేవ చేయడానికి పుట్టాయి. ప్రతి గ్రామంలో బడి, ఆసుపత్రి పరిస్థితులను సమూలంగా మార్చాయి. పౌర సేవలను ఇంటివద్దే అందిస్తున్నాం. కళ్లకు కట్టినట్టుగా మీరు గమనిస్తున్న ఈ తేడాను ప్రతి రైతన్నకు, ప్రతి అక్కచెల్లెమ్మకు తెలియచేయాలి. 2019 కంటే ముందు ఏ సేవ కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వారాలు, నెలల తరబడి కాళ్లు అరిగేలా తిరగాల్సిన దుస్థితి నెలకొంది. జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తే కానీ అడుగు ముందుకు పడని పరిస్థితి. అవ్వాతాతలు, కదలలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు, అక్కచెల్లెమ్మలు పెన్షన్ అందుకోవాలన్నా, రైతులు ఎరువులు కావాలన్నా ఎండనకా వాననకా చాంతాడంత క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చేది. చివరికి మరుగుదొడ్లు కావాలన్నా లంచం ఇవ్వాల్సిన దుస్థితి. జన్మభూమి కమిటీల నుంచి చంద్రబాబు నాయుడు దాకా లంచాల పాలనే సాగింది. ఇప్పుడు మీ అన్న ప్రభుత్వంలో నెలకు రూ.3 వేలు చొప్పున 66 లక్షల మందికి పింఛన్లు ఇస్తుంటే గత ప్రభుత్వ పాలనలో కేవలం 39 లక్షల మందికి మాత్రమే అది కూడా ఎన్నికలకు రెండు నెలల ముందు వరకూ కేవలం రూ.వెయ్యి ముష్టి వేసినట్లు పెన్షన్ ఇచ్చేవారు. నాడు వివక్ష కారణంగా లక్షల మందికి పెన్షన్ అందలేదు. చంద్రబాబు పాలనలో స్కీంలు లేవు, బటన్లూ లేవు.

జన్మభూమి కమిటీలు గంజాయి మొక్కలు

చంద్రబాబు తెచ్చిన జన్మభూమి కమిటీలు గంజాయి మొక్కలు లాంటివైతే మన సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ తులసి మొక్కలు లాంటివి. చంద్రబాబు పాలన ఓ విష వృక్షమైతే మన పాలన కల్పవృక్షం లాంటిది. రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తెచ్చే గొప్ప కార్యక్రమాల్లో పాలు పంచుకుంటూ గౌరవ వేతనంతో మన ప్రభుత్వ పథకాలకు బ్రాండ్ అంబాసిడర్‌లుగా వ్యవహరించిన వలంటీర్ల సేవాభావానికి మీ అన్న సెల్యూట్ చేస్తున్నాడు.

డీబీటీ, నాన్ డీబీటీతో రూ.4.31 లక్షల కోట్లు

దేశ చరిత్రలో మరే రాష్ట్రంలోనైనా ఇలాంటి లంచాలు లేని, వివక్షలేని వ్యవస్థను ఎక్కడైనా చూశారా? ప్రతి ఇంటికీ వెళ్లి అడగండి. ప్రతి అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు, రైతన్నలకు చెప్పండి. లంచాలు, వివక్ష లేకుండా ఇప్పటివరకూ రూ.2.55 లక్షల కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి జమ చేశాం. వీటికి తోడు ఇళ్ల పట్టాలు, సంపూర్ణ పోషణ, గోరుముద్ద, ట్యాబ్‌లు, విద్యాకానుక లాంటి నాన్ డీబీటీ పథకాలు కూడా తీసుకుంటే మరో రూ.1.07 లక్షల కోట్లు ఇచ్చాం. ఇంటి స్థలాలకు సంబంధించి వాటి మార్కెట్ విలువ కూడా తీసుకుంటే అది రూ.1.76 లక్షల కోట్లు అవుతుంది. ఇంత సొమ్ము పేదల చేతుల్లోకి నేరుగా వెళ్లింది కాబట్టే కోవిడ్ లాంటి సంక్షోభాలను కూడా సమర్థంగా ఎదుర్కోగలిగాం. కేంద్రం నుంచి రావాల్సిన ఆదాయం తగ్గినా కూడా తట్టుకోగలిగాం. రాష్ట్రవ్యాప్తంగా 84 శాతం ఇళ్లకు మంచి జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో 95 శాతం ఇళ్లకు మేలు జరిగింది. అప్పుడూ ఇప్పుడూ అదే రాష్ట్రం, అదే బడ్జెట్. కానీ అప్పటి కన్నా మన ప్రభుత్వంలో అప్పుల గ్రోత్ రేటు చాలా తక్కువ. మారిందల్లా కేవలం ముఖ్యమంత్రి మాత్రమే. ఇవాళ రాష్ట్ర ప్రజల చేతుల్లో ఇన్ని లక్షల కోట్లు కనిపిస్తున్నాయి. గతంలో కనిపించకపోవటానికి కారణం ఏమిటని ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి.

> ఒక్కటి గుర్తు పెట్టుకోండి.. లీడర్ అనేవాడు ఎలా ఉండాలంటే తన నోటి నుంచి ఒక మాట వస్తే కష్టమైనా, నష్టమైనా ఆ మనిషి మాటమీద నిలబడతాడనే నమ్మకం ప్రతి పేదవాడిలోనూ కలగాలి. ఆ విశ్వసనీయతను ఏ రోజైతే కల్పించగలుగుతాడో అప్పుడు అతడిని నమ్ముకున్న ప్రతి కార్యకర్త, అభిమాని కాలర్ ఎగరేసి అదిగో మా లీడర్.. ఆయనే మా స్ఫూర్తి అని చెప్పే పరిస్థితి వస్తుంది. - సీఎం వైఎస్ జగన్

కాపీ కొట్టి కిచిడీ మేనిఫెస్టో..

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల వైపు ఈ ప్రభుత్వం అడుగులు వేస్తుంటే చంద్రబాబు మాత్రం హైదరాబాద్‌లోని ఇంట్లో కూర్చుని వేరే రాష్ట్రాల ఎన్నికల మేనిఫెస్టోలు కాపీ కొట్టి కిచిడీ రూపంలో తెచ్చారు. ప్రజల కష్టాలను చూసి మన మేనిఫెస్టో పుడితే చంద్రబాబు మేనిఫెస్టో హైదరాబాద్‌లో పుట్టింది. తానిచ్చిన హామీలన్నీ నిజంగా అమలు చేసే పరిస్థితి, అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా? అన్న ఆలోచన కూడా చంద్రబాబుకి ఉండదు. ఎలాగూ ఇచ్చేది లేదు కాబట్టి అబద్ధాలు ఆడటంలో భావదారిద్ర్యం ఎందుకనే ధోరణి ఆయనది. నమ్మినవాడు మునుగుతాడు, నమ్మించినవాడు దోచుకోగలుగుతాడనే తత్వం చంద్రబాబుది. ఎలాగూ ప్రజలు అధికారం ఇవ్వరని పసిగట్టి చంద్రబాబు తన మార్కు గ్యాంబ్లింగ్ మొదలుపెట్టారు. మొన్నటివరకు జగన్‌లాగా బటన్ నొక్కితే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని విమర్శించి ఇప్పుడు అదే నోటితో ఆరు వాగ్దానాలంటున్నారు. పైగా ఇది శాంపిల్ మాత్రమే, దీనికి మరో ఆరు జమ అవుతాయని చెబుతున్నారు.



సీఎం జగన్‌ను శాలువాతో సత్కరిస్తున్న వలంటీర్

వాటిని టచ్ కూడా చేయలేరు...

మీ బిడ్డ కష్టపడి ఎప్పుడూ జరగని విధంగా సంవత్సరానికి రూ.70 వేల కోట్లు సంక్షేమానికి ఖర్చు చేస్తున్నాడు. ఇందులో కొన్ని కార్యక్రమాలను టచ్ చేయడానికి కూడా ఎవరికీ ధైర్యం సరిపోదు. నెలకు రూ.3 వేల చొప్పున సామాజిక పెన్షన్లు, వ్యవసాయానికి పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్, ప్రతి పేదవాడికీ సబ్సిడీ బియ్యం, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, 108, 104 కార్యక్రమాలు, గోరుముద్ద, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఇచ్చే విద్యాదీవెన, వసతి దీవెన, సంపూర్ణ పోషణ కింద బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం లాంటి ఎనిమిది పథకాలకు రూ.52,700 కోట్లు అవుతుంది. వీటిని ఎవరైనా రద్దు చేయాలనుకున్నా చెయ్యి కూడా వేయటానికి సాహసించలేని పథకాలు అవి. మరి రూ.52,700 కోట్లు వెచ్చించాల్సిన ఈ తప్పనిసరి పథకాలకు తోడు చంద్రబాబు చెప్పిన ఆరు పథకాలకు రూ.73 వేల కోట్లు కూడా కలిపితే మొత్తంగా రూ.1,26,140 కోట్లు వరకు లెక్క తేలుతోంది. గతంలో ఏమీ చేయకుండా మోసాలకే పరిమితమైన ఆ వ్యక్తి ఏకంగా రూ.1.26 లక్షల కోట్లు ఇస్తానని నమ్మబలుకుతున్నాడంటే అంతా ఒక్కసారి ఆలోచన చేయాలి.

> జగన్ అనే ఒకే ఒక్కడు ఒకవైపున ఉన్నాడు! మరోవైపు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, చంద్రబాబు, దత్తపుత్రుడు వీరికి తోడు పరోక్షంగా ఒక జాతీయ పార్టీ, ప్రత్యక్షంగా మరో జాతీయ పార్టీ ఉంది. ఇంత మంది యుద్ధం చేస్తుంది కేవలం ఒకే ఒక్కడితో! కానీ వారు నాకు ఇంత పెద్ద సైన్యం అండగా ఉందన్న విషయాన్ని మర్చిపోతున్నారు. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలబడేందుకు ముందుకు రండి అని పిలుపునిచ్చే చిత్తశుద్ధి, నిబద్ధత రాజకీయ చరిత్రలో ఏ నాయకుడికైనా ఉందా? విపక్షాలు చేస్తున్న దాడి ఇంటింటికీ అందుతున్న సంక్షేమం మీద దాడే!. - సీఎం వైఎస్ జగన్

బాబు మేనిఫెస్టో.. రంగుల మాయాజాలం

1994, 1999, 2014.. చంద్రబాబు పాలనను ఎప్పుడు తీసుకున్నా అధికారంలోకి రాక ముందు మేనిఫెస్టో రంగురంగులతో ఉంటుంది. 650 పేజీలు.. 650 హామీలంటూ , ఎన్నికలు ముగిశాక చెత్త బుట్టలో వేస్తాడు. వెబ్‌సైట్‌లో కూడా మేనిఫెస్టోను మాయం చేస్తారు. ప్రజలు మోసపోకుండా బాబు రంగుల మాయలను ప్రజలకు వివరించాలి. చంద్రబాబు మేనిఫెస్టోను నమ్మడం అంటే బంగారు కడియం ఇస్తానన్న పులిని నమ్మడమేనని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలి.

వారం పాటు ఉత్సవాలు

వలంటీర్లను రాష్ట్రవ్యాప్తంగా అభినందించే కార్యక్రమాన్ని ఇవాళ ఇక్కడి నుంచి ప్రారంభిస్తున్నాం. వారం రోజుల పాటు ప్రతి మండలంలోనూ ఉత్సవాల మాదిరిగా ప్రభుత్వం వీటిని నిర్వహిస్తుంది. వరుసగా నాలుగో ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వలంటీర్లకు ఇప్పటివరకు ఇస్తున్న నగదు బహుమతిని 50 శాతం పెంచాం. మీరంతా గత ప్రభుత్వ హయాంలోని లంచాలు, వివక్షతో కూడిన వ్యవస్థను బద్ధలుగొట్టి త్రికరణశుద్ధితో నిజాయితీ చాటుకున్నందుకు గుర్తింపుగా బహుమతిని పెంచుతున్నాం. సేవావజ్రాలకు రూ.45 వేలు, సేవారత్నాలకు రూ.30 వేలు, సేవా మిత్రలకు రూ.15 వేలు చొప్పున అందచేస్తాం. ఈ ఏడాది కూడా ప్రతి నియోజకవర్గం నుంచి ఐదుగురు చొప్పున 875 మంది వలంటీర్లను సేవావజ్ర అవార్డులతో సత్కరిస్తున్నాం. ప్రతి మండలం, ప్రతి మున్సిపాల్టీ పరిధి నుంచి కనీసం ఐదు మంది, ప్రతి కార్పొరేషన్‌ పరిధి నుంచి పదిమంది చొప్పున 4,150 మంది వలంటీర్లను సేవారత్న అవార్డులతో గౌరవిస్తున్నాం. ఇలా 2,55,464 మంది వలంటీర్లను అభినందిస్తూ నగదు బహుమతిగా రూ.392 కోట్లను అందచేస్తున్నాం.

చొక్కా మడతబెడదాం..

ఇక అబద్ధాలను మట్టి కరిపించేందుకు చొక్కా స్లీవ్స్ మడచాల్సిన సమయం వచ్చింది. మంచి చేస్తున్న ఈ ప్రభుత్వానికి మీరంతా అండగా ఉండాలి. ప్రతి ఇంటి నుంచి స్టార్ క్యాంపెయినర్లుగా అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, రైతన్నలకు తీసుకురావాలి. పేదల పక్షాన ఈ ప్రభుత్వం పెత్తందార్ల మీద చేస్తున్న యుద్ధంలో చంద్రబాబుకు ఓటు వేయడం అంటే మీకు అందుతున్న పథకాల రద్దుకు ఆమోదం తెలపడమేనని ప్రజలకు తెలియచేయాలి. 2004లో చంద్రబాబు చేసిన మోసాలను ప్రతి ఇంటికీ గుర్తు చేయాలి. నాడు వ్యవసాయ రుణ మాఫీ, డ్వాక్రా రుణాలమాఫీ, రూ.2 వేల నిరుద్యోగ భృతి లాంటి హామీలను ఎగ్గొట్టడం, కోటయ్య కమిటీ అంటూ కోతల కమిటీని నియమించిన వైనాన్ని మరోసారి వివరించాలి.

బాబును నమ్మడమంటే...

చంద్రబాబును నమ్మడం అంటే ఇంగ్లిషు మీడియం బదుల్ని, సీబీఎస్ఈ నుంచి ఐబీ ప్రయాణాన్ని, నాడు–నేడు, అమ్మ ఒడి, గోరుముద్ద, పిల్లలకిచ్చే ట్యాబులు, ప్రతి క్లాస్ రూమును డిజిటలైజ్ చేస్తూ ఐఎఫ్‌పీ ప్యానల్స్ పెడుతున్న మన స్కూళ్లను, మన క్లాస్ రూముల్ని వీటన్నింటికీ రద్దు చేసి మన పిల్లల బంగారు భవిష్యత్‌ను తాకట్టు పెట్టడమేనని ప్రజలకు తెలియచేయాలి. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, ఏడాదికి 12 గ్యాస్ సిలిండర్లు ఇస్తానని ఎన్నికల తర్వాత నిలువునా దగా చేసిన బాబును మళ్లీ నమ్మవచ్చా? అని అడగండి. బాబుకు ఓటేయడం అంటే ఇంటింటికీ వచ్చి సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థను కాదనుకుని జన్మభూమి కమిటీలను ఆహ్వానించడమేనని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలి.

చంద్రముఖిని తెచ్చుకోవడమే..

చంద్రబాబు ఓటు వేయడం అంటే ఐదేళ్ల క్రితం వదిలించుకున్న చంద్రముఖిని మళ్లీ వారి ఇంట్లోకి తీసుకొని రావడమే అని చెప్పాలి. బాబుకు ఓటు వేస్తే ఈ సంక్షేమ, అభివృద్ధి పథకాలన్నీ రద్దై జన్మభూమి కమిటీలు, చంద్రముఖిలు వస్తాయి. వలంటీర్ చెల్లెమ్మలంతా కొంగు బిగించి ఈ పేదల వ్యతిరేకుల మీద, పెత్తందార్ల మీద, మోసగాళ్ల మీద, ఎల్లో మీడియా అసత్య ప్రచారాల మీద యుద్ధానికి సిద్ధమేనని ఎలుగెత్తాలి.

దడ పుట్టిస్తున్నాం..

వలంటీర్లను చూస్తే చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరుగెడతాయి. దత్తపుత్రుడి నోటి నుంచి కించపరిచే వ్యాఖ్యలు వినిపిస్తాయి. మహిళల అదృశ్యానికి వలంటీర్లు కారణమని ఒకడంటాడు. వలంటీర్ల దెబ్బకు ప్రజలు గద్ద కాళ్ల కింద కోడి పిల్లల్లా అల్లాడిపోతున్నారంటాడు. తనకు అధికారం ఇస్తే వలంటీర్ల వ్యవస్థ నడుం విరగ్గొడతానంటాడు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వారి కథ తేలుస్తాం అంటారు. ఇంత మందికి మనం దడ ఎలా పుట్టిస్తున్నామో తెలుసా? ఈరోజు మన ప్రభుత్వం ప్రతి పేదవాడికీ సంక్షేమాన్ని డెలివర్ చేసింది కాబట్టే వాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. విపక్షాల కడుపులు ఎందుకు మండుతున్నాయంటే వారి కడుపులు కాకుండా పేదవాడి కడుపులు నిండుతున్నాయి కాబట్టే. విపక్షాల కడుపు నింపేది అవినీతి ఆకలి మాత్రమే. ఇలాంటి విషవృక్షాలు ఉన్న వ్యవస్థతో మనం యుద్ధం చేస్తున్నాం. 58 నెలలు దాటాం. మీ బిడ్డ ఇంకో 10–15 సంవత్సరాలు ఇదే ముఖ్యమంత్రి స్థానంలో ఉంటే పేదవాడి ఇంట్లో ఒకటో తరగతి చదువుతున్న చిన్న పిల్లాడు అనర్గళంగా ఇంగ్లిషు మాట్లాడతాడు. పేదల తలరాతలు శాశ్వతంగా మారిపోతాయి.

రాజధానిలో భూమిలేని నిరుపేదలకు రూ.5 వేలు పింఛన్

''తాడికొండ, మంగళగిరి రాజధాని ప్రాంతంలో భూమిలేని 17 వేల మంది నిరుపేదలకు జీవనభృతి పింఛన్ రూ.2,500 నుంచి రూ.ఐదు వేలు చేయాలని ఎమ్మెల్యే సుచరిత కోరారు. వచ్చే నెల నుంచే దీన్ని అమలు చేస్తాం. ఫిరంగిపురంలోని కార్మెల్ మాత గుడికి ఘాట్ రోడ్డు కోసం రూ.39 కోట్లు మంజూరు చేస్తున్నాం'' అని సీఎం జగన్ ప్రకటించారు. సమావేశంలో మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బూడి ముత్యాలనాయుడు, ఆదిమూలపు సురేష్, అంబటి రాంబాబు, విడదల రజని, ఎంపీలు నందిగం సురేష్, ఆయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, పోతుల సునీత, కల్పలతా రెడ్డి, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురామ్, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కిలారు రోశయ్య, కాసు మహేష్‌రెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, బొల్లా బ్రహ్మానాయుడు, సమన్వయకర్తలు ఉమ్మారెడ్డి వెంకటరమణ, నూరీ ఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి జగన్‌కు జ్ఞాపికను అందిస్తున్న వలంటీర్లు




సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో అక్కచెల్లెమ్మల కేరింతలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పూలతో స్వాగతం పలుకుతున్న అక్కచెల్లెమ్మలు

ఉద్యోగ విప్లవం



సీఎం జగన్ దాదాపు 2,55,000 మందికి పైగా వలంటీర్ల ద్వారా అందిస్తున్న సేవలు ప్రపంచానికే ఆదర్శం. చంద్రబాబు ఎన్నో హామీలిచ్చి తుంగలోకి తొక్కారు. వలంటీర్ వ్యవస్థ తెచ్చినప్పుడు విమర్శించిన వారు ఇప్పుడు పొగుడుతున్నారు. మన దేశం హరిత విప్లవం, శ్వేత విప్లవం చూసింది. సీఎం జగన్ ఉద్యోగ విప్లవం తెచ్చారు. ఒకే నోటిఫికేషన్‌తో 1,35,000 సచివాలయ ఉద్యోగాలిచ్చారు.

– మేకతోటి సుచరిత, ఎమ్మెల్యే, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త



రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తాం..

నాకు కేటాయించిన 64 కుటుంబాలలో అర్హులను గుర్తించి పథకాలు అందిస్తున్నప్పుడు వారి చిరునవ్వు ఎంతో సంతోషం కలిగిస్తుంది. ప్రతి నెలా పింఛన్ ఇచ్చేటప్పుడు అవ్వాతాతలు మా పెద్దకొడుకుకు దీవెనలు ఉంటాయంటూ మా చేతులను తాకినప్పుడు ఆ అనుభూతిని మరిచిపోలేం. ఆసుపత్రిలో ఉన్న ఓ తాతకు ఒకటో తారీఖు రాత్రి 12 గంటలకు పింఛన్ ఇచ్చా. దురదృష్టవశాత్తూ తరువాత కొద్దిసేపటికే ఆయన చనిపోయారు. ఆయన భార్య నన్ను హత్తుకుంటే ఇది కదా సేవ అని అనిపించింది. తల్లి గర్భంలోని శిశువు నుంచి వృద్ధుల వరకూ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే సీఎంను ఎవరు వదులుకుంటారు? మేం రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తామని వలంటీర్ల తరఫున హామీ ఇస్తున్నా. ప్రజలు మీ కోసం సిద్ధంగా ఉన్నారన్నా. మళ్లీ మీ పాలన కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

– దాసరి జ్యోత్స్ను దేవి, వలంటీర్, గొల్లపాలెం, ఫిరంగిపురం

మీ చిరునవ్వుతో ఆత్మస్థైర్యం

నా క్లస్టర్ లో 62 కుటుంబాలు ఉన్నాయి. అన్ని కుటుంబాలకు మీ పథకాలు అందాయి. మీ ఆశయాలను నిలబెట్టేలా పనిచేశాం. గతంలో సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా ఉండేవి. ఇప్పుడు ప్రతి గడపనూ పలుకరిస్తున్నాయి. కూలి పనులకు వెళ్లిన 22 ఏళ్ల యువకుడు నాలుగో అంతస్తు నుంచి కిందపడి చావు అంచులవరకూ వెళితే ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల ఉచిత వైద్యం సంజీవనిలా పని చేసింది. ఆ కుటుంబానికి ఆరోగ్య ఆసరా నెలకు రూ.5,000 చొప్పున రెండు నెలలకు రూ. 10 వేలు ఇచ్చాం. వలంటీర్ వ్యవస్థను మొదట్లో చాలా మంది కించపరిచారు. మీరు అండగా నిలిచి ధైర్యాన్నిచ్చారు. మీ చిరునవ్వు మాకు ఆత్మస్థైర్యాన్ని ఇస్తుందన్నా. మీరు నా వలంటీర్లు అని ఆప్యాయంగా పలుకరిస్తుంటే రెట్టించిన ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తున్నాం. మా సేవాగుణాన్ని గుర్తించి మాకు ఇచ్చే అవార్డు మొత్తాన్ని పెంచడం చాలా సంతోషంగా ఉందన్నా.

–షేక్ జుబేర్, వలంటీర్, బేతపూడి, ఫిరంగిపురం





వధూవరులకు సీఎం జగన్ ఆశీస్సులు

కర్నూలులోని కింగ్ ప్యాలెస్ గ్రాండ్ కన్వెన్షన్‌లో గురువారం జరిగిన ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మనవడు వివాహ వేడుకకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులు పవన్‌కళ్యాణ్‌రెడ్డి, కీర్తనరెడ్డిలకు సీఎం వైఎస్ జగన్ ఆశీస్సులు అందించారు.

చలిగాలుల విజృంభణ

సాక్షి, పాడేరు(అల్లూరి సీతారామరాజు జిల్లా): శీతాకాలం ముగుస్తున్న సమయంలో అల్లూరి సీతారాజు జిల్లాలో చలి గాలులు విజృంభిస్తున్నాయి. చింతపల్లిలో నాలుగు రోజుల నుంచి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం 7.6 డిగ్రీలు నమోదవగా, పాడేరు మండలం మినుములూరులో 12 డిగ్రీలు, అరకులోయలో 12.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేకువజామున పొగమంచు కురుస్తున్నప్పటికీ 7గంటలకే సూర్యోదయమవుతోంది.



పాడేరు ప్రాంతంలో తెల్లవారుజామున పొగమంచు

అంధుల భారత్ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా దుర్గారావు

- వెల్లడించిన క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా
- విజయనగరం జిల్లా కొప్పురవలసలో సంబరాలు

వంగర: విజయనగరం జిల్లా వంగర మండలం కొప్పురవలస గ్రామానికి చెందిన టొంపాకి దుర్గారావు (26)ను భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్‌గా క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా (కేబీ) ఎంపిక చేసింది. ఈ విషయాన్ని అసోసియేషన్ చైర్మన్ కె.మహేంతేష్ గురువారం ఢిల్లీలో ప్రకటించారు.

దుర్గారావు నేపథ్యమిదీ

నిరుపేద కుటుంబానికి చెందిన దుర్గారావు చిన్నతనంలోనే తండ్రి దాలయ్య మరణించారు. తల్లి సుందరమ్మ రెక్కల కష్టంతో దుర్గారావును పెంచి పెద్దచేశారు. విజయనగరం జిల్లా మెట్టవలస అంధుల పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. ఇంటర్ సికింద్రాబాద్‌లో, డిగ్రీ హైదరాబాద్‌లోని కాలేజీల్లో పూర్తిచేశాడు. అంధుల క్రికెట్‌లో భారత్ తరపున రాణిస్తూ అందరి దృష్టిని ఆకర్షించాడు. రెండుసార్లు అంధుల వన్డే క్రికెట్ ప్రపంచ కప్, మూడుసార్లు అంధుల టీ–20 వరల్డ్ కప్ భారత్ కైవసం చేసుకోవడంలో దుర్గారావు కీలక పాత్ర పోషించాడు. 2014 భారత అంధుల క్రికెట్ జట్టులో ఆల్ రౌండర్‌గా ఆరంగేట్రం చేశాడు. 2014 నవంబర్ 7 నుంచి డిసెంబర్ 25 వరకు దక్షిణాఫ్రికాలో జరిగిన అంధుల క్రికెట్ ప్రపంచకప్‌ను సొంతం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో 2016 జనవరి 28 నుంచి ఫిబ్రవరి 12 వరకు భారత్‌లో జరిగిన టీ–20 జట్టులో స్థానం లభించింది. 2018 జనవరిలో దుబాయ్‌లో జరిగిన అంధుల వరల్డ్ కప్‌లో కూడా ఆల్‌రౌండర్‌గా ప్రతిభ చాటాడు. 2019లో వెస్టిండీస్‌లో ద్వైపాక్షిక సిరీస్‌లో సత్తా చాటి భారత్‌కు విజయాన్ని అందించాడు. 2022 భారత్‌లో జరిగిన వరల్డ్ కప్ విజయంలోనూ, ఇంటర్నేషనల్ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ (ఇబ్సా) లండన్‌లో జరిగిన క్రికెట్ టోర్నీలో ద్వితీయ స్థానం సాధించడంలో కీలక భూమిక పోషించాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 21నుంచి 26 వరకు దుబాయ్‌లో జరిగే ఇండియా, పాకిస్తాన్, శ్రీలంక దేశాల ముక్కోణపు టోర్నీకి భారత అంధుల క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించనున్నాడు.



2021లో దుర్గారావును అభినందిస్తున్న భారత ప్రధాని మోదీ (ఫైల్)



దుర్గారావుకు కేటాయించిన జెర్సీ

నా ఆశయానికి అమ్మే తోడు

నేను మంచి క్రికెటర్‌గా ఎదగాలని ఆకాంక్షించాను. కష్టపడి సాధన చేశాను. నా ఆశయానికి మా అమ్మ సుందరమ్మ సహకారం తోడైంది. పాఠశాల, కళాశాలల్లో ఉపాధ్యాయులు, స్నేహితులు ప్రోత్సాహం నాకు మరింత ఉత్సాహాన్నివ్వడంతో భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాను. కష్టపడితే ఎంతటి విజయమైనా సిద్ధిస్తుందని నమ్ముతాను. ఇదే నా విజయ రహస్యం

– టొంపాకి దుర్గారావు,
కెప్టెన్ భారత అంధుల జట్టు

ఓవరాల్ చాంపియన్ ఏపీ గ్రేహౌండ్స్

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన 14వ అఖిల భారత కమాండో పోటీల్లో ఏపీ గ్రేహౌండ్స్ విభాగం ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ఈ పోటీల్లో ఉత్తమ పోలీస్ కమాండో టీమ్, చక్రవ్యూహం–1 రూరల్, ఉత్తమ బ్లాక్ హాక్ ఫైరింగ్, టీమ్ ఇన్ కాన్ఫిడెన్స్ కోర్సులను ఏపీ గ్రేహౌండ్స్ జట్లు గెలుచుకున్నాయి. దీంతో ఏపీ గ్రేహౌండ్స్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ఈ పోటీల్లో మహారాష్ట్ర రెండో స్థానం, గుజరాత్ మూడో స్థానంలో నిలిచాయి. అగ్రస్థానంలో నిలిచిన ఏపీ గ్రేహౌండ్స్ కమాండో జట్లను డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీ (గ్రేహౌండ్స్) ఆర్‌కే మీనాతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

తూనికల్లో మోసాలపై 176 కేసులు నమోదు

సాక్షి, అమరావతి: తూనికలు–కొలతల శాఖ అధికారులు రాష్ట్రంలో పలు ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలు, వంటనూనెల ఏజెన్సీలు, పలు సూపర్ మార్కెట్లు, రైతు బజార్లలో గురువారం తనిఖీలు నిర్వహించారు. విజయవాడ, ఒంగోలు, కావలి, తిరుపతి, కర్నూలు, రాజమహేంద్రవరం, పార్వతీపురం, పలాసలలో 428 చోట్ల సోదాలు నిర్వహించి తూనికలు, కొలతల్లో మోసాలకు సంబంధించి 176 కేసులు నమోదు చేశారు. వాటిలో వంటనూనెల ఏజెన్సీలపై 12 కేసులు, ఎల్‌పీజీ ఏజెన్సీలపై 21 కేసులు, రైతు బజార్లలో దుకాణాలపై 33 కేసులు, సూపర్ మార్కెట్లపై 57 కేసులు, ఇతరులపై 53 కేసులు ఉన్నాయి.

గిరిజన గురుకులాల సంస్థ కార్యదర్శిగా భార్గవి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకులాల సంస్థ(ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్) కార్యదర్శిగా సదా భార్గవి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండేలను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం భార్గవి మాట్లాడుతూ...ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసి గిరిజన విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన విద్య అందించేలా కృషి చేస్తానన్నారు.

ఎవడైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తాడో అతనికి మంచి ప్రతిఫలముంటుంది. మేము అతనిని ఆజ్ఞాపించినపుడు, సులభతరమైన ఆజ్ఞనే ఇస్తాము.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 16 ఫిబ్రవరి 2024

బంధం బలపడుతోంది!

ప్రధానమంత్రిగా తన రెండో విడత పదవీకాలం ముగిసిపోనున్న వేళ నరేంద్ర మోదీ చేస్తున్న తుది అంతర్జాతీయ పర్యటనల్లో ఒకటి గత రెండు మూడు రోజులుగా ఆసక్తి రేపుతోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో, ఆ వెంటనే ఖతార్‌లో సాగిన మోదీ పర్యటన ఘన విజయం సాధించిందనే చెప్పాలి. అబుదాబిలో స్వామి నారాయణ్ ఆలయ ప్రారంభోత్సవం, ఈ పర్యటనకు సరిగ్గా ఒక రోజు ముందే ఖతార్ నుంచి ఎనిమిది మంది భారత మాజీ నౌకాదళాధికారుల విడుదల, దుబాయ్‌లోని వరల్డ్ గవర్నమెంట్ సమిట్‌లో ఇతర దేశాలు చెవి ఒగ్గి మన మాట వినేలా చేయడంలో భారత విజయం... ఇవన్నీ ఛాతీ ఒకింత ఉప్పొంగే క్షణాలు. కృత్రిమ మేధ (ఏఐ), క్రిప్టో కరెన్సీ సహా పలు అంశాలపై ప్రపంచ దేశాల మధ్య సహకారానికి పిలుపునిస్తూ, ప్రపంచానికి ఇప్పుడు కావాల్సింది సమ్మిళిత, స్వచ్ఛ, పారదర్శక, పర్యావరణ హిత ప్రభుత్వాలని భారత ప్రధాని పేర్కొనడం సైతం ఆకర్షించిందనే చెప్పాలి. వెరసి, అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడితో భారత ప్రధానికి ఉన్న ప్రత్యేక అనుబంధం రెండు దేశాలనూ మరింత సన్నిహితం చేస్తోంది. నమ్మకమైన ఇలాంటి మిత్రదేశం చలవతో గల్ఫ్ ప్రాంతంలో భారత ప్రాబల్యం మరింత పెరగడం ఖాయమనిపిస్తోంది.

తాజా పర్యటనలో భాగంగా యూఏఈ రాజధాని అబుదాబిలో 'ఎహ్లాన్ మోదీ' (మోదీకి స్వాగతం) కార్యక్రమం అట్టహాసంగా సాగింది. అక్కడి పాలకులను ప్రశంసిస్తూ, ప్రవాస భారతీయులను ఉత్తేజపరుస్తూ ఆ కార్యక్రమాన్ని రూపొందించారు. ఆ హంగామా కానీ, ఆ మర్నాడు చేసిన భారీ హిందూ దేవాలయ ప్రారంభోత్సవం కానీ భారత్, గల్ఫ్‌సీమల మధ్య బలపడుతున్న బంధానికి ప్రతీకలే. చెప్పాలంటే, మన దేశం దృష్టిలో పశ్చిమాసియాకు ముఖద్వారం అబుదాబి. అందుకే 2015 ఆగస్ట్‌లో మోదీ తొలిసారిగా ఈ గల్ఫ్‌దేశాన్ని సందర్శించారు. 1981లో ఇందిరా గాంధీ అనంతరం భారత ప్రధాని ఒకరు అక్కడికి వెళ్ళడం అదే తొలిసారి. మూడు దశాబ్దాల పైచిలుకు తర్వాత మొదలుపెట్టినా అప్పటి నుంచి ఈ తొమ్మిదేళ్ళలో 7 సార్లు యూఏఈ వెళ్ళారు మోదీ. విస్తృత ద్వైపాక్షిక అజెండాకూ, ఇరు దేశాల మధ్య బలమైన బంధానికీ అది బలమైన పునాది అయింది. పనిలో పనిగా యూఏఈలోని ప్రవాస భారతీయుల దీర్ఘకాలిక వాంఛకు తగ్గట్టుగా హిందూ ఆలయ నిర్మాణానికి స్థలం కోరారు. ఆ దేశం అంగీకరించింది. సంప్రదాయవాద ఇస్లామిక్ దేశంలో, పూర్తిగా ఆ దేశ పాలకుల అండతో, 27 ఎకరాల విశాల ప్రాంగణంలో అత్యంత భారీ హిందూ దేవాలయ నిర్మాణం జరగడం, దాని ప్రారంభోత్సవానికి భారత ప్రధాని వెళ్ళడం అనూహ్యం, అసాధారణం.

ఇరుదేశాల మధ్య గాఢమైన బంధాన్ని పరస్పర ప్రయోజనాలు ప్రోది చేశాయి. యూఏఈలో దాదాపు 35 లక్షల మంది ప్రవాస భారతీయులున్నారని లెక్క. ఏడు దేశాల సమూహమైన యూఏఈ మన వాళ్ళకు ఉపాధి అందించే కేంద్రం. ఫలితంగా, అక్కడి నుంచి మన దేశానికి ధన ప్రవాహం సరేసరి. గల్ఫ్‌సీమకు సైతం మనం వాణిజ్యానికీ, వ్యూహాత్మకంగా నమ్మదగిన దేశమయ్యాం. వీటన్నిటి ఫలితంగా స్థానిక రాజకీయాలతో సంబంధం లేకుండా కొన్నేళ్ళుగా బంధం బలపడిందన్న మాట. అసలు పశ్చిమాసియాలోని వివిధ శక్తిసంపన్న దేశాలతో చారిత్రకంగా మన దేశానికి మంచి సత్సంబంధాలు ఉన్నాయి. సున్నీల ప్రాబల్యమున్న సౌదీ అరేబియా నుంచి షియాలు చక్రం తిప్పే ఇరాన్ వరకు అన్నీ మనకు మిత్రదేశాలే. ఆ మధ్య కొన్నేళ్ళుగా అరబ్ ప్రపంచానికీ, ఇజ్రాయెల్‌కూ మధ్య సర్దుబాటు చేసే క్రమంలో పశ్చిమాసియాతో మన బంధం మరింత దృఢమవుతూ వచ్చింది. ఇక, భారత్, ఇజ్రాయెల్, యూఏఈ, అమెరికాల మధ్య ఐ2యూ2 సాంకేతిక సహకారం నిమిత్తం 2022 జూలైలో అమెరికాతో కలసి మనం సంతకాలు చేశాం.

ఖతార్ సైతం భారత్‌లో గణనీయంగా పెట్టుబడులు పెడుతోంది. అంతేకాక, భారత్ చేసుకొనే ద్రవీకృత సహజవాయు (ఎల్ఎన్‌జీ) దిగుమతుల్లో సగభాగం ఖతార్ చలవే. పైగా రష్యా ఇంధనంపై ఆధారపడడాన్ని తగ్గించుకొనేలా ఒప్పందాల కోసం యూరప్ సైతం ఈ ప్రాంతం వైపు చూస్తున్న సమయంలో... భారత్ – ఖతార్‌ల మధ్య దీర్ఘకాలిక ఇంధన సరఫరా ఒప్పందం సంతోషదాయక విషయం. నిజానికి, 2022లోనే ఇరుదేశాలూ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేసి, 100 బిలియన్ డాలర్ల స్థాయికి చేర్చాలని బాస చేసుకున్నాయి. ఇంధనం, డిజిటల్ లావాదేవీలు సహా పలు అంశాలపై ఒప్పందాలు కుదరడం విశేషం. ఇక, ఇండియా – మధ్యప్రాచ్యం– యూరప్ ఆర్థిక నడవాకు సంబంధించి ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒడంబడిక అత్యంత కీలకమైనది. చైనా చేపట్టిన 'బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్'కు ప్రత్యామ్నాయమని భావిస్తున్న నడవాను గత సెప్టెంబర్‌లో ఢిల్లీలో జీ20 సదస్సు వేళ ప్రకటించారు. గాజాలో యుద్ధం కారణంగా దాని భవిష్యత్తుపై ప్రస్తుతం కొంత నీలినీడలు పరుచుకున్నా ఒక్కసారి అమలైతే ప్రాంతీయ అనుసంధానాన్ని అది పెంచుతుంది.

అబుదాబిలో దిగితే అచ్చం స్వదేశంలో ఉన్నట్టే ఉందని భారత ప్రధాని వ్యాఖ్యానించడం గమనార్హం. వినడానికి కాస్త అత్యుక్తిగా అనిపించినా, ఆ మాటల్లో వాస్తవం లేకపోలేదు. భారత్ – అరబ్ ఎమిరేట్స్ మధ్య సాంస్కృతికంగా, ఆర్థికంగా, భౌగోళిక రాజకీయాల పరంగా సత్సంబంధాల సంచిత ఫలితమది. ముస్లిమ్ మెజారిటీ దేశంలో ఒక అతి పెద్ద హిందూ ఆలయ నిర్మాణం పెరుగుతున్న ధార్మిక సహిష్ణుతకు చిహ్నమనే చెప్పాలి. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో ఆయుధాలు, సైనిక టెక్నాలజీల విషయంలోనూ గల్ఫ్, భారత్ కలసి అడుగులు వేస్తే మంచిది. పశ్చిమ హిందూ మహా సముద్రంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయి. పరస్పర వ్యూహాత్మక ప్రయోజనాలూ నెరవేరుతాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** శు.సప్తమి ప.2.38 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** భరణి ప.2.21 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.2.01 నుండి 3.34 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.49 నుండి 9.34 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.21 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.43 నుండి 11.16 వరకు, రథసప్తమి.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం: 5.57
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

భద్రతా మండలిలో చోటుకు బదులు...

విశ్లేషణ



కె.పి. నాయర్

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశ హోదా కోసం భారత్ పావు శతాబ్ద కాలంగా విఫలయత్నం చేసింది. మండలి విస్తరణ జరిగినా చోటు దొరక్కపోతే మళ్లీ మరో పాతికేళ్ళు వృథా అవుతుంది. అందుకే ఆ ప్రయత్నాలను కొనసాగిస్తూనే, ప్రత్యామ్నాయంగా భిన్న దేశాల కూటములతో కలిసి పనిచేయాలన్న కచ్చితమైన నిర్ణయం భారత్ తీసుకుంది. ప్రపంచ సమస్యలపై ఎజెండాను రూపొందించడానికి ప్రయత్నిస్తోంది. 'ఐఎస్ఏ', 'సీడీఆర్ఐ' లాంటి సమూహాల స్థాపనకు చొరవ తీసుకోవడమే కాకుండా, వాటి కార్యాలయాలను ఢిల్లీలో ఏర్పాటు చేయించడంలో విజయం సాధించింది. క్వాడ్, ఐ2యూ2 లాంటి సమూహాలతో కూడా సాగుతూ భారత్ ప్రాభవాన్ని పెరిగేలా చూడటం మన దౌత్య పురోగతికి సంకేతం.

దౌత్యపరంగా ప్రపంచంలోనే అత్యున్నత వేదిక అయిన భద్రతా మండలిలో శాశ్వత స్థానం కోసం భారత్ ఇక ఎదురుచూడటం లేదు. ఐక్యరాజ్యసమితి (ఐరాస)కి చెందిన అత్యంత ముఖ్యమైన ఈ విభాగంలో సమాన ప్రాతినిధ్య లక్ష్యం దిశగా పావు శతాబ్ద కాలంగా చేస్తూ వచ్చిన ప్రయత్నాలు పెద్ద పురోగతిని సాధించలేదు. భద్రతా మండలి విస్తరణలో కూడా మరో పాతికేళ్ళ కాలం భారత్ వంటి ఆశావహులను పక్కదారి పట్టించవచ్చనేది ఇప్పుడు కేంద్రప్రభుత్వానికి ఆందోళన కలిగిస్తోంది.

అందుకే, అంతుచిక్కని ఐక్యరాజ్యసమితి సంస్కరణల లక్ష్యం కోసం ఎదురుచూడకుండా ప్రపంచ వేదికపై తన పాద ముద్ర వేయడానికి, చిన్న చిన్న దేశాల సమూహాలతో కలిసి పనిచేయాలని నరేంద్ర మోదీ ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయం తీసుకుంది. భారత్ 37 బహుపాక్షిక సమూహాలలో చేరింది. అంతేకాకుండా, భద్రతా మండలికి బదులుగా ప్రపంచ సమస్యలపై ఎజెండాను రూపొందించడానికి ప్రయత్నిస్తోంది.

విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి. మురళీధరన్ ఫిబ్రవరి 8న రాజ్యసభలో మాట్లాడుతూ, ఈ బహుపాక్షిక సమూహాలు ''వాణిజ్యం, పెట్టుబడి, సాంకేతికత, రక్షణ సహకారం సహా అనేక రంగాలలో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి భారత్‌కు వీలు కల్పిస్తాయి. ఇలాంటి ఫలితాలు భారత్ జాతీయ అభివృద్ధి ఎజెండాకు దోహదం చేస్తాయి, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తాయి, మన ప్రజల శ్రేయస్సును మెరుగుపరుస్తాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను ముందుకు తెస్తాయి'' అని చెప్పారు.

ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ (ఐఎస్ఏ) అనేది భారత్ ఆలోచన. 2015లో ప్యారిస్‌లో జరిగిన 21వ వాతావరణ మార్పు సదస్సులో అప్పటి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హోలాండే అందించిన మద్దతు ఈ భావనను ఫ్రాంకో–ఇండియన్ ఉమ్మడి ప్రయత్నంగా మార్చింది. ఇది మోదీ ప్రభుత్వ మొట్టమొదటి బహుపాక్షిక చొరవ. కాబట్టి, ఇది ప్రారంభం కావడానికి కాస్త సమయం పట్టింది. అయితే ఐఎస్ఏ ప్రధాన కార్యాలయం ఢిల్లీలోని జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీటీ)లో ఉన్నందున ఇది భారత ప్రతిష్ఠను మరింతగా పెంచింది. అనేక దశాబ్దాలుగా మన దేశమే సమస్యగా ఉండటం కాకుండా, వాతావరణ మార్పుపై సమస్య–పరిష్కర్తగా మారేట్టు చేసి, భారత ఖ్యాతిని పెంచింది.

సీడీఆర్ఐ విషయానికి వస్తే, దానికి ఐఎస్ఏ లాగా అంత పేరు లేదు. ఇది 2019లో ఏర్పడిన కొత్త, ముఖ్యమైన భాగస్వామ్యం. ఇది వాతావరణానికి తట్టుకోగల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి... బహుపాక్షిక ఏజెన్సీలు, అభివృద్ధి బ్యాంకులు, ప్రైవేట్ రంగం, విద్యాసంస్థలతో కలిసి పనిచేయడానికీ ప్రభుత్వాలను ఒక చోటికి తీసుకువస్తుంది. 2016లో జరిగిన విపత్తు నష్టభయం తగ్గింపుపై జరిగిన ఆసియా మంత్రుల సదస్సులో మోదీ అటువంటి కూటమి ఆలోచనను ప్రతిపాదించారు. అయితే ఈ ఆలోచనను దాని భాగస్వాములు ఆమోదించడానికీ, సీడీఆర్ఐని రూపొందించడానికీ మరో మూడేళ్లు పట్టింది. సీడీఆర్ఐ ప్రధాన కార్యాలయం కూడా న్యూఢిల్లీలో ఉంది.



ఐఎస్ఏ ప్రారంభ సదస్సులో ఇతర దేశాల నేతలతో ప్రధాని మోదీ

అనేక దశాబ్దాలుగా, జెనీవా, నైరోబీ, వియన్నా వంటి మెట్రోలకు లాగే తన నగరాల్లో ఒకదానిని ఐక్యరాజ్యసమితి నగరంగా ప్రకటించాలని భారత్ ఆకాంక్ష. పైన పేర్కొన్న నగరాలు న్యూయార్క్‌కు అనుబంధ, ద్వితీయ ప్రధాన కార్యాలయంగా పని చేస్తాయి. ఇక్కడ ఐరాస వార్షిక జనరల్ అసెంబ్లీ వంటి అతి ముఖ్యమైన కార్యకలాపాలు సాగుతాయి. అయితే, భారత్ కోరుకున్నట్లు జరగలేదు. తన ప్రధాన నగరాల్లో ఒకదానిలో ప్రాంతీయ ఆర్థిక సంఘాన్ని నెలకొల్పేలా ఐరాసను భారత్ ఒప్పించలేకపోయింది. అడిస్ అబాబా, బ్యాంకాక్, బీరూట్, జెనీవా, శాంటియాగోలకు ఈ ఘనత లభించింది. అందువల్ల, భారత్‌లో సీడీఆర్ఐ, ఐఎస్ఏ కార్యాలయాలను నెలకొల్పటానికి వ్యవస్థాపక సభ్యదేశాలను ఒప్పించటం గొప్ప విషయం. నేడు ఈ రెండు సంస్థలు పెద్ద సంఖ్యలో భారతీయులకు ఉపాధి కల్పిస్తున్నాయి. న్యూఢిల్లీకి మకాం మార్చి, ఈ సంస్థలలో పని చేయడానికి విదేశాల నుంచి కూడా నిపుణులను రప్పించారు. జాతీయ రాజధాని ప్రాంతం ఈ సంస్థల నుండి అనుబంధ ప్రయోజనాలను పొందుతుంది. వారి ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ కార్యక్రమాల ద్వారా సమావేశాలు, ప్రదర్శనలకు న్యూఢిల్లీ ఒక ముఖ్యమైన వేదికగా ఎదుగుతుంది.

భారత్ సభ్యురాలిగా ఉన్న అతి ముఖ్యమైన బహుళజాతి సమూహం ఏదంటే నిస్సందేహంగా క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్. దీనిని సరళంగా క్వాడ్ అని పిలుస్తున్నారు. ఇది భారత్, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికాలను ఒకచోట చేర్చింది. క్వాడ్‌కు భారత్‌లో సంశయవాదులు మాత్రమే కాకుండా కొన్నిసార్లు తీవ్రమైన వ్యతిరేకులు కూడా లేకపోలేదు. కానీ భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ 'వై భారత్ మ్యాటర్స్' పుస్తకంలో, క్వాడ్ గురించి చాలా ముఖ్యమైన కానీ తరచుగా నిర్లక్ష్యం చేయబడిన అంశాన్ని పేర్కొన్నారు. భారత్‌కు 'ఇటీవలి కాలంలో చాలా స్పష్టంగా అభివృద్ధి చెందిన సంబంధం ఆస్ట్రేలియాతోనే' అని రాశారు. జైశంకర్ ప్రకారం, ఈ క్వాడ్ సభ్యదేశంతో పెరుగుతున్న సంబంధాలు ఇతర క్వాడ్ సభ్యదేశాలైన జపాన్, అమెరికాలతో సంబంధాలలో అంతరాన్ని తగ్గించాయి. అధికారిక అంచనా, ప్రజల అవగాహన రెండింటిలోనూ జపాన్, అమెరికాతో భారత్ సంబంధాలు చాలా ముఖ్యమైనవి.

జైశంకర్ వాదనను అంగీకరించినట్లయితే, బహుపాక్షిక క్వాడ్ నిజానికి సాధారణంగా అంగీకరించిన దానికంటే పెద్ద ద్వైపాక్షిక ప్రయోజనాన్ని అందిస్తోంది. గత సంవత్సరం, క్వాడ్ మొదటిసారిగా ఐరాస భద్రతా మండలి సంస్కరణపై అంతర్–ప్రభుత్వ చర్చలకు మద్దతు ఇచ్చింది. ఐక్యరాజ్యసమితిని వాస్తవానికి ఏర్పాటు చేయడానికి కారణమైన ప్రశంసనీయమైన లక్ష్యాలను అణచివేసే ప్రయత్నాలను అడ్డుకోవడానికి కలిసి పనిచేయడానికి అంగీకరించింది. జైశంకర్ ప్రకారం, క్వాడ్ 'రెండు దశాబ్దాలుగా కీలక సంబంధాలలో భారత దేశం సాధించిన పురోగతి సమాహారం'.

ఇండియా, ఇజ్రాయెల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలతో కూడిన 'ఐ2యూ2' కూటమి కూడా పూర్తిగా భారత్‌కు మాత్రమే ప్రయోజనం చేకూర్చింది. యూఏఈ పెట్టుబడులు, ఇజ్రాయెల్ నీటిపారుదల సాంకేతికతతో మధ్యప్రదేశ్‌లో ఫుడ్ పార్కుల నెట్‌వర్క్ స్థాపన జరిగింది. రెండో ఐ2యూ2 ప్రాజెక్ట్ అమెరికా నిధులతో గుజరాత్‌లో విద్యుదుత్పత్తి కోసం సౌరశక్తిని ఉపయోగించాలని భావిస్తోంది. అయితే, పశ్చిమాసియాలో పెరుగుతున్న సంఘర్షణ దృష్ట్యా కొత్త ఐ2యూ2 ప్రాజెక్ట్‌లు ముందుకు సాగడానికి చాలా సమయం పట్టనుండటం విచారకరం.

ఇలాంటి మరెన్నో సమూహాలకు కేంద్రంగా ఉంటున్న భారత్‌తో బహుళజాతి కార్యక్రమాలు, త్రైపాక్షికత పెరుగుతుండటం అనేవి భారతీయ దౌత్య పురోగతికి సంకేతం. భారత్, ఫ్రాన్స్, యూఏఈ తమ 'ఫోకల్ పాయింట్స్ గ్రూప్'ను 2022లో ఏర్పాటు చేశాయి. ఇది రక్షణ, విపత్తు నిర్వహణ నుండి ప్రాంతీయ అనుసంధానం, ఆహార భద్రత వరకు అనేక రంగాలలో పురోగమిస్తోంది. ఈ మోడల్ మాదిరిగానే భారత్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా కాలానుగుణంగా 'ఫోకల్ పాయింట్ల సమావేశాలను' నిర్వహిస్తున్నాయి. అంత మాత్రాన ఇదంతా భద్రతా మండలి శాశ్వత సభ్యత్వానికి వీడ్కోలు చెప్పడం కానే కాదు. కానీ ఫ్రెంచ్‌వారన్నట్లు 'మనం మళ్లీ కలిసేవరకు' కొనసాగుతాయని అర్థం.

వ్యాసకర్త వ్యూహాత్మక అంశాల విశ్లేషకుడు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పెళ్లికి సిద్ధం



షి సెడ్ యెస్– ఆమె అవునని చెప్పింది. (పెళ్లికి తన స్నేహితురాలు జోడీ హేడన్ అంగీకరించిందనీ, తమ నిశ్చితార్థం జరిగిందనీ ఫొటో షేర్ చేశారు.)

– ఆంథోనీ అల్బనీస్, ఆస్ట్రేలియా ప్రధాని

మోస్ట్ వాంటెడ్



ఇప్పటికే రామ్‌లల్లా 2024 సాధారణ ఎన్నికల్లో 400 సీట్ల సంగతి చూసుకున్నాడని అనుకున్నాను. మరెందుకు ఒకప్పుడు అవినీతి నేతలని దూషించినవాళ్లనే బీజేపీ గట్టిగా లాక్కునేందుకు ప్రయత్నిస్తోంది? ఈ లెక్కలో త్వరలో నేను కూడా వాళ్లకు కావాలి.

– మహువా మొయిత్రా, తృణమూల్ నేత

దేవుడికీ తప్పదా?



ఆఖరికి తండ్రిగా దేవుడు కూడా నిస్సహాయుడన్నమాట! ('మహాభారత్' ధారావాహికలో కృష్ణుడి పాత్ర పోషించిన నితీశ్ భరద్వాజ్... విడిగా ఉంటున్న భార్య తమ కుమార్తెలను చూడనివ్వకుండా మానసికంగా హింసిస్తోందని ఫిర్యాదు చేశారని వార్త.)

– దీపికా నారాయణ్ భరద్వాజ్, యాక్టివిస్ట్

గైడ్లు దేవుళ్లా?



'పీహెచ్‌డీ ఇవ్వను' అని తన గైడ్ బెదిరించినట్టు ఒక మొదటి సంవత్సర పరిశోధక విద్యార్థి ఫిర్యాదు చేశాడు. అసలు గైడ్ పీహెచ్‌డీ ఇస్తాడని ఎందుకు అనుకుంటారో నాకు అర్థం కాదు. పీహెచ్‌డీ అనేది సాధించుకునేది, దానంగా ఇచ్చేది కాదు. ఈ 'హుజూర్' అనిపించుకునే జాడ్యం వల్లే... మనల్ని మనం దేవుని అవతారాలని అనుకుంటాం.

– అభిజిత్ మజుందార్, ఐఐటీ బాంబే ప్రొఫెసర్

మంచి తీర్పు



ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని గౌరవనీయ సుప్రీంకోర్టు సరైన తీర్పునిచ్చింది. ఇది ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతనూ, వ్యవస్థలో సమగ్రతనూ తెస్తుంది. ఈ తీర్పు ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడంతో పాటు, అన్ని రాజకీయ పార్టీలకూ సమాన అవకాశాన్ని కల్పించింది.

– ఎం.కె.స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి

షుక్రియా, యూఏఈ!



ముస్లింల పట్ల సానుకూల, సహనశీల, సామరస్యపూర్వక ఇమేజ్ కలిగించేలా వ్యవహరించిన యూఏఈ స్థానికులు, పాలకులకు ధన్యవాదాలు (యూఏఈలో హిందూ ఆలయం ప్రారంభమైన నేపథ్యంలో.) అత్యధిక సున్నీ దేశాలు (ఖతార్, ఈజిప్ట్, టర్కీ, అఫ్ఘానిస్తాన్, పాకిస్తాన్, మాల్దీవులు లాంటివి), అలాగే సున్నీ దేశం కాని ఇరాన్ దురదృష్టవశాత్తూ తమ క్షుద్ర దౌత్యం ద్వారా ముస్లింలకు అప్రతిష్ఠ తెస్తున్నాయి.

– యానా మీర్, జర్నలిస్ట్

దొందూ దొందే



తాము అధికారంలోకి వస్తే కనీస మద్దతు ధర మీద స్వామినాథన్ నివేదికను అమలు చేస్తామని కాంగ్రెస్ అంటోంది. నివేదిక 2006లోనే సిద్ధంగా ఉంది. మరి మన్మోహన్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేదు? మోదీ ప్రభుత్వం 2022లో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామంది. ఆ వాగ్దానం ఏమైంది?

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

సైన్స్ సేవకుడు

సామాజిక రుగ్మతల నిర్మూలనకు సైన్సే అస్త్రంగా ముందుకు నడిచిన వైజ్ఞానిక గురువూ, విజ్ఞాన శాస్త్రమే ఊపిరిగా జీవించిన వ్యక్తి, జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ముంద్ర ఆదినారాయణ. ఆయన మృతి వైజ్ఞానిక సమాజానికి తీరనిలోటు. 'జన విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో జనగామలో జరిగిన 'చెకుముకి' సైన్స్ సంబరాల్లో ఆయన పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో సైన్సు చర్చలు జరిపారు. ఈ కార్యక్రమం మధ్యలోనే ఫిబ్రవరి 11వ తేదీన గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త సైన్స్ అభిమానులను దిగ్భ్రాంతికి గురి చేసింది. సూర్యాపేట జిల్లా నల్లబండ గూడెం ఆయన స్వస్థలం. ఉస్మానియా యూనివర్సిటీలో రసాయన శాస్త్ర ప్రొఫెసర్ పనిచేశారు.



ప్రొ॥ ముంద్ర ఆదినారాయణ

20 ఏళ్లుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచే జన విజ్ఞాన వేదికలో అనేక హోదాల్లో చురుగ్గా పనిచేశారు. 2016 నుంచి 2018 వరకు జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. సైన్స్ ప్రచార ఉద్యమానికి గొప్ప మార్గ నిర్దేశిగా ఉన్నారు. తెలుగు అకాడమీకి రసాయన, భౌతికశాస్త్రం పుస్తకాలు రాస్తూ, సంపాదకులుగా కూడా వ్యవహరించిన గొప్ప మేధావి. కృత్యాధార బోధన ద్వారా సైన్స్ పట్ల అభిరుచి కల్పించడానికి రాష్ట్రవ్యాప్తంగా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం మరిచిపోలేని జ్ఞాపకం. ప్రభుత్వ సహకారంతో 85 ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడమే దీనికి నిదర్శనం. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులచే విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కనబరిచేలా చేశారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి తపన పడిన ప్రొఫెసర్ ఆదినారాయణ వృద్ధాప్యాన్ని కూడా లెక్కచేయలేదు. అంతిమ శ్వాస వరకు నిజాయితీ, నిబద్ధతతో శాస్త్ర ప్రచార ఉద్యమానికి సమయాన్ని ఇచ్చి ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడుస్తూ వైజ్ఞానిక సమాజ నిర్మాణానికి నడుం బిగించాలి. అదే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి.

– సంపతి రమేష్ మహారాజ్, జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

సేవాదీపాలకు నీరాజనాలు

ఒక వ్యవస్థ ప్రజలకు చేరువ కావడం ఎంతో శ్రమ, అంకితభావం ఉంటేకానీ సాధ్యం కాదు. అలాంటి వ్యవస్థను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సృష్టించి దాని ద్వారా ప్రజల గడపల్లోకి ప్రభుత్వ పాలనా ఫలాల్ని చేరుస్తూ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆ వ్యవస్థ పేరే 'వాలంటీర్'.

ఈ రోజు వాలంటీర్ అంటే ఇంటింటికీ ఒక భరోసా. ఒక ఆసరా. ఊరికి ఓ ఊతకర్ర. ఏఏ పథకాల లబ్ధి ఎప్పుడు లభిస్తుందో తెలియచెప్పే ఒక దిక్సూచి. ఊరంతటినీ తమ సేవలతో పొదువుకున్న సంక్షేమ వ్యవస్థకు వాలంటీర్ ఒక ప్రతిరూపం. ఊరికి ఇంతగా దగ్గరైన వ్యవస్థను మనం ఇంతకు ముందెన్నడూ ఏ ప్రభుత్వంలోనూ చూసిందే లేదు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి ఈ వ్యవస్థ ప్రతిరూపం.

అధికారంలోకి వచ్చిన కొద్ది వ్యవధిలోనే అంటే 2019 అక్టోబరు 2న జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కరప గ్రామంలో 'గ్రామ సచివాలయ– వాలంటీర్' వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. 18–35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారిని వాలంటీర్లుగా ఎంపిక చేయాలన్న లక్ష్యంతో పార్టీ, వర్గ విభేదాలు లేని విధంగా ఈ వ్యవస్థకు రూపకల్పన చేశారాయన. మైదాన ప్రాంతాల వారైతే కనీసం ఇంటర్మీడియట్, గిరిజన ప్రాంతీయులైతే పదో తరగతి ఉత్తీర్ణత అర్హతగా పారదర్శకంగా వాలంటీర్లను ఎంపిక చేశారు. అన్ని సామాజిక వర్గాల నుంచి వలంటీర్లను ఎంపిక చేయడం మరో విశేషం. ఆంధ్రప్రదేశ్ మొత్తంగా 15,006 సచివాలయాలు, 2.6 లక్షల మందికి పైగా వాలంటీర్లు, 1.5 కోట్ల కుటుంబాలకు ఉపకారులయ్యారు.

ప్రతీ నెల ఒకటో తేదీ సూర్యోదయానికి ముందే రాష్ట్రంలోని తెలుగిళ్ల ముంగిళ్లలో అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు వంటివారికి పింఛన్ తెచ్చే ఆత్మబంధువు వాలంటీర్. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఏ మాత్రం భయపడకుండా ప్రతి ఇంటి తలుపునూ తట్టి, ఇంటి వారి బాగోగులను చూసింది వలంటీర్లే. ఊరికి రేషన్ సమాచారం అందించడమే కాదు, ఊరి వారికి అవసరమయ్యే వివిధ ధ్రువీకరణ పత్రాలను దగ్గరుండి దరఖాస్తు చేయించి, వాటిని అందించే బాధ్యతను భుజాన వేసుకున్నదీ వలంటీర్లే. ఒక ఊళ్లో తమకు అప్పగించిన 50 ఇళ్లు, పట్టణాల్లో 100 ఇళ్ల బాధ్యతను తలకెత్తుకుని... ఆ ఇళ్లకు వర్తించగల పథకాలను ప్రభుత్వం నుంచి అందేలా చూసే నిస్వార్థ సేవా దీపాలు వీరు.



ప్రభుత్వం వాలంటీర్ల సేవలను ఏటా గుర్తించి గత నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి సత్కార పురస్కారాలతో కృతజ్ఞతలు చెబుతున్నారు. ఈ ఏడాది 2,55,464 మంది వాలంటీర్లను ఈ పురస్కారాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. పనితీరు ఆధారంగా మూడు కేటగిరీలుగా వాలంటీర్లకు అవార్డులు ఇస్తున్నారు.

ఈ మూడు కేటగిరీల్లో మొదటిది 'సేవా వజ్ర' అవార్డుకు నియోజకవర్గానికి అయిదుగురు వంతున రాష్ట్ర వ్యాప్తంగా 875 మందికి పురస్కారాన్ని అందిస్తున్నారు. ప్రతి మండలం, మున్సిపాల్టీలో అయిదుగురు వంతున, నగర పాలక సంస్థలో 10 మంది వంతున, రాష్ట్రవ్యాప్తంగా 4,150 మందికి 'సేవా రత్న' అవార్డు; కనీసం ఏడాది పనిచేసిన 2,50,439 మందికి 'సేవామిత్ర' అవార్డులతో సత్కరిస్తున్నారు.


ఈ ఏడాది 'వైఎస్సార్ పెన్షన్ కానుక', 'వైఎస్సార్ ఆసరా', 'వైఎస్సార్ చేయూత' వంటి పథకాల ద్వారా జనావళికి చేకూర్చిన లబ్ధికి దృశ్య రూపమిస్తూ ఉత్తమ వీడియోలు చిత్రీకరించిన వలంటీర్ల కృషికి అభినందన పూర్వకంగా నగదు బహుమతులు అందించడమూ విశేషం. ఈ అవార్డుల ప్రదానం వాలంటీర్ల సేవానిరతిని మరింత ప్రోది చేస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు.

– అన్నపురెడ్డి రాజేశ్వరరావు, జర్నలిస్టు
(ఏపీ ప్రభుత్వం ఫిబ్రవరి 15 నుంచి వాలంటీర్లకు పురస్కారాలు అందిస్తున్న సందర్భంగా...)

అదే కాపాడుతుంది!

చేసిన ధర్మం వృథా పోదు. మనం చేసే ధర్మం మనల్ని కాపాడటంతోపాటు మన సంతతినీ కాపాడుతుందనేది భారతీయుల నమ్మకం. దీనికి ఈ కథే ఓ నిదర్శనం.

పేద రైతు రామయ్య దగ్గరకు నలుగురైదుగురు గ్రామస్థులు వచ్చారు. 'మన ఊరు చివర ఒక చెరువు తవ్వబోతున్నాం. తగినంత నిధులు లేకపోవడంతో ఊళ్ళో పది మందినీ కలిసి విరాళాలు అడుగుతున్నాం. ఈ క్రమంలోనే మీ వద్దకు కూడా వచ్చాం. మీకు చేతనైనంత ఇచ్చి మేము తలపెట్టిన కార్యక్రమానికి సహకరించండి. ఇది మీరు చేసే ధర్మం అనుకోండి' అన్నారు రామయ్యతో. అయితే ఆయన తన తాహతుకు తగ్గట్టు ఓ యాభై రూపాయలు మాత్రమే ఇచ్చాడు. అంత తక్కువ ఇస్తున్నందుకు ఎంతో సిగ్గు పడ్డాడు. కొంతకాలానికి ఆయన కాలం చేశాడు.



జ్యోతిర్మయం

ఒక రోజు రామయ్య మనవడు తోటి పిల్లలతో కలిసి ఆటలు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఊరి పెద్దలు తవ్వించిన చెరువులో పడ్డాడు. అతడితో పాటూ ఉన్న పిల్లలు భయపడి ఆ సంగతి పిల్లవాడి తల్లిదండ్రులకు చెప్పడానికి ఊళ్లోకి పరుగు తీశారు. ఇంతలో అటువైపు వెళుతున్న ఓ వ్యక్తి పిల్లవాడిని నీటి నుంచి బయటకు తీశాడు. అప్పటికి మిగతా పిల్లల ద్వారా ప్రమాదం విషయం తెలిసిన పిల్లవాడి తల్లి ఏడుస్తూ చెరువు దగ్గరకు వచ్చింది. తన కుమారుడూ, అతణ్ణి రక్షించిన గ్రామస్థుడూ కనిపించడంతో పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లు సంతసించింది. 'ఏదో పెద్దలు చేసిన పుణ్యం ఈ రోజు మీ రూపంలో వచ్చి నా కొడుకుని కాపాడింది' అని గ్రామస్థునికి కృతజ్ఞతలు చెప్పి నమస్కరించింది. 'నిజమే నమ్మా. ఈ చెరువు తవ్వడానికి వాళ్ల తాత చేసిన ధర్మమే ఈ బాలుణ్ణి రక్షించింద'ని గ్రామస్థుడు నవ్వి వెళ్లిపోయాడు. ఇందులో వాస్తవం ఏదైనా నమ్మకం అలాంటిది మరి.

– యామిజాల జగదీశ్

శ్రీగిరిలో నేటి నుంచి మహాకుంభాభిషేక మహోత్సవం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శుక్రవారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు మహాకుంభాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు తెలిపారు. శ్రీగిరి క్షేత్రంలోని ప్రధానాలయంలో శివాజీగోపుర పునర్నిర్మాణం, ఆలయ ప్రాంగణంలోని కొన్ని ఉపాలయాల పునరుద్ధరణ, పంచమఠాల్లోని మూడు మఠాల పునరుద్ధరణ, ఆయా ఉపాలయాల్లో, మఠాల్లో శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠ సందర్భంగా మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జల వనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

No.SE/IC/Elr/DB/ATO.6/F-TN.17/23-24 to 19/23-24 తేది: 07-02-2024
రూ.251.75 లక్షల మొత్తం కోసం SKKYR ప్రాజెక్ట్ యొక్క కుడి ప్రధాన కాలువపై 49L/44L/45L మేజర్ డిస్ట్రిబ్యూటరీ సిస్టమ్‌పై మిగిలిన మట్టి త్రవ్వు పని మరియు డ్రాప్స్ మరియు O.T స్లూయిసెస్ నిర్మాణం. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది: 26-02-2024న మ.3.00 గం. వరకు. తదుపరి వివరాలకు దర్శించండి: www.apeprocurement.gov.in, ఫోన్ నం.: 9440814836
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, ఇరిగేషన్ సర్కిల్, ఏలూరు
DIPR RO No.13018/CL/Advt/1/1/2021-22, Dt: 15.02.2024

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నెం.30/2023-24, నిట్ నెం.138 నుండి 145, తేది: 13-02-2024
గుంటూరు పరిధిలోని వివిధ నియోజకవర్గములలో 8 పనులకు అంచనా విలువ: రూ.4751.00 లక్షలకు వివిధ గ్రాంట్ల క్రింద మంజూరైన పనులకు టెండర్లు ది.17.02.2024 నుండి ఇ-ప్లాట్‌ఫామ్ www.pmgsytendersap.gov.in ద్వారా కోరబడుచున్నవి.
సం/- పర్యవేక్షక ఇంజినీర్, పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు
DIPR RO No.13011/CL/Advt/1/1/2021-22, Dt: 15.02.2024

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
నోటిఫికేషన్

నెం. 1977/ఏ1/2023-24 తేది : 12.02.2024
పశ్చిమ గోదావరి జిల్లాలో (ర.భ) శాఖ వారి ఆధ్వర్యంలో వాచ్‌మన్, ఆఫీస్ సబార్డినేట్ మరియు శానిటరీ వర్కర్స్ Outsourcing పద్ధతిలో పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది. వివరాలు : www.westgodavari.ap.gov.in నందు చూడగలరు. ఈ ఉద్యోగములకు దరఖాస్తులు తేది : 19.02.2024 నుండి 28.02.2024 వరకు సా. 5 గం. లోపు ఈ కార్యాలయము నందు దరఖాస్తు సమర్పించవలెను.
సం/- జిల్లా (ఆర్ & బి) ఇంజినీరింగ్ అధికారి, పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం
DIPR RO No.13015/CL/Advt/1/1/2021-22, Dt: 15.02.2024

OFFICE OF THE COMMISSIONER AND DIRECTOR OF AGRICULTURAL MARKETING
Government of Andhra Pradesh, Guntur.
E-PROCUREMENT TENDER NOTICE

E-Procurement T.No.CE(AM)/AP/GNT/Ep/27/2023-24, Dated:15-2-2024
Online tenders are invited by the Chief Engineer (AM) Guntur from the registered Civil contractors for constructional works at various Market Yards costing of Rs.6,52,26,787/- approximately. Eprocurement site opens on Dt.17-2-2024 at 4.00 P.M. Any other information can be had from the www.tender.apeprocurement.gov.in or from the Chief Engineer (AM), O/o Commr. & Director of Agrl. Marketing, Chuttugunta Center, Guntur.
Chief Engineer (AM),
O/o Commissioner and Director of Agrl.Marketing
Govt. of A.P, Guntur.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా & పారిశుద్ధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నంబర్లు. 286 నుండి 320 /2023-24 తేది: 13.02.2024
ముప్పైఐదు(35) ప్యాకేజీ పనుల క్రింద ఆం.ప్ర. రాష్ట్రంలో గ్రామ జల సంఘం ద్వారా కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ విధానం ద్వారా JJM పనులు చేపట్టుటకు అవసరమైన మెటీరియల్ (HDPE, GI & DI పైపులు FHTCs మెటీరియల్ & DI వాల్వులు) సేకరణ పనికొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ (OEMలు) నుండి ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదార్లు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.tenders.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. అంచనా వ్యయం: రూ.76969.64 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 17-02-2024, ఉ.10గం. ఫోన్ నం. 9100120551, 9100120501.
సం/- చీఫ్ ఇంజినీర్ & PD, SWSM, RWS & S శాఖ, విజయవాడ
DIPR RO No.13008/CL/Advt/1/1/2021-22, Dt: 15.02.2024

APRCET 2023-24
ANDHRA PRADESH RESEARCH COMMON ENTRANCE TEST
Conducted on behalf of APSCHE by
SRI VENKATESWARA UNIVERSITY, TIRUPATI
NOTIFICATION

Andhra Pradesh Research Common Entrance Test 2023-24 (APRCET 2023-24) for admission into Ph.D Programmes (Both Full-time and Part-time) offered by the Universities and Research Centres in the state of Andhra Pradesh for the academic year 2023-24 will be conducted tentatively in the month of April 2024. The eligible candidates are informed to submit their applications through online mode only from **20-02-2024** by paying the application registration and processing fee, through Online Payment gateway. The detailed information regarding Examination dates, Eligibility, Syllabus and Model Question Papers, Mock Test, Fee details, Instructions and Procedure for Online Submission of Applications are available on the website **https://cets.apsche.ap.gov.in**

Place : Tirupati, Date: 15-02-2024 **CONVENER, APRCET 2023-24**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (గురుకులం) తాడేపల్లి, గుంటూరు జిల్లా
ప్రవేశ ప్రకటన

Rc.No.1201738-APTWRE-13021/3/2020-ACADEMIC, Dt. 14.02.2024
ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, తాడేపల్లి వారిచే నిర్వహించబడుతున్న (31) సాధారణ గిరిజన గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి ప్రవేశానికి మరియు 6 నుండి 9 తరగతులలో మిగిలిన సీట్లకు Online ద్వారా దరఖాస్తులు కోరబడుచున్నవి. జిల్లాల వారీగా విద్యార్థులను చేర్చుకోవడానికి ఏజెన్సీ మరియు నార్ ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్నటువంటి విద్యార్థులకు వ్రాత పరీక్ష ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేయబడును. 5వ తరగతిలో ప్రవేశానికి 4వ తరగతి పాస్ అయిన, మిగిలిన తరగతులకు వాని ముందు తరగతులు 2023-24 విద్యా సంవత్సరములో చదివి పాస్ అయిన తెలుగు/ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు అర్హులు. జిల్లాలలో ఉన్నటువంటి 31 సాధారణ గిరిజన గురుకుల పాఠశాలల్లో వ్రాత పరీక్ష నిర్వహించి ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేయబడును. పూర్తి వివరముల కొరకు www.aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.
ప్రవేశానికి అర్హత : 5వ తరగతిలో ప్రవేశానికి ఓ.సి, బి.సి (O.C., B.C) కులాలకు చెందిన విద్యార్థులు 01.09.2013 మరియు 31.08.2015 మధ్య జన్మించి ఉండాలి. యస్.సి., యస్.టి.,(S.C., S.T) కులాలకు చెందిన విద్యార్థులు 01.09.2011 మరియు 31.08.2015 మధ్య జన్మించి ఉండాలి. సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదివి ఉండాలి. తల్లి, తండ్రులు/సంరక్షకుల ఆదాయం 2023-24 సంవత్సరానికి రూ. 1,00,000/- మించి ఉండరాదు. పూర్తి వివరాలతో కూడిన సమాచార పత్రం కొరకు మరియు దరఖాస్తు కొరకు 15.02.2024 నుండి www.aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్ చూడగలరు. సమాచార పత్రంలో ఇవ్వబడిన అర్హతలు పరిశీలించుకొని, తరువాత దరఖాస్తులు Online లో సమర్పించడానికి ఆఖరు తేది: **10.04.2024. ఇతర సమాచారం కొరకు సమీప పాఠశాల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించగలరు.**
సం/- జాయింట్ సెక్రటరీ
DIPR RO No.2711PP/CL/Advt/1/1/2021-22, Dt: 15.02.2024

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayindia ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

అడ్వర్టైజ్‌మెంట్ నోటీసు నం.01/2024/STBA/BZA
తేది: 15-02-2024

PUB/0153

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్, విజయవాడ వారు కమిషన్ ప్రాతిపదికన స్టేషన్లలోని ప్రస్తుతం గల కౌంటర్ల నుండి అన్‌రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (UTS) ద్వారా అన్‌రిజర్వ్‌డ్ టికెట్స్ జారీచేయుట కోసం దిగువ తెలిపిన విధంగా విజయవాడ డివిజన్‌లోని **13 NSG-6 మరియు 1 NSG-5 కేటగిరి** రైల్వే స్టేషన్ల వద్ద స్టేషన్ టికెట్ బుకింగ్ ఏజెంట్ (STBA) స్కీమ్‌కు సంబంధించి నియామకం కోసం 18 సంవత్సరాలు వయస్సు పైబడిన భారత పౌరులు/ జాతీయుల నుండి సీల్డ్ దరఖాస్తులు కోరుచున్నారు. దరఖాస్తుదారులు దిగువ తెలిపిన రైల్వే స్టేషన్లు ఉన్నటువంటి స్థానిక జిల్లాలోని నివాసి అయి ఉండాలి. నియామక కాలవ్యవధి **కేటాయింపుపై మూడు (03) సంవత్సరాలకు** ఉంటుంది.

పని వివరణ	నియామక కాలవ్యవధి	బయానా	టెండరు ఫారం ధర	టెండరు దాఖలు తేది
పని స్వభావం: విజయవాడ డివిజన్‌లోని ఒకటి (1) NSG-5 & పదమూడు (13) NSG-6 కేటగిరీ స్టేషన్ల వద్ద ప్రస్తుతం గల బుకింగ్ కౌంటర్ల నుండి ప్రయాణించే ప్రజలకు అన్‌రిజర్వ్‌డ్ టికెట్స్ జారీ చేయుట.	మూడు (03) సంవత్సరాలు	NSG-5 రూ.5,000 & NSG-6 రూ.2,000	ఉచితం	22-03-2024 10.00 గం. నుండి 15.00 గం. వరకు

STBA నియామకం కోసం స్టేషన్ల జాబితా

క్ర.సం.	స్టేషన్ పేరు	కోడ్	కేటగిరీ	క్ర.సం.	స్టేషన్ పేరు	కోడ్	కేటగిరీ
1	అరవల్లి	AVLI	NSG-6	8	మనబోలు	MBL	NSG-6
2	బిక్కవోలు	BVL	NSG-6	9	నిడమానూరు	NDM	NSG-6
3	బిట్రగుంట	BITR	NSG-6	10	రేగుపాలెం	REG	NSG-6
4	గన్నవరం	GWM	NSG-6	11	స్టువర్ట్‌పురం	SPF	NSG-6
5	ఇందుపల్లి	IDP	NSG-6	12	తెట్టు	TTU	NSG-6
6	కడియం	KYM	NSG-6	13	వేటపాలెం	VTM	NSG-6
7	కాల్దారి	KLDI	NSG-6	14	నూజివీడు	NZD	NSG-5

ముఖ్యమైన తేదీలు:

దక్షిణ మధ్య రైల్వే వెబ్‌సైట్ నుండి టెండరు ఫారాల డౌన్‌లోడింగ్	20-02-2024
టెండరు ఫారాల దాఖలు కోసం తేది & సమయం	22-03-2024న 10.00 గం. నుండి 22-03-2024న 15.00 గం. వరకు
టెండరు బాక్స్ మూసివేత కొరకు తేది & సమయం	22-03-2024న 15.00 గం.
టెండరు బాక్స్ తెరుచు కొరకు తేది & సమయం	22-03-2024న 15.30 గం.

N.B: ఒకవేళ చివరి తేది ప్రభుత్వ సెలవు దినమైనా లేదా ఏవైనా కారణాల వలన సెలవు దినంగా ప్రకటించబడినా టెండర్లు మరుసటి పనిదినమున తెరువబడును. సీల్డ్ టెండరు ఫారాలను సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కార్యాలయం, DRM ఆఫీస్ కాంపౌండ్, నార్త్ బ్లాక్, విజయవాడ- 520001 వద్ద ఉంచబడిన సీల్డ్ టెండరు బాక్స్‌లో బయానాతో పాటు వేయవలెను. టెండరు ఫారం మరియు ఇతర వివరాలను దక్షిణ మధ్య రైల్వే వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in నుండి పొందవచ్చును. దీనికి సంబంధించిన ఏవేని తదుపరి వివరాల కోసం కార్యాలయ పనివేళలలో దిగువ సంతకందారు కార్యాలయాన్ని సంప్రదించండి.
A0183 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, విజయవాడ

అరసవల్లిలో 'రథసప్తమి' ప్రారంభం

అరసవల్లి (శ్రీకాకుళం): శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి నుంచి రథసప్తమి మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. శోభకృత్ నామ సంవత్సర మాఘ శుద్ధ సప్తమి పర్వదినం సందర్భంగా రథసప్తమి ఉత్సవాన్ని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.

శ్రీ పప్పూరమ్మ & శ్రీ భైరవస్వామి దేవాలయం
వంకరాజు కాల్వ గ్రామం, పామిడి మండలం, అనంతపురము జిల్లా.
e-Procurement Tender
NIT No. P/COE/175/2024, Dt. 04-02-2024
దేవాలయ పునః నిర్మాణము నిర్మాణము చేయుట కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు : కార్యనిర్వహణాధికారి

దక్షిణ మధ్య రైల్వే
ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)

PUB/0149

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ వారు దిగువ తెలిపిన పనుల కోసం సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుతున్నారు.
క్ర.సం.1 NIT No.: C/E.29/TRD/SC/32/2023-2024, పని పేరు: టెండరు నం. C/E.29/TRD/SC/32/2023-2024, తేది:13.02.2024. 1) RDM: RDM ఫ్రైట్ డిపో వద్ద ఫ్రైట్ నిర్వహణ సదుపాయాల ప్రతిపాదిత స్థాయి పెంపుదలకు సంబంధించి ప్రస్తుతమున్న OHE సదుపాయాలకు మోడిఫికేషన్ నిమిత్తం ఏర్పాటు. 2) SNF: SNF ఫ్రైట్ డిపో వద్ద ఫ్రైట్ నిర్వహణ సదుపాయాల ప్రతిపాదిత స్థాయి పెంపుదలకు సంబంధించి ప్రస్తుతమున్న OHE సదుపాయాలకు మోడిఫికేషన్ నిమిత్తం ఏర్పాటు. **వివరాలు: అంచనా వ్యయం :** రూ. 51,13,391.58, **పూర్తి చేయవలసిన కాలం:** 90 రోజులు, **ముగింపు తేది:** 11.03.2024న 15.00 గం.
1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ http://ireps.gov.in కు లాగిన్ కావలెను.
2) టెండరుదారులు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు.
3) కాగోరు టెండరుదార్లందరూ టెండరు ఫారం ధర మరియు బయానాను ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించవలసిందిగా కోరబడుతున్నారు.
4) కాగోరు టెండరుదార్లందరూ GSTIN గుర్తింపు నంబర్లను పొంది తమ ఆఫర్లతో సహా దాఖలు చేయవలసిందిగా సూచించబడుతున్నారు.
5) టెండరుదారులు ఏవేని సవరణల కోసం (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేసినవి) టెండరు దాఖలు కాలం ప్రారంభ తేదీ వరకు చూడవలెను.
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/TRD/ సికింద్రాబాద్

ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)

PUB/0150

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ వారు దిగువ తెలిపిన పనుల కోసం సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుతున్నారు.
క్ర.సం.1 NIT No.: C/E.29/TRD/SC/33/2023-2024, పని పేరు: టెండరు నం. C/E.29/TRD/SC/33/2023-2024, తేది:13.02.2024. SC డివిజన్‌లోని SC-KZJ సెక్షన్లలో అండర్‌గ్రౌండ్ కేబుల్ క్రాసింగ్స్‌లోకి 33KV ఓవర్ హెడ్ పవర్ లైన్ క్రాసింగ్స్ మార్పు. **వివరాలు: అంచనా వ్యయం :** రూ. 68,96,172.00, **పూర్తి చేయవలసిన కాలం:** 90 రోజులు, **ముగింపు తేది:** 11.03.2024న 15.00 గం.
1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ http://ireps.gov.in కు లాగిన్ కావలెను.
2) టెండరుదారులు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు.
3) కాగోరు టెండరుదార్లందరూ టెండరు ఫారం ధర మరియు బయానాను ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించవలసిందిగా కోరబడుతున్నారు.
4) కాగోరు టెండరుదార్లందరూ GSTIN గుర్తింపు నంబర్లను పొంది తమ ఆఫర్లతో సహా దాఖలు చేయవలసిందిగా సూచించబడుతున్నారు.
5) టెండరుదారులు ఏవేని సవరణల కోసం (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేసినవి) టెండరు దాఖలు కాలం ప్రారంభ తేదీ వరకు చూడవలెను.
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/TRD/ సికింద్రాబాద్

ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)

PUB/0151

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ వారు దిగువ తెలిపిన పనుల కోసం సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుతున్నారు.
క్ర.సం.1 NIT No.: C/E.29/TRD/SC/35/2023-2024, పని పేరు: టెండరు నం. C/E.29/TRD/SC/35/2023-2024, తేది:15.02.2024. [illegible] (DSDC)లో [illegible] MMD [illegible] ఇన్‌ఫ్రింజ్‌మెంట్స్ తొలగింపు - SC డివిజన్‌లో 2 లోకేషన్స్ వద్ద RUBల క్రింద ఇన్సులేటింగ్ షీట్ ఏర్పాటు చేయుట. (OOT వర్క్స్)". **వివరాలు: అంచనా వ్యయం :** రూ. 1,81,25,437.18, **పూర్తి చేయవలసిన కాలం:** 90 రోజులు, **ముగింపు తేది:** 11.03.2024న 15.00 గం.
1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ http://ireps.gov.in కు లాగిన్ కావలెను.
2) టెండరుదారులు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు.
3) కాగోరు టెండరుదార్లందరూ టెండరు ఫారం ధర మరియు బయానాను ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించవలసిందిగా కోరబడుతున్నారు.
4) కాగోరు టెండరుదార్లందరూ GSTIN గుర్తింపు నంబర్లను పొంది తమ ఆఫర్లతో సహా దాఖలు చేయవలసిందిగా సూచించబడుతున్నారు.
5) టెండరుదారులు ఏవేని సవరణల కోసం (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేసినవి) టెండరు దాఖలు కాలం ప్రారంభ తేదీ వరకు చూడవలెను.
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/TRD/ సికింద్రాబాద్
A0181

తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

GOVERNMENT OF ANDHRA PRADESH
PUBLIC HEALTH AND MUNICIPAL ENGINEERING DEPARTMENT

1	Tender Notice No	117&118 Dated15-02-2024 (Reverse Tendering) (5th call)
2	Name of work	Water Supply Improvement Scheme in Kadapa Municipal Corporation under Tranche-1 & 2 of AMRUT 2.0
3	Estimate Cost	**Rs.462.00 Crores & Rs.110.76 Crores**
4	Last Date / Time of receipt of tender	**23-02-2024 @ 4.00PM**
5	Tender Inviting Authority	**Sri R. Sreenath Reddy, M.Tech.,** Superintending Engineer. Public Health Circle, Ananthapuramu.

Further details can be seen @ 'e' procurement market place **www.ap.eprocurement.gov. in**
COMMISSIONER, KADAPA MUNICIPAL CORPORATION, YSR DIST

గొప్పగా చేసినా.. 'పచ్చ' రాతలేనా?

పాలన సవ్యంగా సాగిపోతుంటే పాపం రామోజీకి నిద్రపట్టడం లేదు. పథకాలు సక్రమంగా అమలవుతుంటే ఆయన విష'పత్రిక'కు నచ్చడం లేదు. ప్రభుత్వానికి ప్రజాభిమానం రోజురోజుకూ పెరిగిపోతుంటే సహించడం లేదు. క్రమ పద్ధతిలో ప్రాజెక్టులు పూర్తవుతుంటే ఆ 'పచ్చ'కళ్లకు కనిపించడం లేదు. అడ్డగోలు రాతలతో రెచ్చిపోయి... తప్పుడు కథనాలతో జనాన్ని తప్పుదారి పట్టించి... వికృతానందం పొందాలని తెగ తాపత్రయపడుతున్నారు. 'బాబు' కళ్లలో ఆనందం చూడాలని ఎంతగానో ఆరాటపడుతున్నారు. వాస్తవమేంటో కళ్లకు కనిపిస్తున్నా... జీర్ణించుకోలేకపోతున్నారు. ఇలాగే ప్రాజెక్టులపైనా లేనిపోని ఆరోపణలు చేసి ఓ కథనాన్ని వండివార్చేశారు. కానీ రాష్ట్రంలో ప్రాజెక్టులు పరుగులు పెట్టింది ఈ ప్రభుత్వంలోనే అన్నది ప్రజలందరికీ అర్థమవుతున్నా... పాపం ఈనాడుకే ఎందుకో తెలియడం లేదు.

- రాష్ట్రంలో పూర్తయిన ప్రాజెక్టులు కనిపించడం లేదా రామోజీ?
- సంగం, నెల్లూరు బ్యారేజ్‌లు పూర్తి చేసిందెవరో తెలియదా...
- అవుకు రెండో టన్నెల్, లక్కసాగరం ఎత్తిపోతలు పూర్తికాలేదా?
- బాబు నియోజకవర్గం కుప్పానికి నీళ్లిచ్చిందెవరు..

57 నెలల్లో సాగునీటి ప్రాజెక్టులకోసం వెచ్చించినది రూ.**32,161.49**కోట్లు

సాగునీటికి నోచుకున్న మొత్తం విస్తీర్ణం **9.86** లక్షల ఎకరాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తూ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తుంటే 'ఈనాడు' రామోజీరావు ఓర్వలేకపోతున్నారు. రైతుల్లో సీఎం వైఎస్ జగన్‌కు మద్దతు రోజురోజుకూ పెరుగుతుండటం.. అది చంద్రబాబు రాజకీయ ఉనికినే ప్రశ్నార్థకం చేస్తుండటంతో పచ్చబ్యాచ్ ఆందోళన చెందుతోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ పుంఖానుపుంఖాలుగా సీఎం వైఎస్ జగన్‌పై విషపు రాతలకు తెగబడుతున్నారు. అకోవలోనే ప్రాజెక్టులపై అబద్ధాలను అచ్చేసింది. గడచిన 57 నెలల్లో కరోనా ప్రభావం వల్ల దాదాపు 24 నెలలు ప్రపంచమే స్తంభించిపోయింది. మిగిలిన 33 నెలల్లోనే సంగం బ్యారేజ్, నెల్లూరు బ్యారేజ్, అవుకు రెండో టన్నెల్, లక్కసాగరం ఎత్తిపోతలను పూర్తి చేసి, జాతికి అంకితం చేశారు. కుప్పం బ్రాంచ్ కెనాల్, వెలిగొండ జంట సొరంగాలు పూర్తయ్యాయి. శ్రీశైలానికి వరద వచ్చిన వెంటనే ఆ జంట సొరంగాల ద్వారా కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు తరలించనున్నారు. మరో 14 ప్రాజెక్టులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి.

- బ్రహ్మంసాగర్ మట్టికట్టకు డయాఫ్రమ్‌వాల్ లీకేజీలకు అడ్డుకట్ట వేయడం, నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడం ద్వారా పులిచింతల, గండికోట, చిత్రావతి, సోమశిల, కండలేరు జలాశయాల్లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేశారు.
- తెలుగుగంగ లింక్ కెనాల్, ప్రధాన కాలువకు లైనింగ్ చేయడం ద్వారా సకాలంలోనే వెలిగోడు, బ్రహ్మంసాగర్ రిజర్వాయర్లను నింపుతున్నారు. ఏటా కోటి ఎకరాల ఆయకట్టుకు నీరందించారు.
- చంద్రబాబు అవినీతి వల్ల విధ్వంసానికి గురైన పోలవరం ప్రాజెక్టు పనులను గాడిలో పెట్టి.. ప్రణాళికాయుతంగా సీఎం జగన్ పూర్తి చేస్తున్నారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించి, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, స్పిల్ చానల్, స్పిల్ వేను పూర్తి చేసి 2021, జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని పోలవరం స్పిల్ వే మీదుగా మళ్లించారు.
- చంద్రబాబు కమీషన్ల కక్కుర్తి వల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ పునరుద్ధరణకు సీడబ్ల్యూసీ మార్గదర్శకాలు జారీ చేసిన వెంటనే దాన్ని చేపట్టి.. ప్రధాన డ్యామ్‌ను పూర్తి చేయడం ద్వారా పోలవరం ఫలాలను రైతులకు అందించడానికి వడివడిగా అడుగులు వేస్తున్నారు.



నాడు బాబు నిర్లక్ష్యంపై ప్రశ్నించలేదెందుకు?

2014 జూలై 28వ తేదీన టీడీపీ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో జలయజ్ఞం ప్రాజెక్టుల్లో మిగిలిన పనులను రూ.17,368 కోట్లతో పూర్తి చేస్తానని ప్రకటించారు. 2014, జూన్ 8 నుంచి 2019 మే 29 వరకూ సాగునీటి ప్రాజెక్టుల పనులకు రూ.68,293.95 కోట్లు ఖర్చు చేశారు. ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేదు. జీవో 22, జీవో 63లను అడ్డుపెట్టుకుని అంచనా వ్యయాన్ని అడ్డగోలుగా పెంచేసి.. ఆస్థాన కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టి భారీ ఎత్తున దోచుకున్నారు. చంద్రబాబు కమీషన్ల కక్కుర్తికి పోలవరం పనులే తార్కాణం. సబ్ కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు వసూలు చేసుకోవడానికే చంద్రబాబు ప్రతి సోమవారాన్ని సమీక్షల పేరుతో పోల'వరం'గా మార్చుకున్నారని అప్పటి ప్రధాన కాంట్రాక్టర్ ట్రాన్స్ ట్రాయ్ అధినేత రాయపాటి రంగారావు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. పోలవరంలో రూ. 2,917 కోట్ల విలువైన పనులను రామోజీ వియ్యంకుడికి చెందిన నవయుగకు కట్టబెట్టారు. చంద్రబాబు దోపిడీలో రామోజీ కి వాటా ఉండటం వల్లే అప్పట్లో సాగునీటి ప్రాజెక్టుల్లో సాగిన దోపిడీపై ఒక్క అక్షరమైనా ఈనాడులో అచ్చేయలేదన్నది బహిరంగ రహస్యం.

అన్నవరం రైల్వేస్టేషన్‌కు 'ఈట్ రైట్ స్టేషన్' సర్టిఫికెట్

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్‌లోనే తొలిసారిగా టెంపుల్ టౌన్ స్టేషన్‌లలో ఒకటైన అన్నవరం రైల్వేస్టేషన్ ఎంతో ప్రతిష్టాత్మకమైన ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) నుంచి 'ఈట్ రైట్ స్టేషన్' సర్టిఫికెట్ సాధించింది. ఇది డివిజన్‌లోనే మొదటిది కాగా దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో హైదరాబాద్ (నాంపల్లి) తర్వాత రెండోదిగా నిలిచింది. ఈ సర్టిఫికెట్ సాధించేందుకు డివిజన్ అధికారులు అన్నవరం రైల్వేస్టేషన్‌ను ఎంపిక చేశారు. ఆ స్టేషన్‌లో ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాల ప్రకారం క్యాటరింగ్ విక్రేతలు, స్టాల్ యజమానులు, సరఫరాదారులకు ఎఫ్ఏఎస్‌టీఏసీ (ఫుడ్ సేఫ్టీ అండ్ ట్రెనింగ్ సర్టిఫికేషన్)లో శిక్షణ ఇచ్చారు. అనంతరం కమర్షియల్, ఫుడ్ సేఫ్టీ అధికారులు స్టేషన్‌లోని అన్ని క్యాటరింగ్ స్టాల్స్‌లో ఆహార భద్రత, పరిశుభ్రత, ప్రమాణాలు, విక్రేతల వ్యక్తిగత పరిశుభ్రత, రక్షణ పరికరాలు, ఆహార ఉత్పత్తుల గడువు తేదీలు, ఉష్ణోగ్రత నియంత్రణ, వ్యర్థాల తొలగింపు, తడి-పొడి చెత్త విభజన వంటి ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని నిరంతరం పర్యవేక్షించేవారు. ప్రారంభంలో ప్రీ-ఆడిట్ నిర్వహించి చివరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ చే ఆరు నెలల పాటు పర్యవేక్షణ, మూల్యాంకనం అనంతరం వారి ప్రమాణాలకు అనుగుణంగా అన్నవరం స్టేషన్‌కు 'ఈట్ రైట్ స్టేషన్' సర్టిఫికెట్ వరించింది. ఈ సర్టిఫికెట్ సాధించడానికి కృషిచేసిన సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, డీఓ మహ్మతుల్లా, ఇతర అధికారులను డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు.



అన్నవరం రైల్వే స్టేషన్



స్టేషన్‌కు ఎఫ్ఎస్ఎస్ఏఐ అందజేసిన 'ఈట్ రైట్ స్టేషన్' సర్టిఫికెట్

లోక కల్యాణార్థమే రాజశ్యామల యాగం

విశాఖ శ్రీశారదాపీఠం వార్షికోత్సవాల్లో స్వరూపానందేంద్ర

పెందుర్తి (విశాఖ జిల్లా): తంత్ర విధానంలో అర్చనా విధులు అందుకుంటున్న రాజశ్యామల అమ్మవారు యావత్ భారతావనిలో విశాఖ శ్రీశారదాపీఠంలోనే కొలువుదీరారని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ అన్నారు. అనేక రూపాల్లో అనుగ్రహిస్తున్న అమ్మవారు ప్రజలకు శక్తి, బుద్ధి, సుఖ సంతోషాలను ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ.. లోకకల్యాణార్థమే రాజశ్యామల యాగం నిర్వహిస్తున్నామని చెప్పారు. గురువారం విశాఖ శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలు ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ సారథ్యంలో స్వామీజీ చేతుల మీదుగా అంకురార్పణ చేశారు. స్వామీజీలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పీఠం ప్రాంగణంలోని దేవతామూర్తులను దర్శించుకున్నారు. గోపూజ చేశారు. రాజశ్యామల అమ్మవారికి హారతులిచ్చారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న స్వామీజీలు

రూ.26 కోట్లతో 320 ఆలయాల నిర్మాణాలు పూర్తి: ఈవో ధర్మారెడ్డి

తిరుపతి(అలిపిరి): సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీవాణి ట్రస్టుతో ఇటీవల మత్స్యకార, గిరిజన, వెనుకబడిన తరగతులు ఉన్న ప్రాంతాల్లో 320 ఆలయాల నిర్మాణం పూర్తయిందని.. ఇందుకోసం దాదాపు రూ.26 కోట్లు వ్యయం చేసినట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. గురువారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో ఆలయాల నిర్మాణంపై ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టు (శ్రీవాణి) నిధులతో ఇటీవల కొన్ని జిల్లాల్లో నిర్మించిన ఆలయాల్లో సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. దేశంలోనే ఉన్నతమైన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సంస్థలతో సామాజిక తనిఖీ చేయించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఆలయాలు నిర్మించిన తర్వాత మతమార్పిడులు దాదాపుగా ఆగిపోయాయన్నారు. మత్స్యకార, గిరిజన, వెనకబడిన ప్రాంతాల్లో హిందూ ధర్మ ప్రచారం చేయడం టీటీడీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు.

నేటి నుంచి అంతర్వేది లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవాలు

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక దివ్య తిరు కళ్యాణ మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. కోనసీమ జిల్లా అంతర్వేదిలోని స్వామి కళ్యాణ మహోత్సవాలు శుక్రవారం రథసప్తమి రోజు నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 25వ తేదీ వరకూ ఉత్సవాలు కన్నుల పండువగా జరగనున్నాయి. శుక్రవారం రథసప్తమి సందర్భంగా రథానికి అర్చకులు చేసే పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రాంగణంలో ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ నిలువెత్తు విగ్రహానికి దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు, అర్చకులు, అగ్నికుల క్షత్రియులు పూలమాలలు వేసి నివాళులర్పించడం ఆనవాయితీగా వస్తోంది.



అపూర్వ ఘట్టం ముద్రికాలంకరణ: రథసప్తమి రోజున ఆదిదేవుడుని పెళ్లి కొడుకును, అమ్మవారిని పెళ్లి కుమార్తెను చేయడం అపూర్వ ఘట్టం. కేశవదాసుపాలేనికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబాలు సంయుక్తంగా స్వామి, అమ్మవార్లకు ముద్రికాలంకరణ నిర్వహిస్తారు. బుగ్గన చుక్కపెట్టి స్వామివారిని పెండ్లికుమారుని, అమ్మవార్లను పెండ్లికుమార్తెలను చేయడమే ముద్రికాలంకరణ ఘట్టం. అనంతరం స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పిస్తారు. రథసప్తమి వేడుకల్లో తొలిరోజు స్వామి వారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

మంత్రి అంబటికి వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్: రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు గుంటూరు జీజీహెచ్‌లో గురువారం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గొంతు నొప్పితో బాధ పడుతుండడంతో వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆస్పత్రి ఈఎన్‌టీ విభాగానికి వచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ నేతృత్వంలో వైద్య పరీక్షలు చేశారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఏమిటీ ఎలక్టోరల్ బాండ్లు..!



ఎన్నికల బాండ్లు. పార్టీలకు విరాళాలిచ్చేందుకు ఉద్దేశించిన ప్రామిసరీ నోట్ల వంటి పత్రాలు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం 2018లో ఈ ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. భారతదేశానికి చెందిన వ్యక్తులు/సంస్థలు ఎవరైనా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాలూకు ఎంపిక చేసిన శాఖల్లో వీటిని కొనుగోలు చేసి తమకు నచ్చిన పార్టీకి విరాళంగా ఇవ్వవచ్చు. ఇవి రూ.1,000, రూ.10 వేలు, రూ.లక్ష, రూ.కోటి ముఖవిలువతో ఉంటాయి. జారీ అయిన 15 రోజుల్లోపు వీటిని నగదుగా మార్చుకోవాలి. లేదంటే ఆ మొత్తం ప్రధాని జాతీయ రిలీఫ్ ఫండ్‌కు వెళ్తుంది. బాండ్ల కొనుగోలుపై సంఖ్యా పరిమితేమీ లేదు. ఒక్కరు ఎన్ని బాండ్లైనా కొనవచ్చు. పైగా తమ వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచవచ్చు. బాండ్లపై వారి పేరు తదితర వివరాలేవీ ఉండవు. బ్యాంకు వాటిని ఎవరికీ వెల్లడించదు. పార్టీలు రూ.20 వేలకు మించిన నగదు విరాళాల వివరాలను విధిగా బయట పెట్టాల్సి ఉంటుంది. కానీ ఈ బాండ్ల విషయంలో అలాంటి నిబంధనేదీ లేదు. ఎంత పెద్ద మొత్తం విరాళంగా అందినా వివరాలను ఈసీతో పాటు ఎవరికీ వెల్లడించాల్సిన పని లేదు. ఇది పారదర్శకతకు పాతరేయడమేనన్నది ప్రజాస్వామ్యవాదుల ప్రధాన అభ్యంతరం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్నింటికీ బాండ్లు సేకరించే అవకాశమున్నా ఇది ప్రధానంగా అధికార పార్టీలకే బాగా ఉపయోగపడుతుందన్న వాదనలున్నాయి. ఎన్నికల బాండ్ల పథకం నిబంధనలు పౌరుల సమాచార హక్కు చట్టానికే విరుద్ధమని సుప్రీంకోర్టులో హోరాహోరీగా వాదనలు జరిగాయి. చివరికి ఈ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు గురువారం తీర్పు చెప్పింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇవీ అభ్యంతరాలు

- బాండ్ల కొనుగోలుదారులతో సహా అన్ని వివరాలూ గోప్యంగా ఉంటాయి. ఇది పారదర్శకతకు గొడ్డలిపెట్టు.
- భారీగా విరాళాలిచ్చే కార్పొరేట్ సంస్థలు సదరు పార్టీ అధికారంలోకి వచ్చాక దాని నుంచి భారీగా అనుచిత లబ్ధి పొందే ఆస్కారం చాలావరకు ఉంటుంది. ఇది క్విడ్ ప్రో కోకు దారితీస్తుంది.
- పైగా ఈ బాండ్లతో అధికార పార్టీలకే అధిక ప్రయోజనం. దేశవ్యాప్తంగా అత్యధిక బాండ్లు వాటికే అందుతుండటమే ఇందుకు నిదర్శనం.
- మొత్తం ప్రక్రియలో ఎవరి పేరూ బయటికి రాదు గనుక వ్యక్తులకు, సంస్థలకు అనుచిత లబ్ధి చేకూర్చేందుకు అధికార పార్టీలు ఇలా బాండ్ల ముసుగులో లంచాలు స్వీకరించే ఆస్కారం కూడా పుష్కలంగా ఉంది.
- పైగా ఈ నిధులను ఎన్నికల కోసమే వాడాలన్న నిబంధనేమీ లేదు. దాంతో వాటిని పార్టీలు తమ ఇష్టానికి ఖర్చు చేసుకోవచ్చు.
- దేనిపై వెచ్చించాయన్న వివరాలు కూడా ఎవరికీ చెప్పాల్సిన అవకాశం లేదు.
- ఈ పథకం నల్లధనాన్ని మార్చుకునే పరికరంగా కూడా మారింది.
- దీనికి తోడు బాండ్ల కొనుగోలుదారుల వివరాలను తెలుసుకునే అవకాశం అధికార పార్టీలకు ఉంటుంది.
- తద్వారా సదరు వ్యక్తులను, కంపెనీలను వేధించే ప్రమాదమూ ఉంది.

అత్యధిక వాటా బీజేపీదే

ఎన్నికల బాండ్ల పథకం ద్వారా 2018 మార్చి నుంచి 2024 జనవరి దాకా రూ.16,518.11 కోట్ల విలువైన 28,030 బాండ్లు జారీ అయ్యాయి. వీటిలో పార్టీలన్నింటికీ కలిపి రూ.12,000 కోట్లకు పైగా విరాళాలందాయి. ఎన్నికల సంఘం, అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) గణాంకాల ప్రకారం ఇందులో ఏకంగా సగానికి పైగా, అంటే 55 శాతం బీజేపీ వాటాయే కావడం విశేషం. బాండ్ల ద్వారా ఆ పార్టీకి రూ.6,566 కోట్లు సమకూరాయి. బీజేపీ మొత్తం ఆదాయంలో సగానికి పైగా బాండ్ల రూపేణా సమకూరినదే. బాండ్ల ద్వారా కాంగ్రెస్ పార్టీకి రూ.1,123 కోట్లు రాగా ఇతర పార్టీలన్నింటికీ కలిపి రూ.5,289 కోట్లు అందాయి.

రైతు ఉద్యమం ఉధృతం

మూడో రోజుకు చేరిన ఢిల్లీ చలో

- ఢిల్లీ సరిహద్దుల వద్ద వేలాదిగా రైతులు, పోలీసులతో ఘర్షణ
- నేడు భారత్ బంద్‌కు పిలుపు
- సంఘాలతో కేంద్రం చర్చలు



గురువారం పటియాలాలోని శంభు వద్ద రైలు పట్టాలపై బైఠాయించిన రైతులు

న్యూఢిల్లీ: పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయడం సహా పలు డిమాండ్ల సాధనకు రైతులు చేపట్టిన 'చలో ఢిల్లీ' మరింత ఉధృతమైంది. ఢిల్లీ సమీపంలో శంభు, టిక్రి సరిహద్దుల వద్ద పోలీసుల బారికేడ్లు, ఇనుపకంచెలు, సిమెంట్ దిమ్మెలను దాటేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. పోలీసుల భాష్పవాయు గోళాలు, జలఫిరంగుల దాడితో పరిస్థితి చాలా ఉద్రిక్తంగా మారింది. ఉద్యమం మొదలై మూడురోజులవుతున్నా అటు రైతులు, ఇటు కేంద్ర ప్రభుత్వం పట్టువిడవడం లేదు. పంజాబ్, హరియాణాల మధ్యనున్న శంభు సరిహద్దు వద్ద వేలాదిగా రైతులు సంఘటితమయ్యారు. టిక్రి, సింఘు, కనౌరీ బోర్డర్ పాయింట్ల వద్దా అదే పరిస్థితి కనిపించింది. వారిని నిలువరించేందుకు మరింతగా బాష్పవాయుగోళాలు అవసరమని ఢిల్లీ పోలీసులు నిర్ధారించారు. 30,000 టియర్‌గ్యాస్ షెల్స్‌కు ఆర్డర్ పెట్టారు. గ్వాలియర్‌లోని బీఎస్ఎఫ్ టియర్ స్మోక్ యూనిట్ వీటిని సరఫరా చేయనుంది. ఘాజీపూర్ సరిహద్దు వద్ద సైతం పోలీసులు మొహరించారు. చండీగఢ్‌లో రైతు సంఘాల నేతలు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్, శర్వాణ్ సింగ్ పాంధెర్, ప్రభుత్వ ప్రతినిధులైన వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్, హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ మధ్య గురువారం రాత్రి మూడో దఫా చర్చలు మొదలయ్యాయి. చర్చల్లో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సైతం పాల్గొన్నారు. వాటిలో తేలిందనేది ఇంకా వెల్లడి కాలేదు. సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం)లో భాగమైన భారతీయ కిసాన్ యూనియన్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా రైతులు నేడు గ్రామీణ భారత్ బంద్‌ను పాటించనున్నారు. ''రైతులెవ్వరూ శుక్రవారం నుంచి పొలం పనులకు వెళ్లొద్దు. కార్మికులు సైతం ఈ బంద్‌ను భాగస్వాములవుతున్నారు. ఈ రైతు ఉద్యమంలో ఎంతగా భారీ సంఖ్యలో జనం పాల్గొంటున్నారో ప్రభుత్వానికి అర్థమవుతుంది'' అని భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్ అన్నారు. భారత్‌బంద్ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు హరియాణాలోని నోయిడాలో కర్ఫ్యూ విధించారు. పలు జిల్లాల్లో 17వ తేదీ దాకా టెలికాం సేవలను నిలిపేస్తూ హరియాణా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రైతులు సైన్యంలా ఢిల్లీ ఆక్రమణకు వస్తున్నారంటూ బీజేపీ పాలిత హరియాణా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు పంజాబ్‌లోనూ శుక్రవారం దాకా ఇంటర్నెట్ సేవలను నిలిపేస్తున్నట్లు కేంద్ర హోం శాఖ ప్రకటించింది.

పట్టాలపై బైఠాయింపు

నిరసనల్లో భాగంగా గురువారం రైతులు రైల్ రోకో కూడా నిర్వహించారు. పంజాబ్, హరియాణా సరిహద్దుల్లో అతి పెద్దదైన రాజాపురా రైల్వే జంక్షన్ వద్ద వందలాది మంది రైతులు పట్టాలపై బైఠాయించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా రైళ్ల రాకపోకలను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. చాలా రైళ్లను దారి మళ్లించగా కొన్నింటిని రద్దు చేశారు.

అమెరికాలో కాల్పులు.. ఒకరి దుర్మరణం

22 మందికి గాయాలు

కాన్సాస్ సిటీ: అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రం కాన్సాస్ సిటీలో కాల్పులు చోటు చేసుకున్నాయి.. ఈ ఘటనలో ఒకరు చనిపోగా 8 మంది చిన్నారులు సహా మరో 22 మంది గాయాలపాలయ్యారు. బుధవారం సూపర్ బౌల్ చాంపియన్ షిప్ గెలుచుకున్న జట్టు విజయోత్సవాలు జరుపుతున్న వేళ గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు దిగారు. దీంతో జనమంతా భయంతో కేకలు వేస్తూ తలోదిక్కుకు పరుగులు తీయడంతో అంతా గందరగోళంగా మారింది. కాల్పులకు కారకులుగా అనుమానిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాల్పులకు కారణాలు తెలియాల్సి ఉంది.

మరో ఘటనలో..

రాజధాని వాషింగ్టన్‌లో బుధవారం ఉదయం పోలీసు అధికారులు జంతు హింస కేసులో జూలియస్ జేమ్స్ అనే వ్యక్తికి వారెంట్లు ఇచ్చేందుకు అతడి ఇంటికి వెళ్లారు. నిందితుడు పారిపోయేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అతడు ఇంట్లో ఉండే పోలీసులపైకి కాల్పులకు దిగాడు. ఘటనలో ముగ్గురు అధికారులకు గాయాలయ్యాయి. కొన్ని గంటల అనంతరం నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

మీ నమ్మకాన్ని పొందటం నాకు గర్వకారణం

రాయ్‌బరేలీ ఓటర్లకు సోనియా భావోద్వేగ లేఖ



న్యూఢిల్లీ: దశాబ్దాలుగా రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి విజయం సాధిస్తూ ప్రస్తుతం వయోభారం కారణంగా ప్రజాసభను వదిలి ఎగువ సభకు తన రాజకీయ పథాన్ని మార్చుకుంటున్న కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తన నియోజకవర్గ ఓటర్లకు భావోద్వేగంతో ఒక లేఖ రాశారు. ''నేనిప్పుడు ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి మీరే కారణమని గర్వంగా చెబుతా. మీ వల్లే, మీరు నాపై ఉంచిన నమ్మకం వల్లే నా శక్తిమేరకు మీకు సేవచేయగలిగాను. అనారోగ్యం, వయోభారం సమస్యల కారణంగా ఇక మీదట లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయదల్చుకోలేదు. ఈ నిర్ణయం తర్వాత ప్రత్యక్షంగా మీకు సేవచేసే అవకాశం నాకు లేదని తెలుసు. కానీ నా మనసు నిండా మీరే ఉన్నారు. గతంలోలాగే ఇక మీదట కూడా మీరు నాకు, నా కుటుంబానికి అండగా నిలబడతారని తెలుసు'' అని హిందీలో సోనియా ఓటర్లకు ఒక సందేశం పంపారు. ''మీరు లేకుండా ఢిల్లీలో నా కుటుంబం సంపూర్ణం కాదు. రాయ్‌బరేలీకి వచ్చి మిమ్మల్ని కలిసినప్పుడే మొత్తం కుటుంబం అనే భావన కలుగుతోంది. మీ బంధం దశాబ్దాలనాటిది. నా అత్తగారి నుంచే నేనీ బంధాన్ని వారసత్వంగా పొందా. రాయ్‌బరేలీతో నా కుటుంబ బంధం బలంగా పెనవేసుకుంది. నా మామగారు ఫిరోజ్ గాంధీ స్వాతంత్ర్య సిద్ధించాక తొలి సార్వత్రిక ఎన్నికల్లో ఇదే రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభలో అడుగుపెట్టారు. ఆ తర్వాత ఇందిరా గాంధీని ఆశీర్వదించి లోక్‌సభకు పంపారు. జీవితంలో ఎన్ని ఎత్తుపల్లాలు ఎదురైనా తోడుగా నిలిచి బంధాన్ని మరింత పటిష్టం చేశారు. అత్తను కోల్పోయినప్పుడు, భర్తను కోల్పోయినప్పుడూ మీ చెంతకొచ్చిన నన్ను ఆదరించి అక్కున చేర్చుకున్నారు. ఇంతటి మద్దతు, ప్రోత్సాహాన్ని జీవితంలో మరువను. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో గడ్డుపరిస్థితులు ఎదురైనా మీరు నావెంటే నడిచారు. నా కంటే పెద్దవారికి ధన్యవాదాలు, యువతకు ప్రేమాశీస్సులు. త్వరలోనే మిమ్మల్ని కలుస్తా' అని సోనియా తన సందేశం పంపారు. రాజస్తాన్ నుంచి రాజ్యసభకు నామినేషన్ దాఖలుచేసిన మరుసటి రోజు సోనియా తన నియోజకవర్గ ప్రజలను గుర్తుచేసుకుంటూ లేఖ రాయడం గమనార్హం. సోనియా కుమార్తె ప్రియాంక గాంధీ ఈసారి రాయ్‌బరేలీ నుంచి సార్వత్రిక సమరంలో నిలబడతారని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.



గురువారం దోహాలో ఖతార్ ఎమీర్ హమద్ అల్ తానీతో ప్రధాని మోదీ

భారత్, ఖతార్ బంధం సుదృఢం

ఖతార్ ఎమీర్, మోదీ ద్వైపాక్షిక చర్చలు

దోహా: భారత్, ఖతార్ దేశాల బంధం మరింత బలోపేతం అవుతోందని ప్రధాని మోదీ ప్రకటించారు. ఖతర్ పర్యటనలో ఉన్న మోదీ గురువారం ఖతార్ ఎమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్–థానీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. గూఢచర్యం ఆరోపణలపై అరెస్టయి శిక్షలు పడిన ఎనిమిది మంది మాజీ భారతీయ నావికాదళ అధికారులకు ఖతార్ ప్రభుత్వం విడిచిపెట్టిన నేపథ్యంలో ఖతార్ పాలకునితో మోదీ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. '' ఎమీర్‌ను కలవడం అద్భుతం. ఇరుదేశాల మధ్య భిన్నరంగాల్లో విస్తృతస్థాయి సహకారానికి ఈ భేటీ బాటలు పరుస్తోంది. పర్యావరణానికి ప్రయోజనం చేకూర్చే నూతన రంగాల్లో కలిసి పనిచేసేందుకు భారత్, ఖతార్ సిద్ధంగా ఉన్నాయి'' అని భేటీ తర్వాత మోదీ 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు.

నేవీ అధికారులను విడిచిపెట్టినందుకు థాంక్యూ

'ఇరు నేతల చర్చలు ఫలవంతమయ్యాయి. ఖతార్‌లోని భారతీయుల సంక్షేమ బాధ్యతలు తీసుకున్న ఖతార్ ఎమీర్‌కు మోదీ ధన్యవాదాలు చెప్పారు. కఠిన శిక్షలు పడిన 8 మంది మాజీ భారతీయ నావికాదళ అధికారులను వదిలిపెట్టినందుకు ఖతార్ ఎమీర్‌కు మోదీ థాంక్యూ చెప్పి మెచ్చుకున్నారు. భారత్‌లో పర్యటించాల్సిందిగా ఆయనను మోదీ ఆహ్వానించారు'' అని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ ఖ్వాత్రా వెల్లడించారు.

ట్రంప్ కంటే బైడెన్ నయం: పుతిన్

మాస్కో: తెంపరితనం, దూకుడుకు మారుపేరైన డొనాల్డ్ ట్రంప్‌తో పోలిస్తే జో బైడెన్‌ను మరోసారి అమెరికా అధ్యక్షుడిగా చూడాలనుకుంటున్నానని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆశాభావం వ్యక్తంచేశారు. రష్యా అధికారిక టీవీ ఛానెల్‌కు బుధవారం ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో పుతిన్ పలు అంశాలపై మాట్లాడారు. ''రాబోయే అమెరికా ఎన్నికల్లో ఎవరు అధ్యక్షుడు అయినా వారితో రష్యా ప్రభుత్వం కలిసి పనిచేస్తుంది. రష్యా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే ట్రంప్ కంటే బైడెన్ గెలిస్తేనే మంచిదని అనుకుంటున్నా. ఎందుకంటే ఉపాధ్యక్షుడిగానూ, అధ్యక్షుడిగానూ పనిచేసిన బైడెన్‌కు అనుభవం ఎక్కువ. పాతకాలం విధానాలను అవలంభించే నేత ఆయన. ఆయనను కొంత అంచనావేయొచ్చు కూడా. ట్రంప్ ఆలోచనలు అనూహ్యం' అని అన్నారు. బైడెన్ ఆరోగ్యం సరిగా లేదంటూ వస్తున్న వార్తలపై పుతిన్‌ను ప్రశ్నించగా.. ' నేనేమీ డాక్టర్‌నుకాదు. అయినా ఇలాంటి ప్రశ్నకు వ్యాఖ్యలు చేయడం సబబు కాదు. అయితే బైడెన్ ఆరోగ్య సమస్యలు వచ్చే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రభావం చూపగలవు. నేను గమనించినంత వరకు బైడెన్ ఆరోగ్యంగానే ఉన్నారు. అధ్యక్షుడిగా కొనసాగే సత్తా ఆయనకు లేదు అని నేనైతే అనుకోను. పేపర్ వైపు చూసే ప్రసంగం చదువుతారనేది వాస్తవం. నేను కూడా కొన్ని సార్లు ప్రసంగపాఠాన్ని చూసే చదువుతా. అదేమంత పెద్ద విషయం కాదు. ఏదేమైనా బైడెన్ ప్రభుత్వ విధానాలు చాలా తప్పు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనతోనే చెప్పా'' అని పుతిన్ వెల్లడించారు.

టీఎంసీ ఎంపీ మిమి చక్రవర్తి రాజీనామా



కోల్‌కతా: ప్రముఖ బెంగాలీ నటి, టీఎంసీ ఎంపీ మిమి చక్రవర్తి పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు చెప్పారు. రాజకీయాలు తనకు ఇష్టం లేని అంశమని చెప్పారు. జాదవ్‌పూర్ నుంచి మొదటిసారిగా లోక్‌సభకు ఎన్నికైన మిమి గురువారం టీఎంసీ చీఫ్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీని రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో కలిశారు. ఈ నెల 13వ తేదీనే పదవికి రాజీనామా లేఖను పంపినట్లు అనంతరం తెలిపారు. తనకు రాజకీయాలు పడవని అనుభవం ద్వారా తెలుసుకున్నానని చెప్పారు. అయితే, రాజీనామాను సీఎం మమత అంగీకరించిందీ లేనిదీ మిమి తెలుపలేదు. టీఎంసీ అంగీకరించాక నిబంధనల మేరకు లోక్‌సభ స్పీకర్‌కు రాజీనామా లేఖను అందజేస్తానన్నారు. మరికొద్ది నెలల్లోనే లోక్‌సభ ఎన్నికలు జరగనుండగా ఈ పరిణామం చోటుచేసుంది.

మూత్రం నుంచి విద్యుత్

పాలక్కడ్: కాలుష్యకారక శిలాజ ఇంధనాలకు బదులు పునరుత్పాదక ఇంధనంపై ప్రపంచం దృష్టిపెట్టాలన్న ఆకాంక్షల నడుమ ఐఐటీ పాలక్కడ్ పరిశోధకులు పునరుత్పాదక ఇంధనాన్ని మూత్రం నుంచి ఉత్పత్తిచేసి ఔరా అనిపించారు. సంబంధిత పరిశోధనా పత్రాన్ని ప్రముఖ ఆన్‌లైన్ జర్నల్ 'సపరేషన్ అండ్ ప్యూరిఫికేషన్ టెక్నాలజీ'లో ప్రచురించారు. ఈ పునరుత్పాదక విద్యుత్ తయారీ కోసం వారు కొత్తగా ఎలక్ట్రో కెమికల్ రిసోర్స్ రికవరీ రియాక్టర్(ఈఆర్ఆర్ఆర్)ను తయారుచేశారు. ఇందులో మూత్రాన్ని నింపి ఎలక్ట్రోరసాయనిక చర్యల ద్వారా విద్యుత్‌ను, సహజ ఎరువును ఉత్పత్తి చేస్తారు. ఈ విద్యుత్‌తో స్మార్ట్‌ఫోన్లను చార్జ్‌చేయొచ్చు. విద్యుత్ దీపాలను వెలిగించవచ్చు. రీసెర్చ్ స్కాలర్ వి.సంగీత, ప్రాజెక్ట్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీజిత్ పీఎం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్‌లో రీసెర్చ్ అసోసియేట్ రీను అన్నా కోషీల బృందం ఈ పరిశోధన చేపట్టింది. ఈఆర్ఆర్ఆర్ ద్వారా నైట్రోజన్, ఫాస్పరస్, మెగ్నీషియంలు ఎక్కువగా ఉండే సహజ ఎరువునూ పొందొచ్చని ఐఐటీ పాలక్కడ్ ఒక ప్రకటనలో పేర్కొంది. అమ్మోనియా సంగ్రహణి, క్లోరినేషన్ గది, ఎలక్ట్రికల్ గొట్టాల సమన్వయంతో ఈ రియాక్టర్ పనిచేస్తుంది. ఇందులో మెగ్నీషియంను ఆనోడ్‌గా, గాలి కార్బన్‌ను కాథోడ్‌గా వాడతారు. థియేటర్లు, షాపింగ్ మాల్స్ ప్రాంగణాల్లో మూత్ర విసర్జన ఎక్కువ. ఇలాంటి చోట్ల ఈ రియాక్టర్ల ద్వారా ఎక్కువ స్థాయిలో విద్యుత్‌ను ఉత్పత్తిచేసి అక్కడి విద్యుత్‌దీపాలను వెలిగించవచ్చు. ప్రస్తుతం ఈ సాంకేతికత ప్రయోగ దశలోనే ఉందని ఐఐటీ పాలక్కడ్ స్పష్టంచేసింది. ఈ టెక్నాలజీపై పేటెంట్ కోసం బృందం ఇప్పటికే దరఖాస్తు చేసుకుంది. ప్రాజెక్టుకు కేంద్రమే నిధులిచ్చింది.


గెలిచింది నేను కాదు, నాకొద్దీ సీటు

నిజాయితీ చాటుకున్న పాక్ ప్రొవిన్షియల్ ఎన్నికల విజేత

కరాచీ: ఎన్నికల పందేరంలో కోట్లు పంచైనా సరే ఓట్లు ఒడిసిపట్టాలనే నేతలున్న ఈ కాలంలో నువ్వే గెలిచావని ఎన్నికల సంఘం చెబుతున్నా ఒక పాకిస్తాన్ నేత 'నాకు ఇలాంటి గెలుపు వద్దే వద్దు' అని తెగేసి చెప్పారు. రిగ్గింగ్‌కు పాల్పడటం ద్వారా తనను గెలిపించారని, వాస్తవానికి విజేత వేరే ఉన్నారని కుండబద్దలు కొట్టారు. సంక్షుభిత పాకిస్తాన్‌లో ఇటీవల జరిగిన జాతీయ ఎన్నికలతోపాటు నాలుగు ప్రావిన్షియల్(అసెంబ్లీ) ఎన్నికలు జరిగాయి. వాణిజ్య రాజధాని కరాచీ నగరంలో పీఎస్–129 నియోజకవర్గం నుంచి జామాతే ఇస్లామీ పార్టీ అభ్యర్థి హాఫీజ్ ఉర్ రెహ్మాన్ పోటీకి నిలబడ్డారు. అవినీతి కేసుల్లో జైలుపాలైన మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్తాన్ తెహ్రీకే ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ నేత, స్వతంత్ర అభ్యర్థి సైఫ్ బారీ కూడా ఇదే స్థానంలో బరిలో నిల్చారు. సైఫ్‌కు 31,000 ఓట్లు రాగా, రెహ్మాన్‌కు 26,000 ఓట్లు పడ్డాయి. అయితే పీటీఐ నేతను ఎలాగైనా అడ్డుకోవాలనే లక్ష్యంతో కొందరు రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. సైఫ్‌కు కేవలం 11,000 ఓట్లు పడ్డట్లు ఫలితాల్లో వచ్చేలా చేశారు. ఇదే ఫలితాలను పాక్ ఎలక్షన్ కమిషన్ అసలైనవిగా భావించి రెహ్మాన్‌ను విజేతగా ప్రకటించింది. రిగ్గింగ్ విషయం తెల్సి రెహ్మాన్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రత్యేకంగా పత్రికా సమావేశం పెట్టిమరీ తన ధర్మాగ్రహాన్ని వ్యక్తంచేశారు. ''అన్యాయంగా నన్ను ఎవరైనా గెలిపించాలనుకుంటే అందుకు నేను అస్సలు ఒప్పుకోను. ప్రజాతీర్పును గౌరవించాల్సిందే. విజేతనే గెలవనివ్వండి. రెండో స్థానంలో ఉన్న అభ్యర్థి ఓటమిని చవిచూడాల్సిందే. అలాంటి వారికి ఎక్స్‌ట్రాలు అక్కర్లేదు. నేను ఈ గెలుపును స్వీకరించట్లేను. విజేతకే విజయం దక్కాలి'' అని అన్నారు. రెహ్మాన్ నిజాయతీ చూసి అక్కడి వాళ్లు మెచ్చుకున్నారు. అయితే ఈ ఉదంతంపై పాక్ ఎన్నికల సంఘం మరోలా స్పందించింది. ''రిగ్గింగ్ అవాస్తవం. ఇలాంటి ఫిర్యాదులపై దృష్టి పెడతాం'' అని పేర్కొంది. ఈ ఘటనపై త్వరలోనే స్పందిస్తామని పీటీఐ తెలిపింది.

నేషనల్ కాన్ఫరెన్స్ యూ టర్న్

- సొంతంగా పోటీ చేస్తామన్న ఫరూక్ అబ్దుల్లా
- అలాంటిదేమీ లేదన్న ఒమర్



శ్రీనగర్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీని కలిసికట్టుగా ఎదుర్కొనే లక్ష్యంతో ఏర్పాటైన ఇండియా కూటమి నుంచి ఒక్కో పార్టీ దూరమవుతున్న వేళ మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. జమ్మూకశ్మీర్‌లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా బరిలోకి దిగుతుందని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) చీఫ్ ఫరూక్ అబ్దుల్లా గురువారం ప్రకటించారు. కొద్దిసేపటికే పార్టీ నేత, ఫరూక్ అబ్దుల్లా కుమారుడు ఒమర్ అబ్దుల్లా అలాందేమీ లేదంటూ ప్రకటించారు. ఇండియా కూటమిలోనే కొనసాగుతామని జమ్మూకశ్మీర్‌లోని ఎంపీ స్థానాల్లో పోటీపై భాగస్వామ్య పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. కశ్మీర్‌లోని అతిపెద్ద పార్టీ అయిన ఎన్సీ ఇండియా కూటమితోపాటు ప్రాంతీయ గుప్కార్(పీఏజీడీ) అలయెన్స్‌లోనూ కీలకంగా ఉంది.

రైతు పోరాటం దేశం కోసమే: రాహుల్



ఔరంగాబాద్: దేశ సరిహద్దులను కాపాడేందుకు సైనికులు పోరాడుతున్నట్లే రైతులు కూడా దేశం కోసమే ఆందోళనలు సాగిస్తున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పంటలకు కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయడం, రుణ మాఫీ వంటి డిమాండ్ల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో' ఆందోళనలపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఢిల్లీలో నిరసనలు తెలుపుతున్న రైతులపైకి టియర్ గ్యాస్, పెల్లెట్లను ప్రయోగిస్తున్నారు. రబ్బర్ బుల్లెట్లు తగిలి ముఖమంతా గుర్తు పట్టలేని విధంగా మారిపోయిన ఓ రైతు నన్ను కలిశారు. మీరు చేస్తోంది తప్పు కాదు. సరిహద్దుల్లో సైనికుల్లాగా మీరు కూడా దేశం కోసం పోరాడుతున్నారు'అని ఆయనకు ధైర్యం చెప్పానన్నారు. తాము అధికారంలోకి వస్తే మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించారు. రాహుల్ యాత్ర గురువారం బిహార్‌లోని ఔరంగాబాద్ జిల్లాలో సాగింది.

మహువా మొయిత్రాకు ఈడీ సమన్లు



న్యూఢిల్లీ: విదేశీ మారకద్రవ్య (ఫెమా) నిబంధనల ఉల్లంఘన కేసులో టీఎంసీ నేత, లోక్‌సభ మాజీ సభ్యురాలు మహువా మొయిత్రాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం సమన్లు జారీ చేసింది. లోక్‌పాల్ నమోదు చేసిన కేసులో ప్రాథమిక విచారణలో భాగంగా వాంగ్మూలం నమోదు చేసేందుకు ఈ నెల 19వ తేదీన ఢిల్లీలోని తమ కార్యాలయానికి రావాలని ఆమెను కోరింది. అదానీ గ్రూప్, ప్రధాని మోదీ లక్ష్యంగా పార్లమెంట్‌లో ప్రశ్నలు సంధించినందుకు వ్యాపారవేత్త హీరానందాని నుంచి ఆమె ప్రతిఫలం అందుకున్నారని, జాతీయ భద్రతను సైతం ఆమె పట్టించుకోలేదంటూ బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే ఆరోపణలు చేయడం తెలిసిందే. ఇదే అంశంపై డిసెంబర్‌లో ఆమె లోకసభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. తానెలాంటి తప్పిదానికి పాల్పడలేదని, కేంద్రం కావాలనే ఇలాంటివన్నీ చేస్తోందని మహువా మొయిత్రా ఆరోపిస్తున్నారు.

అజిత్ వర్గమే అసలైన ఎన్సీపీ: స్పీకర్

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ)లోని అజిత్ పవార్ వర్గమే అసలైన ఎన్సీపీ అని మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ ప్రకటించారు. 2023 జూలైలో పార్టీలో చీలిక అనంతరం అనర్హత వేటు వేయాలంటూ అజిత్ పవార్, శరద్ పవార్ వర్గాలు పరస్పరం అందజేసిన పిటిషన్లను సైతం ఆయన కొట్టిపారేశారు. ఈ విషయాన్ని గురువారం ఆయన మీడియా ఎదుట ప్రకటించారు. 2023 జూలైలో ఎన్సీపీ నుంచి వేరుకుంపటి పెట్టుకున్న అజిత్ పవార్ తన వర్గంతో కలిసి శివసేన–బీజేపీ ప్రభుత్వంలో చేరడం, డిప్యూటీసీఎంగా ప్రమాణం చేయడం తెలిసిందే. అజిత్ పవార్ వర్గమే అసలైన ఎన్సీపీ అంటూ కేంద్ర ఎన్నికల సంఘం సైతం ఇటీవల ప్రకటించారు.

సోరెన్‌కు 22 వరకు జ్యుడీషియల్ కస్టడీ

రాంచీ: జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్‌సోరెన్‌కు ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. హేమంత్ సోరెన్‌ను గురువారం కోర్టులో హాజరుపరచగా భూ కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈ నెల 22వ తేదీ వరకు కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారని న్యాయవాదులు తెలిపారు. అనంతరం ఆయన్ను అధికారులు రాంచీలోని బిర్సా ముండా సెంట్రల్ జైలుకు తరలించారన్నారు. జనవరి 31వ తేదీన హేమంత్ సోరెన్ సీఎం పదవికి రాజీనామా చేసిన వెంటనే ఈడీ అదుపులోకి తీసుకుంది.

17 నుంచి బీజేపీ జాతీయ మండలి భేటీ

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈ నెల 17వ తేదీ నుంచి రెండు రోజులపాటు ఢిల్లీలో పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశాలు జరగనున్నాయి. భారత్ మండపంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రారంభిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ ఆఫీస్ బేరర్లు, కేంద్రమంత్రులు, సిట్టింగ్, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు సహా మొత్తం 11,500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు. రెండో రోజు ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని వివరించారు.

అమెరికాలో మరో భారతీయుడి హత్య



వాషింగ్టన్: అమెరికాలో భారతీయుల వరస మరణాలు అక్కడి భారతీయుల్లో గుబులు రేపుతున్నాయి. కాలిఫోర్నియా రాష్ట్రంలో కేరళ కుటుంబం మొత్తం సొంతింట్లో మరణించిన వార్త మరువకముందే మరో హత్యోదంతం అమెరికాలో వెలుగుచూసింది. అలబామా రాష్ట్రంలో రహదారి వెంట హోటల్‌ను నడుపుకుంటున్న 76 ఏళ్ల ప్రవీణ్ రావూజీభాయ్ పటేల్‌ను అద్దె గది కోసం వచ్చిన ఒక కస్టమర్ కాల్చి చంపారు. ఫిబ్రవరి ఎనిమిదో తేదీన జరిగిన ఈ ఘటన తాలూకు పూర్తి వివరాలను షెఫీల్డ్ పట్టణ పోలీస్ ఉన్నతాధికారి రిక్కీ టెర్రీ గురువారం వెల్లడించారు. షెఫీల్డ్ పట్టణంలో హిల్‌క్రెస్ట్ మోటెల్ పేరుతో ఒక హోటల్‌ను ప్రవీణ్ సొంతంగా నిర్వహిస్తున్నారు. ఆ హోటల్‌కు 35 ఏళ్ల విలియం జెరిమీ మోరే అనే వ్యక్తి వచ్చి రూమ్ కావాలని ప్రవీణ్‌ను అడిగాడు. కొద్దిసేపటికే విలియం, ప్రవీణ్ మధ్య పెద్ద వాగ్వాదం జరిగింది. వెంటనే విలియం తన వద్ద ఉన్న గన్‌తో ప్రవీణ్‌ను కాల్చిచంపాడు. అక్కడి నుంచి పారిపోయి దగ్గర్లోని ఇంట్లో చొరబడేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్ట్‌చేశారు. మూడు సార్లు తుపాకీ శబ్దం విన్నానని అక్కడే ఉన్న ఒక సాక్షి చెప్పారు. అసలు కారణాలను పోలీసులు వెల్లడించలేదు.

ఆర్థిక మాంద్యంలోకి జపాన్

టోక్యో: జపాన్ మాంద్యంలోకి జారిపోయింది. జపాన్ ఆర్థిక వృద్ధి రేటు 2023 చివరి త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్ మధ్య)లో 0.4%, జూలై–సెప్టెంబర్‌లో 2.9% మేర క్షీణించింది. వరుసగా రెండు త్రైమాసికాల్లో ఆర్థిక వృద్ధి మందగించిన సందర్భాల్లో ఆర్థిక వ్యవస్థను మాంద్యంలో ఉందనేందుకు గుర్తుగా భావిస్తారు. దీంతోపాటు, జపాన్ కరెన్సీ యెన్ కూడా బలహీనపడింది. ఫలితంగా ప్రపంచంలోని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న జపాన్..అమెరికా, చైనా, జర్మనీల తర్వాత నాలుగో స్థానానికి పడిపోయింది.



నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో నిత్యాన్నదానానికి విజయవాడ హనుమాన్‌పేటకు చెందిన శివరామకృష్ణారావు రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు



ఏర్పాట్ల పరిశీలన

నందిగామ: పట్టణంలోని కేవీఆర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను గురువారం కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు.

ట్రాఫిక్ ఏసీపీగా జనార్దన్



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 4వ ట్రాఫిక్ ఏసీపీగా ఎం.జనార్దన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ టి.కె.రాణాను మర్యాదపూర్వకంగా కలిశారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు బంగారు రాళ్ల హారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు చిలకలూరిపేటకు చెందిన భక్తులు గురువారం బంగారు రాళ్ల హారాన్ని కానుకగా సమర్పించారు. చిలకలూరిపేటకు చెందిన నక్కా రమేష్ బాబు, కోటేశ్వరమ్మ దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. సుమారు 61.8 గ్రాముల బంగారం, రాళ్లతో తయారు చేయించిన హారాన్ని ఆలయ ఈఈ కోటేశ్వరరావుకు అందజేశారు. అమ్మవారి ఉత్సవాల్లో ఈ హారాన్ని వినియోగించాల్సిందిగా దాతలు ఆలయ అధికారులను కోరారు. అనంతరం దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

18న కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: ఉమ్మడి కృష్ణా జిల్లా కబడ్డీ సీనియర్ పురుషుల, సబ్ జూనియర్ బాలబాలికల జట్లను ఈ నెల 18వ తేదీ అవనిగడ్డలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణా జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ పురుషుల పోటీలకు 85 కేజీలలోపు బరువు, సబ్ జూనియర్ బాలిబాలికల బరువు 55 కేజీల లోపు బరువు ఉండాలని పేర్కొన్నారు. 2008 మార్చి 19వ తేదీ తర్వాత పుట్టిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలలోగా ఎంపిక ప్రాంగణానికి హాజరుకావాలని వివరించారు. మరిన్ని వివరాలకు 9704063555ను సంప్రదించాలని సూచించారు.

మరింత బాధ్యతగా పని చేస్తాం

అవనిగడ్డ: గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ, డీడీఓ అధికారాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 11 ఇవ్వడం గ్రామ స్వరాజ్య స్థాపనలో మరో ముందడుగు అని గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంక్షేమ, అభివృద్ధి అసోసియేషన్ (జీపీ శ్వాస) రాష్ట్ర అధ్యక్షుడు ఆది అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరింత బాధ్యతగా పని చేసి ప్రభుత్వానికి, ప్రజలకు మంచి సేవలు అందిస్తామని రాష్ట్రంలోని 6,500 మంది కార్యదర్శుల తరపున ఆయన ప్రకటించారు.

ఎంపీపీ పాఠశాలలో జాంబియా, ప్రథమ్ ఇంటర్నేషనల్ టీం



కంచికచర్ల: కంచికచర్ల ప్రాథమిక పాఠశాల(మెయిన్)ను దక్షిణాఫ్రికాలోని జాంబియా మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, ప్రథమ్ ఇంటర్నేషనల్ టీం సభ్యులు టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ కార్యక్రమంలో భాగంగా గురువారం సందర్శించారు. తొలుత విద్యార్థులు టీం సభ్యులకు జాతీయ జెండాలతో స్వాగతం పలికారు. వారు పాఠశాలలో 3,4,5 తరగతుల విద్యార్థులను ప్రత్యేకంగా కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ, హెచ్ఎం శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు వేముల భిక్షమయ్య, శేషం వెంకట్రావు, లక్ష్మయ్య, సీఆర్పీ రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ, న్యాయ విభాగాల కమిటీలు నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర ఎస్టీ విభాగం కమిటీని నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎస్టీ విభాగం కమిటీ జోనల్ ఇన్‌చార్జిగా మానుపాటి చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా మేడా రమేష్, కార్యదర్శిగా లావూరి బడ్డు నాయక్, జాయింట్ సెక్రటరీ భూక్యా రాములు నియమితులయ్యారు.

పార్టీ రాష్ట్ర న్యాయ విభాగ కమిటీ

న్యాయ విభాగ కమిటీ ఉపాధ్యక్షులుగా పిల్లా రవి, అధికార ప్రతినిధిగా కోటంరాజు సుజాత, కార్యదర్శిగా అబ్రహం లింకన్, జాయింట్ సెక్రటరీగా మోటుపల్లి విశల్ రావు నియమితులయ్యారు.

వలంటీర్లు.. సంక్షేమ వారధులు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- జిల్లాలో 10,150 మంది వలంటీర్లకు అభినందన పురస్కారాలు
- 9,982 మందికి సేవా మిత్ర, 133 మందికి సేవా రత్న, 35 మందికి సేవా వజ్ర



వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు ప్రదానం చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వారధులు వలంటీర్లు అని, వారి సేవలు వెలకట్టలేనివని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కొనియాడారు. సేవా సైన్యానికి సలాం.. అంటూ వరుసగా నాలుగో ఏడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో వలంటీర్లకు అభినందన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కె.అనురాధ తదితరులతో కలిసి వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ సీఎం దార్శనికతతో ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా గొప్ప ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. కులమతరాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల ఫలాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుతున్నాయన్నారు. వలంటీర్లు తమ పరిధిలోని 50 లేదా 100 కుటుంబాలకు చేదోడువాదోడుగా నిలుస్తూ నిస్వార్థంగా సేవలందిస్తున్నారన్నారు. వీరి సేవలకు గుర్తింపుగా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రదానం చేస్తోందని వివరించారు. కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని మరింత బాగా పనిచేసి, ప్రభుత్వానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు

జిల్లాలో మొత్తం 10,150 మందికి పురస్కారాలు

సచ్ఛీలత, ప్రజలకు అందుబాటు, పనితీరులో ప్రగతి, కుటుంబాల సంతృప్తిస్థాయి, యాప్‌ల వినియోగం, నవరత్నాల అమల్లో భాగస్వామ్యం, ప్రజలకు అన్ని విధాల సహాయసహకారాలు అందించడం తదితర అంశాల ఆధారంగా ప్రభుత్వం వలంటీర్లను పురస్కారాలకు ఎంపిక చేసినట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 10,150 మంది వలంటీర్లు పురస్కారాలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరిలో 9,982 మంది సేవా మిత్ర, 133 మంది సేవా రత్న, 35 మంది సేవా వజ్ర పురస్కారాలకు ఎంపికైనట్లు వివరించారు. సేవా వజ్ర పురస్కారం కింద రూ. 45 వేల నగదు బహుమతి, సేవా రత్న పురస్కారం కింద రూ. 30,000 నగదు బహుమతి, సేవా మిత్ర పురస్కారం కింద రూ. 15 వేలు నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. వీటితో పాటు సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జి, మెడల్‌లతో సత్కరించారు. శుక్రవారం నుంచి 10 రోజుల పాటు జిల్లాలో ప్రజాప్రతినిధుల సమక్షంలో పండగ వాతావరణంలో సత్కార కార్యక్రమం జరగనుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల పాత్ర గణనీయం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాజశేఖర్ చిత్రంలో కలెక్టర్ రాజాబాబు తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేయడంలో మహిళా స్వయం సహాయక సంఘాల పాత్ర గణనీయమైనదని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో రూ. 5 కోట్ల అంచనాతో నిర్మించనున్న జిల్లా మహిళా సమాఖ్య, శిక్షణ సాంకేతిక అభివృద్ధి కేంద్ర భవనాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాలు సంస్థాగతంగా బలోపేతమయ్యారన్నారు. మహిళా సంఘాలు పొదుపు చేయడం, రుణాలు తీసుకోవడం, తిరిగి చెల్లిస్తున్నారన్నారు. దేశంలో బ్యాంకులు మంజూరు చేస్తున్న రుణాల్లో స్వయం సహాయక సంఘాలు 30 శాతం భాగస్వామ్యంతో ఉన్నాయన్నారు. దీంతో బ్యాంకులు రూ. 20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నారని తెలిపారు. ఇలాంటి వ్యవస్థ మిగతా దేశాల్లో, రాష్ట్రాల్లో లేదన్నారు. మహిళా సాధికారత విలువ తెలిసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి ఎదుగుదలకు కృషి చేస్తున్నారన్నారు. అందుకే ప్రతి పథకాన్ని మహిళలకే ఎక్కువశాతం అందిస్తున్నారన్నారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ కలెక్టరేట్‌లో శిక్షణ, అధికారిక సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సరైన సమావేశ హాల్ లేకపోవటంతో సెర్ప్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. డీఆర్డీఏ, కలెక్టర్ నిధులు రూ. 5 కోట్లతో భవన సముదాయాన్ని నిర్మించుకునేందుకు శంకుస్థాపన చేశామని చెప్పారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తోట మున్నెమ్మ మాట్లాడుతూ తమ సంఘాల సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు భవనం నిర్మించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, ఎస్ఈ విజయకుమారి, డీపీవో నాగేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సుబ్బారాయుడి రథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభించిన అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

మోపిదేవి: మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజు గురువారం రాత్రి స్వామివారి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు దంపతులు ఉత్సవాన్ని ప్రారంభించారు. స్వామివారిని ఊరేగింపుగా రథం వరకు తీసుకొచ్చారు. తొలుత ఆలయ ఏసీ ఎన్ సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ, వేదపండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ నేతృత్వంలో ఎస్ఐ వైవీవీ సత్యనారాయణ భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఈ ప్రాంతంలో సందడి నెలకొంది. తీన్‌మార్, డప్పు కళాకారులు, వేషధారుల సందడితో అర్ధరాత్రి వరకు రథోత్సవం కొనసాగింది. సాయంత్రం 4 గంటలకు ఆలయ ప్రాంగణంలో తెనాలికి చెందిన ఓలేటి శ్రీనివాసరావు భక్తిరంజని కార్యక్రమం ఆకట్టుకుంది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, సర్పంచి నందిగం మేరీరాణి, సీఐలు నాగప్రసాద్, త్రినాధ్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు 150 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణ

- ముఖ్యఅతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్
- జగ్గయ్యపేటలో ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ ఢిల్లీరావు, విప్ ఉదయభాను



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ప్రభుత్వ విప్ ఉదయభాను తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో రెండో అతిపెద్దది అయిన 150 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. దీన్ని శుక్రవారం ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ జగ్గయ్యపేటలో జాతీయరహదారికి అనుకున్న ఎకరంన్నర స్థలంలో ఆవిష్కరించనున్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యాన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నేతృత్వంలో ఎకరంన్నర స్థలంలో రూ.60 లక్షలతో పార్కు, వాటర్ ఫౌంటెన్ తదితర హంగులతో జగ్గయ్యపేట వైభవాన్ని చాటేలా రాష్ట్ర సరిహద్దులో రూపొందించారు.

ఏర్పాట్ల పరిశీలన

స్థానిక విష్ణుప్రియనగర్‌లో జరుగుతున్న ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ప్రభుత్వ విప్ ఉదయభాను, నందిగామ ఆర్డీవో సాయిబాబు పరిశీలించారు. తొలుత జాతీయజెండా ఆవిష్కరణ ట్రయల్‌రన్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ సుమారు 2 వేల మంది వస్తారని అంచనా వేశామని, ప్రాంగణం చుట్టూ జాతీయ జెండా క్లాత్‌ను ఏర్పాటుచేస్తున్నామని, ప్రజలు వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్‌లను కూడా ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు గవర్నర్ ఆవిష్కరిస్తారని, ఎంపీ కేశినేని నాని పాల్గొంటారన్నారు.

ఉపాధికి డిజిటల్ హంగులు

- ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి వెళ్లకుండానే రిజిస్ట్రేషన్
- నమోదు చేసుకున్న వారి మొబైల్ నంబర్లకు ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాల ఖాళీల వివరాలు
- అంతా ఆన్‌లైన్‌లోనే పూర్తి



వెబ్‌సైట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, అధికారులు(ఫైల్)

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖకు ప్రభుత్వం డిజిటల్ హంగులను అద్దింది. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను మరింత చేరువ చేయడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ వెబ్ పోర్టల్ గత నెల 8వ తేదీన ఏపీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సచివాలయంలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ప్రయివేట్ కంపెనీల్లో ఉద్యోగాల ఖాళీలు, ప్రభుత్వ శాఖల్లో జారీ చేసిన నోటిఫికేషన్ల వివరాలను పొందుపరిచారు. నిరుద్యోగ యువత వారి విద్యార్హతలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వెంటనే వారి విద్యార్హతల మేరకు ఏ ఉద్యోగాలకు అర్హులో వారి మొబైల్ నంబరుతోపాటు మెయిల్ ఐడీకి సమాచారం అందుతుంది. ప్రయివేట్ కంపెనీల్లో ఖాళీలను భర్తీ చేయడానికి ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాల సమాచారం, ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగాల ఖాళీల భర్తీకి జారీ చేసే నోటిఫికేషన్ల సమాచారం ఈ వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు నవీకరణ జరుగుతుంటుంది.

ఆధార్, ఫోన్ నంబరుతో వెబ్‌పోర్టల్‌లో లాగిన్

- ఇంటర్నెట్‌లో ఎంప్లాయిమెంట్.ఏపీ.జీవోవీ.ఇన్‌లో జాబ్‌సీకర్ వారి ఆధార్ కార్డు, ఫోన్ నంబరు ద్వారా లాగిన్ అవ్వాలి.
- వారి విద్యార్హతల వివరాలను నమోదు చేసిన వెంటనే వారి మొబైల్ నంబరుకు మెసేజ్ వస్తుంది
- వివరాలు నమోదు చేసిన వెంటనే ఆ జిల్లా పరిధిలోని ఎంప్లాయిమెంట్ అధికారికి ఆ వివరాలు చేరతాయి.
- ఎంప్లాయిమెంట్ శాఖ కార్యాలయంలోని సిబ్బంది ఎప్పటికప్పుడు వాటిని పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటే రిజిస్ట్రేషన్ నంబరును అభ్యర్థికి పంపుతారు.
- ఏమైనా తప్పుగా వివరాలు నమోదు చేసుకున్నా, ఇంకా అదనపు సమాచారం కావాలన్నా కార్యాలయ సిబ్బంది ఫోన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకుంటున్న వారికి సమాచారం అందిస్తారు.
- వివరాలు సక్రమంగా ఉంటే రిజిస్ట్రేషన్ కార్డును మంజూరు చేస్తారు. ఆ కార్డును అభ్యర్థి ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ కార్యాలయంలో నిర్వహించే విద్యార్హత పత్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు విద్యార్హతల నమోదు వంటి సేవలు ఈ వెబ్ పోర్టల్‌లో అందుబాటులోకి వచ్చాయి.
- ఈ వెబ్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటే కేవలం రెండు రోజుల్లోనే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్డు అందుతుంది.
- ఎంప్లాయిమెంట్ కార్డులో వివరాలు ఏమైనా తప్పుగా ముద్రించినా వాటిని సరిచేసుకుని, మళ్లీ కార్డు పొందేందుకు ఈ వెబ్‌పోర్టల్‌లో అవకాశం కల్పించారు. దీనికి అధికారుల అనుమతి తప్పనిసరి.
- ఏవిధమైన విద్యార్హతలు లేని వారు కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చు. వారికి విద్యార్హతలతో సంబంధం లేని ఉద్యోగాల సమాచారాన్ని అందజేస్తారు.
- ఇంటర్నెట్ సెంటర్‌లో అభ్యర్థులు స్వయంగా వివరాలు నమోదు చేసుకోవచ్చు లేదా ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన లేని వారు జిల్లా ఉపాధి కార్యాలయాలకు వచ్చి అక్కడ వివరాలు నమోదు చేసుకోవచ్చు. మొబైల్ ఫోన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.

యువతకు ఎంతో ఉపయోగం



ఈ వెబ్‌పోర్టల్ యువతకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది. ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి రాకుండా వారి విద్యార్హతా పత్రాలను రిజిస్ట్రేషన్ చేయించుకుని ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్డు కూడా పొందవచ్చు. కార్డు గడువు ముగిసిన ఆరు నెలల లోగా ఆన్‌లైన్‌లో రెన్యువల్ చేసుకోవచ్చు. జాబ్ మేళాల సమాచారం కూడా అందజేస్తాం

–దేవరపల్లి విక్టర్‌బాబు, ఉమ్మడి కృష్ణాజిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి

రాష్ట్రస్థాయి రన్‌లో ఉత్సాహంగా ఔత్సాహికులు



రన్‌లో పాల్గొన్న వివిధ ప్రాంతాల ఔత్సాహికులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శేషాద్రిరావు ఇంజినీరింగ్ కాలేజీ రజతోత్సవాలు పురస్కరించుకుని గురువారం ఉదయం రాష్ట్ర స్థాయి 10కే, 5కే రన్‌లో 19జిల్లాల నుంచి ఎనిమిదేళ్ల నుంచి 74 ఏళ్ల వయసు వయసు వరకు ఉన్న 600మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆ కాలేజీ కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ ప్రారంభించారు. గెలుపొందిన పురుషుల, మహిళా విజేతలకు రూ.1.17లక్షల నగదు పారితోషికాన్ని అందించారు. 10కే రన్ విభాగంలో మొదటి, రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ స్థానాలకు వరుసగా కె.పైడప్పడు(విజయవాడ), ఎం.హరీష్(విజయనగరం), టి.బ్రహ్మారెడ్డి (విజయవాడ), ఎం.సత్య(విశాఖపట్నం), బి.కరుణశ్రీ(విశాఖపట్నం), పి.చక్ర అనూష(గుడివాడ), బి.అర్చన(భీమవరం), పి.మేరీ జ్యోత్స్న(గొడవర్రు) కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ బి.కరుణకుమార్ చెప్పారు. గవర్నింగ్ బాడీ సభ్యులు వల్లూరుపల్లి వెంకట కిరణ్, ముసునూరి శ్రీరామ్, కాలేజీ సలహాదారు డాక్టర్ బి.కరుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు, పీడీలు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కాలేజీ రజతోత్సవానికి గవర్నర్

ఇంజినీరింగ్ కాలేజీ రజతోత్సవాలు పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీన జరిగే ముగింపు సభకు ముఖ్య అతిథిగా ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ విచ్చేయనున్నారు. ఈ విషయాన్ని గురువారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ నెల 16నుంచి 18వ తేదీ వరకు వేడుకలను చేయనున్నామని చెప్పారు. 16న జరిగే ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, 17న ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ జి.వి.ఆర్.ప్రసాదరాజు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు చెప్పారు. 16న పద్మశ్రీ పద్మజారెడ్డి బృందంతో బాలే శైలిలో శ్రీకృష్ణ పారిజాతం నృత్య రూపక ప్రదర్శన ఉంటుందన్నారు. 17న సినీ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్ తో మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

జెస్సీరాజ్, జోయల్‌ఆదర్శ్ క్రీడా నైపుణ్యం అద్భుతం

గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్



జెస్సీరాజ్, జోయల్ ఆదర్శ్‌ను అభినందిస్తున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్

విజయవాడ స్పోర్ట్స్: జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తున్న అక్కాతమ్ముడు జెస్సీరాజ్, జోయల్‌ఆదర్శ్‌ల క్రీడా నైపుణ్యాన్ని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ అభినందించారు. ఇటీవల చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి ఆర్టిస్టిక్ సోలో స్కేటింగ్ పోటీల్లో వీరిద్దరూ రాణించి పతకాలు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భం పురస్కరించుకుని వీరిద్దరూ గవర్నర్ అబ్దుల్‌నజీర్‌ను విజయవాడలోని గవర్నర్ బంగ్లాలో గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జెస్సీరాజ్ ఆర్టిస్టిక్ సోలో స్కేటింగ్ పోటీల్లో రాణించి ఇప్పటి వరకు 20(8గోల్డ్, 7సిల్వర్, 5 బ్రాంజ్) రాష్ట్ర, జాతీయ స్థాయి పతకాలు, జోయల్‌ఆదర్శ్ 7(4గోల్డ్, 3 బ్రాంజ్) రాష్ట్ర, జాతీయ పతకాలు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇదే క్రీడా స్ఫూర్తితో అంతర్జాతీయ పోటీల్లోనూ పతకాలు సాధించి రాష్ట్ర ఖ్యాతిని చాటాలని ఆయన ఆకాంక్షించారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలు తప్పనిసరి

చిలకలపూడి(మచిలీపట్నం): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల నివేదికలను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా సిద్ధం చేయాలని డీఆర్వో కె.చంద్రశేఖరరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాల్లో ఎన్నికల వ్యయ సిబ్బందికి గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలను బాగా చదువుకోవాలని, సందేహాలు ఉంటే సంబంధిత నోడల్ అధికారులను సంప్రదించాలన్నారు. జిల్లా ఆడిట్ అధికారి, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి వైవీ సూర్యభాస్కరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల ఖర్చుల రకాలు తదితర అంశాలపై సిబ్బంది చేయాల్సిన విధులను వివరించారు. శిక్షణ తరగతుల్లో అధికారులు పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శన నిలిపివేత



ట్రెండ్ సెట్ మాల్‌లో అధికారులతో టీడీపీ నేతల వాగ్వాదం

విజయవాడస్పోర్ట్స్: వివాదాస్పద చిత్రం రాజధాని ఫైల్స్‌ను నిలిపివేయాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోని రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అమలు చేసింది. గురువారం విడుదలైన ఈ చిత్రం ఎన్టీఆర్ జిల్లాలో 13, కృష్ణా జిల్లాలో ఆరు థియేటర్లలో ఉదయం ఆట ప్రదర్శించారు. విశ్రాంతి సమయం వరకు ప్రదర్శన కొనసాగింది. అప్పుడే హై కోర్టు ఆదేశాలను, జిల్లా కలెక్టర్ల ప్రొసీడింగ్స్‌తో కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ టి.కె.రాణా రంగంలోకి దిగారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం థియేటర్లకు చేరుకుని ప్రదర్శనను నిలిపివేశారు. హై కోర్టు, కలెక్టర్‌ల ఆదేశాలతో చిత్ర ప్రదర్శనను నిలిపివేయాలని థియేటర్ల వద్దకు చేరుకుని టికెట్ కౌంటర్, థియేటర్ ప్రవేశ ద్వారం వద్ద నోటీసులను అంటించారు. దీంతో పలువురు ప్రేక్షకులు థియేటర్ల నుంచి వెళ్లిపోగా.. ప్రేక్షకుల ముసుగులో ఉన్న కొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికారులపై దురుసుగా ప్రవర్తించారు. హై కోర్టు, కలెక్టర్‌ల ఉత్తర్వులున్నాయని వివరిస్తున్నా.. వితండ వాదానికి దిగారు. విజయవాడ ట్రెండ్ సెట్ మాల్‌లో పలువురు టీడీపీ నాయకులు, అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

క్లుప్తంగా

పటమట సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

గుణదల (విజయవాడ తూర్పు): విజయవాడ పటమట సబ్ రిజిస్ట్రార్ గా విధులు నిర్వహిస్తున్న వేగే మణి చైతన్య సస్పెండ్ అయ్యారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉత్తీర్ణత సాధించిన ఆయన విజయవాడ నగరంలోని గుణదల, గాంధీనగర్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్ గా పనిచేశారు. గుణదల కార్యాలయంలో పనిచేసిన సమయంలో డాక్యుమెంట్ల వ్యవహారంలో అవకతవకలు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలు రుజువైన నేపథ్యంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ సవరణ చేయాలి

కృష్ణలంక(విజయవడతూర్పు): బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ సవరణ చేయాలని ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్(ఏఐబీడీపీఏ) జాతీయ ఉపాధ్యక్షుడు పి.అశోక్‌బాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో గురువారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.మాధవరావు అధ్యక్షతన ఆలిండియా బీఎస్ఎన్ఎల్ డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్ కృష్ణాజిల్లా ఆరవ మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అశోక్‌బాబు మాట్లాడుతూ ఈ సందర్భంగా 75 ఏళ్లు నిండిన 40 మంది సభ్యులను సన్మానించారు. అనంతరం అసోసియేషన్ కృష్ణాజిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆర్.మాధవరావు, కార్యదర్శిగా రమేష్‌బాబు, కోశాధికారిగా ఎస్.సాయిబాబు ఎన్నికయ్యారు.

పదిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులు కావాలి

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి జిల్లాలోని విద్యాశాఖ అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలకు విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో గత సంవత్సర ఉత్తీర్ణతా శాతానికి మించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలన్నారు. పరీక్షలు జరిగే నాటికి విద్యార్థులకు నిత్యం ఆయా సబ్జెక్టుల్లో పరీక్షలను నిర్వహిస్తూ వారిలో ఉన్న భయాన్ని పోగొట్టాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి అన్ని విషయాలు అర్థమయ్యేలా ఓర్పుతో వివరించాలన్నారు. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఫెయిల్ అయిన సబ్జెక్టు టీచర్లపై చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో టీచర్లు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ హెచ్చరించారు.

సేవకు సెల్యూట్



ప్రోత్సాహక నగదు విడుదల చేస్తున్న సీఎం జగన్, పక్కన మంత్రి రజని,ఎంపీ సురేష్, ఎమ్మెల్యే రోశయ్య, కలెక్టర్, మేయర్

- వలంటీర్లకు వందనం కార్యక్రమానికి పోటెత్తిన అభిమాన 'జనం'
- వలంటీర్లను అవార్డులతో సత్కరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు/తాడికొండ/పట్నంబజార్: అభిమానం పోటెత్తింది. నాలుగేళ్ల కిందట ఏర్పాటైన ముఖ్యమంత్రి మానసపుత్రిక అయిన వలంటీర్ల వ్యవస్థ నేడు ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న వేళ .. వలంటీర్లకు వందనం పేరుతో నిబద్ధతతో పనిచేసిన వలంటీర్లకు అవార్డులు అందచేసే కార్యక్రమానికి తాడికొండ నియోజకవర్గం ఫిరంగిపురం వేదిక అయింది. ఫిరంగిపురం శివారు రేపూడిలో గురువారం నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమానికి జనాభిమానం పోటెత్తింది. వేలాది సంఖ్యలో వలంటీర్లు, ప్రజలు, కార్యకర్తలు, నాయకులు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పకడ్బందీ ఏర్పాట్లు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫిరంగిపురం మండల పర్యటనను పురస్కరించుకుని పోలీసులు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు, సభావేదిక వద్దకు వెళ్లేందుకు ప్రత్యేక రోడ్డు నిర్మాణం, వీఐపీ వాహనాల పార్కింగ్, బస్సులు నిలిపేందుకు ప్రత్యేక ప్రాంగణం, ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ మళ్లించడంలో పోలీసులు సఫలమయ్యారు. తాగునీరు, అల్పాహారం, అందరికీ సకాలంలో అందించారు. దాదాపు 40వేల మందికి పైగా ప్రజలు సభలో పాల్గొన్నప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం సజావుగా జరగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు, మంత్రి బూడి ముత్యాల నాయుడు, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ నందిగం సురేష్, గుంటూరుజిల్లా ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

క్షేమంగా ఇంటికి చేరిన బాలికలు


మాట్లాడుతున్న సీఐ మోహనరెడ్డి

పటమట(విజయవాడ తూర్పు): ఇంటి నుంచి పాఠశాలకని బయలుదేరి విశాఖపట్నం వెళ్లిన ముగ్గురు బాలికలను పటమట పోలీసులు గంటల వ్యవధిలోనే వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై పటమట సీఐ మోహనరెడ్డి గురువారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరుకు చెందిన ముగ్గురు బాలికలు స్థానికంగా ఉన్న హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ప్రతిరోజూ మాదిరే బుధవారం ఉదయం 9.30 గంటల సమయంలో పాఠశాలకని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చారు. సాయంత్రం అయినా బాలికలు ఇంటికి రాకపోయేసరికి కంగారుపడిన వారి తల్లిదండ్రులు పటమట పోలీసులను ఆశ్రయించారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు శాంతిభద్రతల నిమిత్తం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సహాయంతో రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. రైల్వే స్టేషన్ సీసీ టీవీ ఫుటేజ్‌ను కూడా పరిశీలించాక బాలికలు విశాఖపట్నం వెళ్లే ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కినట్లు గుర్తించిన పోలీసులు అక్కడ పోలీసులను అప్రమత్తం చేశారు. విశాఖ చేరుకున్న ముగ్గురు బాలికలను అక్కడి పోలీసులు విచారించి పటమట పోలీసులకు అప్పగించారు. విశాఖపట్నం ఎందుకు వెళ్లారనే విషయంపై విచారణ చేస్తున్నట్లు సీఐ మోహన్ రెడ్డి తెలిపారు.

పేదల అభ్యున్నతికి సీఎం జగన్ తపన

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్


సభలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, వేదికపై ఎంపీ కేశినేని నాని తదితరులు

రెడ్డిగూడెం: పేదల అభ్యున్నతికి నిరంతరం పరితపిస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. మంత్రి జోగి రమేష్ విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శ్రీనివాస్(నాని)తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు పూర్తిగా రుణమాఫీ చేసి అక్కచెల్లెమ్మల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రెడ్డిగూడెం మండలంలో 12,447 మంది డ్వాక్రా మహిళలకు నాల్గో విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.8.74కోట్లు అక్కచెల్లెమ్మల అకౌంట్లలోకి జమ చేశారన్నారు. విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శ్రీనివాస్(నాని) మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పచ్చి మోసగాడని, ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావటానికి ప్రయత్నిస్తున్నాడని అన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రజల పక్షాన నిలిచిన రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్ మోహన్‌రెడ్డికి మరో అవకాశం కల్పించాలని కోరారు. మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన అతి సామాన్యుడు అయిన సర్నాల తిరుపతి రావును సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేశారని, అతనిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త సర్నాల తిరుపతిరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, మైలవరం మార్కెట్‌యార్డు చైర్మన్ ఆప్పిడి సత్యనారాయణరెడ్డి, రెడ్డిగూడెం జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి కె.శ్రీనివాసరావు, రెడ్డిగూడెం సర్పంచ్ మల్లాది రాణి, వైస్ ఎంపీపీలు చాట్ల రాబర్టు, పాటిబండ్ల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు, మండల సచివాలయాల కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, రెడ్డిగూడెం మండల వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ బత్తుల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ వర ప్రసాద్‌రెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు వి.సత్యనారాయణరెడ్డి, మండల సమైఖ్య అధ్యక్షురాలు గుంటక వెంకట్రావమ్మ, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో క్యాన్సర్ పెరగడం ఆందోళనకరం

- పిల్లలకు సోకే క్యాన్సర్ కేసులపై అవగాహన అవసరం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు


పిల్లల్లో క్యాన్సర్‌పై అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, పక్కన డాక్టర్ వీణా అక్కినేని

లబ్బీపేట(విజయవాడతూర్పు): పిల్లల్లో క్యాన్సర్ కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఇంటర్నేషనల్ చైల్డ్ హుడ్ క్యాన్సర్‌డే గురువారం రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మహాత్మాగాంధీ రోడ్డులోని ఫ్యార్‌చ్యూన్ మురళీపార్క్‌లో జరిగిన ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ పిల్లల్లో క్యాన్సర్‌పై మరిన్ని పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. పెద్దవారిలో క్యాన్సర్‌కు ధూమపానం, జన్యుపరమైన సమస్యలు కారణమని, పిల్లల్లో ఎలాంటి అలవాట్లు లేకున్నా క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే అత్యాధునిక వైద్య సదుపాయాలు, ఉపయుక్తమైన మందులు అందుబాటులోకి వస్తున్నందున క్యాన్సర్‌ను చూసి భయపడాల్సిన అవసరం లేదన్నారు. క్యాన్సర్ నివారణ మందుల ధరలు కూడా బాగా తగ్గి పేదవారికి కూడా అందుబాటులోకి వచ్చాయన్నారు. క్యాన్సర్ కారక మరణాలు క్రమంగా తగ్గుతున్నాయన్నారు. బాలల్లో క్యాన్సర్ లక్షణాలను గుర్తించేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రెయిన్‌బోలో క్యాన్సర్ వార్డులు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో రెయిన్‌బో విజయవాడ యూనిట్ హెడ్ గుణశేఖర్ చౌదరి, పిడియాట్రిక్ హెమటో ఆంకాలజిస్టు డాక్టర్ వీణా అక్కినేని, నియోనాటాలజిస్ట్ డాక్టర్ బీఎస్‌సీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతున్న పల్లకీలు


రజకులు సిద్ధం చేస్తున్న పల్లకీలు

పెనుగంచిప్రోలు: రంగుల మహోత్సవం ముగించుకొని శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారుతో పాటు సహ దేవతల విగ్రహాలను ఫిబ్రవరి 18 న తిరుగు ప్రయాణంలో తీసుకు వచ్చేందుకు రజకులు పల్లకీలు సిద్ధం చేస్తున్నారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం రంగుల మహోత్సవంలో భాగంగా జగ్గయ్యపేటకు విగ్రహాలు వెళ్లేటప్పుడు రజకులు విగ్రహాలను నెత్తిపై పెట్టుకొని గ్రామంలో ఊరేగింపుగా పెనుగంచిప్రోలు రంగుల మండపం వద్దకు చేర్చుతారు. అక్కడి నుంచి ఎడ్లబండ్లపై జగ్గయ్యపేటకు విగ్రహాలు చేర్చుతారు. తిరుగు ప్రయాణంలో జగ్గయ్యపేట నుంచి విగ్రహాలను తీసుకు వచ్చేటప్పుడు పెనుగంచిప్రోలు నుంచి 5, అనిగండ్లపాడు, ముండ్లపాడు, సుబ్బాయిగూడెం గ్రామాల నుంచి ఒక్కొక్కటి చొప్పున మొత్తం 8 పల్లకీల్లో మొత్తం 11 విగ్రహాలను మోసుకుంటూ పెనుగంచిప్రోలు రంగుల మండపం వద్దకు చేర్చటం వందల సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోంది. మొదటి పల్లకీ శ్రీతిరుపతమ్మ అమ్మవారు(పెనుగంచిప్రోలు రజకులు)రెండవ పల్లకీ శ్రీగోపయ్య స్వామివారు(సుబ్బాయిగూడెం రజకులు) మూడవ పల్లకీ ఉన్న ఊరు అంకమ్మ అమ్మవారు, నాల్గవ పల్లకీ వినుకొండ అంకమ్మ అమ్మవారు(పెనుగంచిప్రోలు రజకులు), ఐదవ పల్లకీ శ్రీతిరుపతమ్మ, గోపయ్య స్వామి ఉత్సవ మూర్తులు(ముండ్లపాడు రజకులు)ఆరవ పల్లకీ శ్రీచంద్రమ్మ అమ్మవారు, మల్లయ్య స్వామి(అనిగండ్లపాడు రజకులు), ఏడవ పల్లకీ మద్దిరావమ్మ అమ్మవారు (పెనుగంచిప్రోలు రజకులు), ఎనిమిదవ పల్లకీ శ్రీపెద్దమ్మ అమ్మవారు, గుర్రపు వాహనం(పెనుగంచిప్రోలు రజకులు) పల్లకీల్లో జగ్గయ్యపేటలో ఫిబ్రవరి18 న బయలుదేరి చిల్లకల్లు, భీమవరం, లింగగూడెం మీదుగా ఫిబ్రవరి 19 రాత్రికి పెనుగంచిప్రోలు రంగుల మండపం చేరతాయి. ఫిబ్రవరి 20 న తెల్లవారు జామున ఆలయానికి విగ్రహాలు చేరుకుంటాయి. పల్లకీలను రజకులు ఒక్కొక్క దానికి దాదాపు రూ.10 నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేసి అందంగా అలంకరిస్తున్నారు. పల్లకీలు మొత్తం ఫిబ్రవరి 17 రాత్రి కల్లా జగ్గయ్యపేటకు చేరుతాయని రజకులు చెబుతున్నారు. మొత్తం మీద అమ్మవారు తమకు ఈ అదృష్టం కలిగించినందుకు ఎంతో సంతోషంగా ఉందని వారంటున్నారు.

రెండో రోజు మండప పూజలు, విశేష హోమాలు


హోమాలను నిర్వహిస్తున్న అర్చకులు, వేద విద్యార్థులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ పునఃనిర్మాణాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న నూతన ధ్వజ స్తంభ సహిత స్వర్ణ శిఖర, కుంభాభిషేక మహోత్సవాలు గురువారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. గురువారం ఉదయం స్వామి వారి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ఆలయ అర్చకులు పలు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత గణపతి పూజ, కర్మణ పుణ్యాహవాచనం, మంటప పూజలు, మంటప దేవతా హోమాలను ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఉప ప్రధాన అర్చకుడు కోట ప్రసాద్ నిర్వహించారు. పండితుల వేద పఠనం, ఆలయ అర్చకులు నిర్వహిస్తున్న పూజాది కార్యక్రమాలతో మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం యాగశాలలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేద పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు యాగశాలకు విచ్చేసి వేద పఠనం చేశారు. అనంతరం యంత్ర పూజ, కుంభాభిషేకం నిమిత్తం మూడు సముద్రాలు, జీవనదులు, తీర్థాల నుంచి తీసుకువచ్చిన జలాలకు పూజాది కార్యక్రమాలను నిర్వహించారు.

ఎన్నికల యాప్‌ల నిర్వహణకు నోడల్ అధికారులు


చిలకలపూడి(మచిలీపట్నం): సాధారణ ఎన్నికలకు సంబంధించి ఐటీ యాప్స్ నిర్వహణకు కలెక్టర్ పి.రాజాబాబు గురువారం నోడల్ అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, ప్రలోభాల నియంత్రణకు 'ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' యాప్ నిర్వహణకు ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు, ఓటర్ల జాబితా నిర్వహణకు సంబంధించి రిజిస్ట్రేషన్, జాబితాలో ముద్రణ 'ఏరోనెట్' యాప్ నోడల్ అధికారిగా డీఆర్వో చంద్రశేఖరరావును నియమించారు. అభ్యర్థుల నామినేషన్లు, అఫిడవిట్లు పరిశీలన, ఉపసంహరణ బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాలు తదితర అంశాలపై 'ఎన్‌కోర్', రాజకీయ పార్టీల అభ్యర్థులు, వివిధ రకాల అనుమతులకు 'సువిధ' యాప్ నిర్వహణకు నోడల్ అధికారిగా సాంఘిక సంక్షేమశాఖ డీడీ షేక్ షాహెద్‌బాబును నియమించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదుల పరిష్కారానికి 'సి-విజిల్' యాప్ నిర్వహణకు వయోజన విద్య సహాయ సంచాలకుడు ఎండీ హాజీబేగ్, దివ్యాంగ ఓటర్ల సౌకర్యాల కల్పనకు 'సక్షం' యాప్ నిర్వహణకు నోడల్ అధికారిగా దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ వి.కామరాజును నియమించారు. సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్లు అప్‌లోడింగ్, ట్రాన్స్‌మిషన్ కోసం 'ఈటీపీబీఎస్' యాప్, సర్వీస్ పోర్టల్ నిర్వహణకు నోడల్ అధికారిగా సమగ్ర శిక్ష ఏపీసీ కె.రాములునాయక్, ఈవీఎం మేనేజ్‌మెంట్ సిస్టమ్ నిర్వహణకు మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, సిటిజన్ గ్రీవెన్స్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ నిర్వహణకు తూనికలు, కొలతలు శాఖ సహాయ నియంత్రణ అధికారి రాజేంద్ర, బీఎల్‌వో యాప్ నిర్వహణకు బందరు ఆర్డీవో ఎం.వాణిలను నోడల్ అధికారులుగా కలెక్టర్ నియమించారు.

రైలు కింద పడి యువకుడు దుర్మరణం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై విజయవాడ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో రైల్వే యార్డ్ ట్రిప్ షెడ్ సమీపంలోని రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడు మృతిచెంది ఉండటాన్ని గుర్తించిన కీమెన్ రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుని వయస్సు సుమారు 30-35 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఇతర ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. మృతదేహం నడుం పైభాగంలో రెండుగా తెగిపోయి ఉండటాన్ని బట్టి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు విజయవాడ జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని ఒక దుకాణం ఎదుట గుర్తు తెలియని మృతదేహం కనిపించింది. వివరాల్లోకి వెళితే పాతబస్తీ శేషయ్యవీధిలో గుంటూరుజిల్లాకు చెందిన జనార్దన్‌రావు జటాయి పంబ్లింగ్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. తన దుకాణం ఎదుట ఒక గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడి వద్ద ఉన్న ఆధార్ కార్డులో పోతుల శంకర్, ప్రసాదంపాడుగా ఉంది. అయితే అక్కడ విచారిస్తే అటువంటి వ్యక్తులు ఎవరూ లేరని స్థానికులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 55 నుంచి 60 సంవత్సరాలు ఉంటుందని, కాషాయం రంగు లుంగీ, షర్ట్ ధరించి ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నమ్మించి తీసుకువెళ్లి మిత్రునిపై బ్లేడ్‌తో దాడి

- గుల్లలమోదలో అర్ధరాత్రి వేళ ఘటన
- అవనిగడ్డ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

నాగాయలంక: మండలంలోని గుల్లలమోద గ్రామం పడవల రేవు వద్ద ఒక వ్యక్తిని నమ్మించి అతని మిత్రుడే అర్ధరాత్రి బ్లేడ్‌తో తీవ్రంగా గాయపర్చిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు నాగాయలంక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం గురువారం రాత్రి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం గుల్లలమోద గ్రామస్తుడు జగన్మోహన్‌రావు, బాపట్ల జిల్లా నిజాంపట్నం గ్రామానికి చెందిన మోపిదేవి వీర్రాజు స్నేహితులు. గత ఐదేళ్లుగా ఇరువురూ నిజాంపట్నంలోనే నివశిస్తున్నారు. వీర్రాజు బంధువుల అమ్మాయి విషయంలో వీరిద్దరి మధ్య గొడవలు తలెత్తగా జగన్మోహన్‌రావును వీర్రాజు గట్టిగా మందలించాడు. అయితే తర్వాత మామూలుగా కలిసే తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో గుల్లలమోదలో పని ఉందని చెప్పి ఈనెల 14వ తేదీన జగన్మోహన్‌రావు వీర్రాజును తీసుకుని ఆ గ్రామానికి వెళ్లారు. అక్కడ మద్యం తాగి అదే రోజు రాత్రి గ్రామం సమీపంలోని పడవల రేవు వద్ద పడుకున్నారు. కానీ పాత గొడవ మనసులో పెట్టుకున్న జగన్మోహనరావు తనతో తెచ్చుకున్న బ్లేడ్‌తో నిద్రలో ఉన్న వీర్రాజుపై అర్ధరాత్రి రెండు గంటల సమయంలో దాడి చేసి మెడ, చెంప, చేతుల మీద తీవ్రంగా గాయపర్చాడు. రక్తగాయాలతో వీర్రాజు అక్కడే పడిపోగా జగన్మోహనరావు పారిపోయాడు. వీర్రాజు నిదానంగా లేచి తెల్లవారుజామున గ్రామంలో డిక్కీ హోటల్ దగ్గరకు వచ్చి జరిగిన విషయం గ్రామస్తులకు చెప్పాడు. వారు 108 వాహనం పిలిపించి వీర్రాజును అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఆసుపత్రి వర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పటమట(విజయవాడతూర్పు): బందరుకాల్వలో గుర్తు తెలియని మృతదేహాన్ని పటమట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పటమట రామలింగేశ్వరనగర్ పరిధిలో బందరుకాల్వలో ఈ నెల 13వ తేదీన గుర్తు తెలియని మృతదేహం కొట్టుకు వచ్చినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. చనిపోయింది సుమారు 50 ఏళ్ల మహిళ అని, దేహం కుళ్లిపోయి ఉండటంతో గుర్తించలేనంతగా ఉందని, శరీరంపై నీలంరంగు జాకెట్, నీలంరంగు బ్రా, నీలంరంగు నీలంరంగు లంగా మాత్రమే ఉందని, చనిపోయి కూడా సుమారు 15 రోజులు అయి ఉండవచ్చని తెలిపారు. వివరాలకు పటమట స్టేషన్ 91548 80304, 90413 65933, 94406 27036 నంబర్లో సంప్రదించవచ్చని సెక్టార్ ఎస్ఐ శాతకర్ణి తెలిపారు.

గంజాయి కేసులో ఆరుగురు అరెస్టు

పెనమలూరు: గంజాయి కేసులో ఆరుగురు వ్యక్తులను పెనమలూరు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం గంజాయి కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేయటానికి జిల్లా ఎస్పీ నయీంఅస్మి ఆదేశాల మేరకు డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లు వేశామన్నారు. దీంతో గన్నవరం రామ్‌నగర్‌కు చెందిన మానికొండ దినేష్, గన్నవరం కోతపేటకు చెందిన చిన్నం వెంకటనాగరాజు, గండికోట శామ్యూల్‌రాజు, తోట్లవల్లూరు మండలం యాకమూరుకు చెందిన కలంగి ఆదర్ష్, తేలప్రోలుకు చెందిన చిలకంటి కిషోర్, కంకిపాడు పులిరామారావు బజార్‌కు చెందిన చిట్టూరి అజయ్‌కుమార్‌లను అరెస్టు చేశామని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్టు తెలిపారు.

ఐపీఎస్ అధికారి ఇంట్లో చోరీ

పెనమలూరు: కానూరులో ఐపీఎస్ అధికారి ఇంట్లో చోరీ జరిగింది. కానూరు 100 అడుగుల రోడ్డులోని అపార్టుమెంట్‌లో ఉంటున్న సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ హర్షవర్ధన్ ఇంట్లో రూ.5 లక్షలు సొమ్ము చోరీ జరిగిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఆయన రెండు రోజుల క్రితం ఇంట్లో అల్మారాలో సొమ్ము ఉంచారు. అయితే బుధవారం వాటి కోసం చూడగా కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఐపీఎస్ అధికారి ఇంట్లో ఇద్దరు పని చేస్తున్నారు. అందులో ఒక వ్యక్తి తాడిగడప శ్రీనివాసానగర్ కాలువ కట్టపై ఉంటూ వాచ్‌మన్ పని బయట చేస్తూ ఐపీఎస్ అధికారి ఇంట్లో కూడా పని చేస్తున్నాడు. పోలీసుల విచారణలో అతనే సొమ్ము చోరీ చేసినట్లు అంగీకరించినట్లు సమాచారం.

క్లుప్తంగా

సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): సైబర్ క్రైమ్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ నిపుణుడు గౌరీ శంకర్ అన్నారు. నలంద డిగ్రీ కళాశాలలో యూత్ సర్వీసెస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం డ్రగ్ అబ్యూస్, సైబర్ క్రైమ్ అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరీశంకర్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ అంటే ఏమిటి, మనం ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకున్నప్పుడు 1930 నంబర్‌కి కాల్ చేయడం, ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి సోషల్ మీడియా మాధ్యమానికి రెండు వెరిఫికేషన్ కోడ్‌లు పెట్టుకోవాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రిలోని డి అడిక్షన్ సెంటర్ ఆఫీసర్ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ యువత డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి వై. శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా అమలు చేస్తున్న నవరత్నాల్లో భాగంగా కుల, మత వర్గ రాజకీయాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వై. సిద్ధార్థ అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 9వ డివిజన్‌లో గడప గడపకు 'మీ అవినాష్ అన్న హామీ' కార్యక్రమంలో భాగంగా గురువారం దేవినేని అవినాష్ కుటుంబ సభ్యులు వై.సిద్ధార్థ పడటమటలంక మెయిన్ రోడ్, జాస్తి వారి వీధి, గరికిపాటి వారి వీధి తదితర ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. గడప గడపకి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. వైఎస్సార్ సీపీ 9వ డివిజన్ ఇన్‌చార్జ్ వల్లూరి ఈశ్వర ప్రసాద్ వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాజు, గద్దె కల్యాణ్, కాళీ, కన్నబాబు, నాగరాజు, పోతురాజు, సుబ్బు పాల్గొన్నారు.

యూత్‌ను ఆకట్టుకునే 'సిద్ధార్థ రాయ్'



లబ్బీపేట(విజయవాడతూర్పు): అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా సిద్ధార్థ రాయ్ చిత్రం ఉంటుందని ఆ చిత్ర హీరో దీపక్ సరోజ్ అన్నారు. ఈ నెల 23న విడుదల కానున్న సినిమా ప్రమోషన్‌లో భాగంగా గురువారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా బెంజిసర్కిల్ సమీపంలోని జేడీ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో దీపక్ సరోజ్ మాట్లాడుతూ సిద్ధార్థ రాయ్ చిత్రాన్ని దర్శకుడు యశస్వీ అద్భుతంగా తీశారన్నారు. అర్జున్ రెడ్డి తరహాలో ఈ చిత్రం ఉండబోతుందన్నారు. అనంతరం హీరోయిన్స్ తన్వినేగి, కల్యాణి మాట్లాడుతూ అర్జున్ రెడ్డి చిత్రానికి సంగీతం అందించిన రతన్ సిద్ధార్థ రాయ్ చిత్రానికి సంగీతం అందించారని తెలిపారు. ప్రతి సీన్ ఒక ఎమోషన్‌గా సాగుతుందని ప్రేక్షకులు ఈ చిత్రాన్ని థియేటర్లో వీక్షించి ఆదరించాలని కోరారు.

29న వారాహి సహిత శత చండీ కదళీ యాగం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తాడిగడప వంద అడుగుల రోడ్డులోని అనుమోలు గార్డెన్స్ నందు ఈ నెల 29న వారాహి సహిత శత చండీ కదళీ యాగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దూళిపూడి సరోజ రమేష్ తెలిపారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో యాగం బ్రోచర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 28న అమ్మవారి శోభయాత్ర, 29న వారాహి హోమం, మార్చి ఒకటిన చండీ హోమం, 2న కదళీ హోమం, లక్ష తమలపాకులు, లక్ష అరటిపండ్లతో పూర్ణాహుతి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాలలో అతిథులుగా మహిమాన్విత పీఠాధిపతులు వాసు స్వామి, మహా రుద్ర స్వామి, శివ స్వామి, యోగానంద భారతి స్వామి పాల్గొంటారని తెలిపారు.

మన బడి మారింది!

- నకల హంగులతో వీఎంసీ ప్రాథమిక పాఠశాల
- 'నాడు–నేడు'తో మారిన రూపురేఖలు
- పెరిగిన విద్యార్థుల సంఖ్య

గుణదల(విజయవాడ తూర్పు): ఒకప్పుడు పాడుపడిన భవనంలా ఉండే పాఠశాల సరస్వతీ నిలయంగా మారింది. సకల వసతులతో సరికొత్తగా ముస్తాబైంది. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా నిలబడింది. గుణదలలోని దాసరి గిరిధర్ కుమార్ అవంతి నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ఉన్నత విద్యా ప్రమాణాలతో పనిచేస్తోంది. పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో విద్యనందించే దిశగా పాఠశాల సిబ్బంది కృషి చేస్తున్నారు.

అభివృద్ధి ఇలా..

సుమారు రెండు దశాబ్దాల క్రితం గుణదల ఈఎస్‌ఐ ఆస్పత్రి సమీపంలో వీఎంసీ పాఠశాల నిర్మించింది. స్థానికంగా ఉండే పేద విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకునే వారు. అప్పటికీ మరుగుదొడ్లు కానీ, ఆట వస్తువులుగానీ ఉండేవి కావు. కనీసం మంచి నీటి వసతి సైతం ఉండేది కాదు. దాదాపు 10 సంవత్సరాల పాటు ఈ పాఠశాల సాధారణ స్థితిలోనే కొనసాగింది. 2011లో దాసరి నారాయణ శాస్త్రి పాఠశాల అభివృద్ధి నిమిత్తం 5 లక్షల రూపాయలు విరాళం ఇచ్చారు. దీనికి తోడు నగర పాలక సంస్థ నిధులతో కలిపి మొత్తం రూ.11 లక్షలతో ఈ పాఠశాల మొదటి అంతస్తు నిర్మించింది. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పాఠశాల రూపు రేఖలే మారిపోయాయి. తరగతి గదులు, బెంచీలు, మరుగదొడ్లు, ఆట వస్తువులు ఇలా సకల వసతులు సమకూరాయి.



తరగతి గదిలో కొత్త బెంచీలు, గోడలపై చిత్రాల మధ్య చిన్నారులకు పాఠాల బోధన

ప్రభుత్వ చొరవతోనే..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలు పరుస్తున్న విద్యా విధానంలో భాగంగా ఈ ప్రభుత్వ పాఠశాల విశేషంగా అభివృద్ధి సాధించింది. నాడు–నేడులో భాగంగా ఈ స్కూల్‌కి రూ. 60లక్షల అంచనాలతో పనులు ప్రారంభించారు. మొదటి విడతగా రూ. 20లక్షలు మంజూరు కాగా.. వాటితో విద్యార్థులందరూ కూర్చునేందుకు 75 బెంచీలు ఏర్పాటు చేశారు. చిన్నారి విద్యార్థులను ఆకట్టుకునేలా తరగతి గదుల గొడలపై వివిధ రకాల బొమ్మలు, పాఠాలను పేయింటింగ్ వేయించారు. పాఠశాల ఆవరణలో పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. గతంలో శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్ల ప్రదేశంలో నూతన దొడ్లు నిర్మిస్తున్నారు. పైన మరో అంతస్తు సైతం నిర్మాణంలో ఉంది.

పథకాల అమలు సంతృప్తికరం..

ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థులకు యూనిఫామ్, బ్యాగులు, పుస్తకాలు, షూలు సక్రమంగా అందుతున్నాయి. దీనికి తోడు ప్రతిరోజు పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం పిల్లలు ఇష్టంగా తింటున్నారు. మెనూ ప్రకారం, వండి వడ్డిస్తున్న ఈ ఆహార పదార్థాలు విద్యార్థులకు సంతృప్తికరంగా ఉన్నాయి.

పెరిగిన విద్యార్థుల సంఖ్య..

గతంలో ఈ పాఠశాలలో కేవలం 40 నుంచి 50 మంది పిల్లలు మాత్రమే ఉండే వారు. సకల వసతులతో నాణ్యతగల విద్యా ప్రమాణాలతో ఈ పాఠశాల అభివృద్ధి చెందడంతో ప్రస్తుతం 195 మంది విద్యార్థులు చేరారు. గతేడాది నుంచే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.



పాఠశాల భవనంపై నిర్మాణంలో ఉన్న అదనపు అంతస్తు



ప్లేయింగ్ టైంలో ఆడుకుంటున్న విద్యార్థులు

ఉన్నత ప్రమాణాలతో బోధన..

గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి చాలా మెరుగ్గా ఉంది. ప్రభుత్వ చొరవతో ఈ పాఠశాల అభివృద్ధి సాధించింది. ప్రస్తుతం ఈ పాఠశాలలో విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన జరుగుతోంది. విద్యార్థులకు మంచి భవిష్యత్ ఇచ్చే దిశగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధి విధానాలు ఆమోద యోగ్యంగా ఉన్నాయి.

– సీహెచ్ ప్రశాంతి, ప్రధానోపాధ్యాయురాలు

ఎంపీ కేశినేని నానీని కలిసిన జోగి నాయుడు



విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్ క్రియేటివ్ హెడ్, సినీ నటుడు ఎల్.జోగినాయుడు విజయవాడ ఎంపీ కేశినేని నానిని కేశినేని భవన్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కను అందజేశారు. అదే సమయంలో కంచికచర్ల, తిరువూరు, ఇబ్రహీంపట్నం ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో మాట్లాడారు.

విదేశీ విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన

గుణదల (విజయవాడ తూర్పు): ఇతర దేశాలలో ఉన్న విద్య, ఉద్యోగ అవకాశాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు పరిశీలనాత్మకంగా గమనిస్తుండాలని అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ రిక్రూట్‌మెంట్ మేనేజర్ సైలా బాల హేంబ్రామ్ అన్నారు. ఆంధ్ర లయోల ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో విదేశీ విద్య ఉద్యోగాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జోజిరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, ప్రిన్సిపాల్ ఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల భవనం సిద్ధం

- 18వ డివిజన్‌లో ముస్తాబైన కమ్యూనిటీ హాలు
- రూ.1.20కోట్లతో సకల హంగులు
- నేడు ప్రారంభించనున్న మేయర్ భాగ్యలక్ష్మి, దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోట, 18వ డివిజన్ ప్రజల చిరకాల వాంఛ అయిన కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. శుక్రవారం ఉదయం నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చేతుల మీదుగా కమ్యూనిటీ హాల్‌ను లాంఛనంగా ప్రారంభించనున్నారు.

అవస్థలకు చెక్..

పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా నివసించే రాణిగారితోట ప్రాంతంలో శుభకార్యాలు చేసుకునేందుకు కల్యాణ మండపాలు లేక స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్‌లో లక్షలాది రూపాయలు వెచ్చించి శుభకార్యాలు చేసుకోలేక ఇళ్ల ముందు ఇరుకు రోడ్లపైనే కొనసాగిస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా గత ప్రభుత్వం హయాంలో ఆర్‌సీఎం స్కూల్ పక్కనే ఉన్న మల్లెల తిరుపతమ్మ కూరగాయల మార్కెట్‌ను తొలగించి ఆ ప్రదేశంలో రెండంతస్తుల కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాన్ని ప్రారంభించి వదిలేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నగర అభివృద్ధిలో భాగంగా అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులపై దృష్టి సారించింది. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చొరవతో వీఎంసీ నుంచి నిధులు మంజూరు చేయించారు. దీంతో గ్రౌండ్‌ఫ్లోర్‌లో మిగిలిపోయిన పనులకు, మొదటి అంతస్తు నిర్మాణ పనులకు రూ.90లక్షలు.. ప్రహరీ, టాయిలెట్స్, పార్కింగ్ టైల్స్ నిర్మాణానికి రూ.30 లక్షలు నిధులు వచ్చాయి. కమ్యూనిటీ హాల్ భవనంలో గ్రౌండ్‌ఫ్లోర్ భోజనాలు ఏర్పాటుకు, మొదటి అంతస్తు శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా పెద్ద హాల్, భవనం చుట్టూ వాహనాల పార్కింగ్ సదుపాయం, వధూవరులకు వేర్వేరుగా రెండు రూమ్‌లు ఏర్పాటు చేశారు. స్థానిక కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ ఈ నిర్మాణంపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయడంలో కృషి చేశారు.



రాణిగారితోటలో ప్రారంభానికి సిద్ధమైన కమ్యూనిటీ హాల్ భవనం



శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా నిర్మించిన పెద్ద హాల్

అందరికీ అందుబాటులో..



రాణిగారితోటలో సామాన్య, మధ్యతరగతి, పేదలు ఎక్కువగా నివసిస్తుంటారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా హాల్ అద్దె నిర్ణయిస్తాం. అన్ని సదుపాయాలు, హంగులతో అత్యాధునికంగా కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేశాం. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించాం. డివిజన్ ప్రజల చిరకాల కోరిక నేరవేర్చినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికే డివిజన్‌లో రూ.10కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేశాం.

– వెంకట సత్యనారాయణ, 18వ డివిజన్ కార్పొరేటర్

సాంకేతిక రంగంపై అవగాహన అవసరం

గుణదల (విజయవాడ తూర్పు): ఆధునిక సాంకేతిక ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని చెన్నైలోని బోద్ బ్రిడ్జి సంస్థ సీఈఓ కొండవీటి బాలరాజు అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో టెక్నికల్ ఫెస్ట్ సైన్టియా – 2024 కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత సాంకేతికలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని తెలిపారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం ఇలా అన్ని రంగాలలో సాంకేతికత సరికొత్త విధానాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు సాంకేతిక పరమైన కరెంట్ అఫైర్స్‌పై దృష్టి సారించి ఆలోచనలకు పదును పెట్టాలని కోరారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, కోడింగ్, డీబగ్గింగ్, మిస్టర్ సైన్టియా, మిస్ సైన్టియా, వంటి అంశాలలో పోటీలు నిర్వహించారు.



పోటీలలో గెలుపొందిన విద్యార్థులతో లయోల అధ్యాపకులు

గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్ కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అపర్ణ, అధ్యాపకులు ఫాదర్ రాయప్ప, సహాయభాస్కరన్ పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రయాణం సురక్షితం

పటమట(విజయవాడతూర్పు): మోటారు ద్విచక్ర వాహనాలు నడిపే వ్యక్తులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ డీసీపీ కె. చక్రవర్తి సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో హెల్మెట్ ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారే మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్ ధరించక పోవడమే దీనికి ప్రధాన కారణమన్నారు. ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి క్షేమంగా తిరిగి వస్తాడన్న నమ్మకం లేదన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోతే ఆ కుటుంబం పడే ఇబ్బందులను వివరించారు. రోడ్డు ప్రమాదాలు ఒక్కరినే బలిగొనవని, మొత్తం కుటుంబాన్నే విచ్ఛిన్నం చేస్తాయన్నారు. అనంతరం సురక్షిత ప్రయాణం–ప్రమాద రహితం, హెల్మెట్ ధరించండి – రక్షణ పొందండి, తల మీదే – రక్షణ మీదే అనే నినాదాలతో భారతీనగర్, ఆయుష్ ఆసుపత్రి రోడ్డు, మహానాడు రోడ్డులలో ర్యాలీ చేశారు. ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్, ఏసీపీ జనార్దన్ పాల్గొన్నారు.



హెల్మెట్‌పై అవగాహన కల్పించేందుకు ర్యాలీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

శృతిలయ సమ్మేళనం.. వీణా వాద్య సమ్మోహనం

విజయవాడ కల్చరల్: సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో గురువారం నిర్వహించిన అఖండ వీణా సంగీత సమ్మేళనం శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు త్యాగరాజ స్వామి రచించిన కృతులను వీణపై పలికించారు. కార్యక్రమంలో వీణా విద్వాంసులు కేఎస్ గోవిందరాజన్, అయ్యగారి సత్యప్రసాద్, చిట్టా కార్తీక్, కొండా శశిధర్, శిష్టు గౌరీ శంకర శాస్త్రి, ఈమని మహతి, చింతలపాటి ప్రజవి, రావూరి గాయత్రి, లక్ష్మీ వైష్ణవి పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమై నిర్విరామంగా 12 గంటల సేపు సాగింది. కార్యక్రమాలను డాక్టర్ వై. రాఘవేంద్రరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతానికి పూర్వవైభవం తీసుకురావాలని అందుకు కృషి చేస్తున్న సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి వారి కృషిని అభినందించారు. సంస్థ కార్యదర్శి సీవీరావ్ సంస్థ లక్ష్యాలను వివరించారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ నిర్వహించారు.



త్యాగరాజ స్వామి పంచరత్న కృతులను వీణపై పలికిస్తున్న సంగీత విద్వాంసులు

అమరావతి దేవతల రాజధాని

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు

సాక్షి, అమరావతి: అమరావతి దేవతల రాజధాని అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. అలాంటి దానిని ముక్కోటి దేవతలు కూడా వైఎస్ జగన్ నుంచి రక్షించలేకపోయారని విమర్శించారు. టీడీపీ అనుకూల జర్నలిస్టు ఒకరు విధ్వంసం పేరుతో రాసిన పుస్తకాన్ని చంద్రబాబు.. పవన్ కళ్యాణ్‌తో కలిసి విజయవాడలోని ఒక ఫంక్షన్ హాల్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఐదేళ్లుగా మూడు రాజధానుల జపం చేసిన ఇప్పుడు నాలుగో రాజధాని అని అంటున్నారని తెలిపారు. తన మనస్సులో ఉన్న విషయాలను ఈ పుస్తకంలో రాశారని చంద్రబాబు అన్నారు. రాజధానిలో తాను అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి ఖాళీ చేయించాలని చూశారని విమర్శించారు. తమను కనీసం సభలు పెట్టుకోవడానికి అనుమతించడం లేదని, పర్చూరులో తన సభకు ఆటంకాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ హెలికాప్టర్ దిగేందుకు అనుమతి ఇవ్వలేదని తెలిపారు. సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ తాను వలంటీర్లకు వ్యతిరేకంగా మాట్లాడలేదని చెప్పారు. వారికి భవిష్యత్తులో అండగా నిలుస్తామన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వనన్నారు. వైవెస్సార్ సీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేసేందుకు ప్రతిపక్షాలన్నీ కలిసి రావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమటలోని పలు ప్రాంతాల్లో కరెంట్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈఓ పి. హరిబాబు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 9 నుంచి 11 గంట వరకు మెగాటౌన్‌షిప్, ఎలక్ట్రిసిటీ కాలనీ, 11 నుంచి 1 గంట వరకు లక్ష్మీపతినగర్, డొంకరోడ్డు, జేడీ నగర్, రామాయణపువారి వీధి, మరలా సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు ఫరూఖ్‌నగర్, పండరీపురం, తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

- మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు ప్రకటనలో తెలిపారు. వరలక్ష్మీనగర్, ఎల్ఐసీ కాలనీ, జయప్రకాష్ నగర్‌లోని మొదటి, రెండు, మూడు అంతర్గత రహదారుల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

నేత్రాల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నేత్రాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి పి. లక్ష్మణస్వామి అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హజరైన లక్ష్మణస్వామి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నేత్రాలను నిర్లక్ష్యం చేస్తే చాలా మూల్యాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. సరైన ఆహారపు అలవాట్లు, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. విజయవాడ విన్ విజన్ ఐ హాస్పిటల్స్ డాక్టర్ నిశాంత్ జనార్దన్ రాజ్ మాట్లాడుతూ నేత్రాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నేత్ర పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

వైద్య సేవలను వినియోగించుకోవాలి

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.రాజా తెలిపారు. గురువారం ప్రకాష్‌నగర్లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ నందు జగనన్న ఆరోగ్య సురక్ష 2 ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ కార్డు వున్న ప్రతి కుటుంబానికి 25లక్షల రూపాయల వరకు ఉచితంగా వైద్యసేవలను అందిస్తోందన్నారు. వైద్యశిబిరాల్లో ప్రముఖ వైద్యులు పాల్గొని వైద్యసేవలను అందిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ నుంచి గైనిక్, జనరల్ మెడిసిన్ వైఎస్సార్ కంటి వెలుగు వైద్యులు పాల్గొని 317 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన



మధురానగర్(విజయవాడ సెంట్రల్): భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్తల కృషి వల్ల మనదేశం ఎన్నో విజయాలు సాధించిందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ రిటైర్డ్ శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో గురువారం రాకెట్లు, భారతీయ అంతరిక్ష పరిశోధనపై అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉపగ్రహాలు, ఉపగ్రహనౌకలు, వాటి తయారీ, పనితీరు, అంతరిక్షరంగంలో భారతీయ శాస్త్రవేత్తల విజయాలను ఆసక్తికరంగా నమూనాలు, పటాల సాయంతో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ విద్యార్థులలో అవగాహన పెంపొందించేందుకు అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేశామన్నారు.

ప్రకటన

నా క్లైంట్ అయిన కృష్ణాజిల్లా, పెనమలూరు గ్రామ వాస్తవ్యులు మలెంపాటి రామ కోటేశ్వరరావు గారి కుమారుడు మలెంపాటి రామశేషు గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి ఎన్.టి.ఆర్ జిల్లా నున్న గ్రామానికి చెందిన గుడిపూడి వెంకట నరసింహాచార్యులు గారి భార్య గుడిపూడి గాయత్రీ దేవి గారికి తన మేనమామగారైన ప్రత్తి వెంకట బ్రహ్మానంద రావు గారి స్వార్జితమై ఉండి ఆయన సంపూర్ణ హక్కులతో అనుభవించుచు 2010వ సంవత్సరంలో సదరు షెడ్యూలు ఆస్తిని పై తెలిపిన గుడిపూడి గాయత్రీ దేవి గారికి తన తదనంతరం సంక్రమింపచేస్తూ ఒక వీలునామా వ్రాయించి, సదరాస్తికి సంబంధించిన యావత్తు దస్తావేజులను గుడిపూడి గాయత్రిదేవి గారికి అందచేసి యుండి 2014 వ సంవత్సరంలో కాలంచేసినారు. సదరు వెంకట బ్రహ్మానంద రావు గారి తదనంతరం వారి యొక్క వీలునామా ప్రకారం దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని గుడిపూడి గాయత్రి దేవి గారు స్వాధీనం చేసుకొని సంపూర్ణ హక్కులతో అనుభవించుచున్నారు. అట్టి పరిస్థితులలో గుడిపూడి గాయత్రీ దేవి గారు తమ అవసరాల నిమిత్తం దిగువ షెడ్యూలు ఆస్తిని అమ్మకమునకు పెట్టగా నా క్లైంటు సదరు ఆస్తిని కొనదలచి కొంత నగదును అడ్వాన్సుగా చెల్లించి విక్రయ ఖరారు అగ్రిమెంట్ పొంది ఉన్నారు. మరియు మిగిలిన క్రయ ధనమును త్వరలో చెల్లించి సక్రమమైన రిజిస్ట్రేషన్ పొందుటకు సిద్ధమవ్వుచున్నారు. సదరు ఆస్తిపై ఎవరికైననూ ఏ విధమైన హక్కులు, బాకీలు, తనఖాలు, క్లెయిములు మరియు దావా తగాయిదాలు ఉన్నచో ఇప్పటినుండి పది రోజులలోపు మాకు స్వయంగా గాని రిజిస్టర్ పోస్ట్ ద్వారా గాని తెలియచేయగలరు. అటు పిమ్మట సదరాస్తిని నిర్వివాదమైనదిగా భావించి సదరు ఆస్తిపై నా క్లైంట్ రిజిస్ట్రేషన్ పొందగలరు అటు పిమ్మట చేసే క్లైములు వగైరాలు నా క్లైంట్ ను బైండ్ చేయజాలవు.

షెడ్యూలు : ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ వారి పరిధిలో చేరిన గుణదల సబ్ రిజిష్ట్రార్ వారి ఖరారా విజయవాడ కార్పొరేషన్ ఏరియాలో చేరిన విజయవాడ, గుణదల గ్రామంలో గల ఆర్.ఎస్. నెం. 197,198/1 దాఖలా ఏ, బి, సి షెడ్యూల్ల దాఖలా ఏక ఖండ ప్రదేశముగా గల య.2.70 ట్లులో చ.గ.259.67 లు గల ప్లాట్ నెం.3 దాఖలా ఆస్తికి హద్దులు. తూర్పు : అ.40.0 వెడల్పు గల రోడ్డు, దక్షిణం : ప్లాట్ నెం. 2 దాఖలా ఆస్తి హద్దు,పడమర : పి.సుబ్బయ్య వగైరాల భూమి, ఉత్తరం : ప్లాటు నెంబర్ 4 దాఖలా ఆస్తి హద్దు.

ఎస్. బాలాజీ, అడ్వకేట్, డోర్ నెం. 26-20-21ఎ, స్వామి వీధి, గాంధీనగరం, విజయవాడ-3. ఫోన్ : 83338 64459

క్లుప్తంగా...

రాజ్యసభ ఎన్నికలకు ఏడు సెట్ల నామినేషన్ల దాఖలు

నేడు పరిశీలన

సాక్షి, అమరావతి: ఏపీ కోటాలోని మూడు రాజ్యసభ స్థానాల ఎన్నికలకు ఏడు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్లకు చివరి రోజు అయిన గురువారం స్వతంత్ర అభ్యర్థిగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన పెమ్మసాని ప్రభాకర్‌నాయుడు ఎమ్మెల్యేల మద్దతు సంతకాలు లేకుండానే నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డిలు రెండేసి సెట్లు చొప్పున మొత్తం ఆరు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. శుక్రవారం స్క్రూటినీ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులను రిటర్నింగ్ అధికారి ప్రకటించనున్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఇచ్చి, అవసరమైతే 27న ఎన్నికలు నిర్వహిస్తారు.

500కు పైగా జనాభా ఉన్న పంచాయతీలకు కార్యదర్శులు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: గ్రామ పంచాయతీలు, గ్రామ సచివాలయాల మధ్య మెరుగైన సమన్వయంతోపాటు ప్రజలకు సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 500 కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు కార్యదర్శులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులిచ్చారు. 500 కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రతి గ్రామ పంచాయతీకి డీడీవో అధికారాలతో కార్యదర్శిని నియమిస్తారు. గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులు, నిర్దిష్ట పంచాయతీకి డీడీవో అధికారాలతోపాటు వారి క్లస్టర్ హెడ్ క్వార్టర్ గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా కొనసాగుతారు. అలాగే గ్రేడ్-5 కార్యదర్శులకు కూడా గ్రామ పంచాయతీ పరిపాలన బాధ్యతతోపాటు డీడీవో అధికారాలను కల్పించారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి పలు ఉద్యోగ సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి. పరిపాలన బాధ్యతలు, డీడీవో అధికారాలివ్వడం వల్ల ప్రజలకు మరింత సులభంగా సేవలందుతాయని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ఒక ప్రకటనలో తెలిపారు. 2019లో గ్రామ సచివాలయ ఉద్యోగ నియామకాల ద్వారా జాయిన్ అయిన 7 వేల మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలు కల్పించినందుకు ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.జానీ పాషా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీకి కేంద్ర మాజీ మంత్రి కిశోర్ చంద్రదేవ్ రాజీనామా

- ఎన్డీఏతో టీడీపీ పొత్తు ప్రయత్నాలకు వ్యతిరేకమని ప్రకటన
- ఆత్మను అమ్ముకోలేనంటూ చంద్రబాబుకు లేఖ



కురుపాం: కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు వైరిచర్ల కిశోర్‌చంద్ర సూర్యనారాయణదేవ్ గురువారం టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు పంపించారు. విద్వేషపూరిత శక్తులతో జతకట్టడం సమాజానికి హానికరమని, అధికారం కోసం తన ఆత్మను అమ్ముకోలేనంటూ ఆ లేఖలో పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం దేశంలోని యువతకు కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తానన్న వాగ్దానం కలగానే మిగిలిపోయిందని, దేశంలో ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, లౌకికవాదం మాయమవుతున్నాయని తెలిపారు. శక్తివంతమైన మైనింగ్‌లాబీలు, కార్పొరేట్ల నుంచి ఆదివాసీలకు నిరంతరం ముప్పుపొంచి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయని ఎన్డీఏతో టీడీపీ ఎలా జతకడుతుందని ప్రశ్నించారు. కిశోర్‌చంద్రదేవ్ రాజీనామాతో పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాం నియోజకవర్గ టీడీపీ శ్రేణులు నైరాశ్యంలోకి వెళ్లాయి.

రాష్ట్రంలో బీజేపీ బలమైన శక్తి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలో ఇప్పటికే బీజేపీ బలమైనశక్తిగా ఎదిగిందని, మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు తమవంతు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. నెల్లూరులోని ఒక కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. పురందేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన నెల్లూరులోని వీఆర్సీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న 'ప్రజాపోరు సభ'కు మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ హాజరవుతారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, అన్ని రంగాల్లో దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి నగరంలోని వీఆర్సీ గ్రౌండ్‌ను పురందేశ్వరి పరిశీలించారు.

ఇసుకపై మళ్లీ అదే అక్కసు

అక్రమ తవ్వకాలంటూ ఈనాడు రామోజీ అర్థంపర్థంలేని ఆరోపణలు

పర్యావరణ అనుమతులున్న రీచ్‌ల్లోనే ఇసుక తవ్వకాలు



చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉండవల్లిలోని ఆయన ఇంటి వెనుక భాగంలో కృష్ణా నది నుంచి యంత్రాలతో భారీగా ఇసుకను తవ్వి తరలిస్తున్న లారీలు (ఫైల్ ఫొటో)

- కలెక్టర్ల తనిఖీలపైనా అడ్డగోలు వ్యాఖ్యలు
- ఒకవైపు తనిఖీలు జరుగుతున్నాయని రాస్తూనే... మరోవైపు ఎన్జీటీకి నివేదికను ఇచ్చారంటూ పొంతనలేని రాతలు
- టీడీపీ పాలనలో పెద్దఎత్తున ఇతర రాష్ట్రాలకు ఇసుక అక్రమ తరలింపు
- నాడు ఇసుక మాఫియాను అడ్డుకున్న మహిళా తహసీల్దార్ పైనే టీడీపీ నేతల దాడి
- టీడీపీ ప్రభుత్వంలో ఇసుక ద్వారా రావాల్సిన రూ.3,825 కోట్లకు గండి
- ఈ దారుణాలను అడ్డుకునేందుకే అత్యంత పారదర్శకంగా ఇసుక విధానం రూపొందించిన జగన్ ప్రభుత్వం
- ఇసుక పాలసీ ద్వారా గతంలో జరిగిన ఇసుక దందాకు చెక్
- గత ప్రభుత్వంలో అక్రమ ఇసుక తవ్వకాలపై ఎన్జీటి రూ.100 కోట్లు జరిమానా
- ప్రస్తుత ప్రభుత్వపు ఇసుక పాలసీపై ఎన్జీటి సంతృప్తి
- దీంతో గతంలో విధించిన జరిమానా రద్దు
- అయినా అసత్యాలు, అభూతకల్పనలతో రామోజీ దిగజారుడు కథనాలు

సాక్షి, అమరావతి: అసలే కోతి.. కల్లు తాగింది.. ఆపై నిప్పు తొక్కితే ఎలా ఉంటుంది..? ఈనాడు రామోజీరావు పరిస్థితి ఇప్పుడు అచ్చు అలాగే ఉంది. సీఎం వైఎస్ జగన్, రాష్ట్ర ప్రభుత్వంపై నిత్యం ఏదో ఒక విషం చిమ్మందే తెల్లారని రాజగురువు పాడిందే పాడరా పాచిపళ్ల దాసరా.. అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇసుక తవ్వకాలపై ఇప్పటికే టన్నుల కొద్దీ అబద్ధాలను తన విషపత్రిక ఈనాడులో అచ్చేసిన ఆయన ఇప్పుడు మరోసారి తన పైత్యాన్ని ప్రదర్శించి వికృత రాతలతో పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. జిల్లా కలెక్టర్లు చేసిన తనిఖీలను అడ్డగోలుగా వక్రీకరించి తన వక్రబుద్ధిని మళ్లీ బయటపెట్టుకున్నారు. ప్రభుత్వంపైనా, సీఎం వైఎస్ జగన్‌పైనా గుడ్డి వ్యతిరేకతతో ప్రతి విషయాన్ని వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుని పారదర్శకంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై అవాస్తవాలు, అభూత కల్పనలు ప్రచురించారు.

బాబు పాలనలో తవ్వకాల బరితెగింపు..

నిజానికి.. చంద్రబాబు హయాంలోనే ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరిగింది. సహజ వనరుల ద్వారా వచ్చే రెవెన్యూని ప్రజాసంక్షేమానికి వినియోగించడానికి బదులు, ఇసుక మాఫియా జేబుల్లోకి వెళ్లింది. ప్రజలు ఇసుక కొనుగోలు చేయడానికి బ్లాక్ మార్కెట్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పటి అరాచకాలను నిర్మూలించేందుకు సీఎం జగన్ కొత్త ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. దాని ప్రకారం టెండర్లు నిర్వహించి ఇసుక విక్రయాలను ఒక క్రమపద్ధతిలో నిర్వహించేలా చేస్తున్నారు. ఎక్కడా ఇసుక కొరత లేకుండా, అందుబాటు ధరలోనే, కావాల్సినంత ఇసుకను పొందే అవకాశం కల్పించారు. ఇందులో భాగంగా.. రాష్ట్రంలో ఇసుక ఆపరేషన్స్ కోసం పారదర్శకంగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థగా గుర్తింపు పొందిన మినీరత్న ఎంఎస్‌టీసీ ద్వారా టెండర్లు నిర్వహించారు. అందులో సక్సెస్‌ఫుల్ బిడ్డర్లుగా ఎంపికైన ఏజెన్సీలు ఇసుక ఆపరేషన్స్ ప్రారంభించాయి. పర్యావరణ అనుమతులున్న రీచ్‌ల్లోనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఎక్కడా నిబంధనల ఉల్లంఘన లేదు. సంబంధిత శాఖల అనుమతులతోనే రిజర్వాయర్లలో డీసిల్టింగ్ జరుగుతోంది. దీనిపై పర్యవేక్షణ, నిఘా కోసం ఎస్ఈబీని ఏర్పాటుచేశారు. అలాగే, జిల్లా స్థాయిలో రెవెన్యూ, పోలీస్, గనుల శాఖ అధికారులు కూడా తమకు ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి జిల్లాకు ఒక విజిలెన్స్ స్క్వాడ్ కూడా గనుల శాఖలో పనిచేస్తోంది. అంతేకాక.. రాష్ట్ర సరిహద్దులతో పాటు కీలకమైన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు.

పలు రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా..

ఇక మన రాష్ట్రంలో ఇసుక ఆపరేషన్స్, పర్యవేక్షణకు పారదర్శకంగా అనుసరిస్తున్న విధానాలను పలు రాష్ట్రాలకు చెందిన మైనింగ్ అధికారులు కూడా పరిశీలించి, తమ రాష్ట్రాల్లో మోడల్‌గా అమలుచేసేందుకు విధానాలు రూపొందించుకుంటున్నారు. ఇవన్నీ ఈనాడుకు కనిపించడం లేదు. ఒకవేళ కనపడినా కళ్లున్న కబోదిలా వ్యవహరిస్తూ.. అక్రమాలకు ప్రోత్సహిస్తున్నారని, దాడులకు సంబంధించిన సమాచారం ముందే లీక్ చేస్తున్నారంటూ అసత్యపు రాతలు రాస్తోంది.

బాబు హయాంలో దోపిడీకి ఈనాడు వత్తాసు..

అసలు చంద్రబాబు పాలనలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరిగినా రామోజీరావు, ఈనాడు పత్రిక కళ్లుమూసుకున్నాయి. మహిళా సంఘాలకు ఇసుక తవ్వకాలను అప్పగించి, ఇసుక మాఫియా ధాటికి వారు పనిచేయలేని పరిస్థితిని కల్పించిన ఘనత చంద్రబాబుది. ఆ తర్వాత ఉచిత ఇసుక విధానం పేరుతో ఇసుక మాఫియా ఇష్టారాజ్యంగా ప్రజలను దోచుకుంది. టీడీపీ నేతల జేబులు నింపేందుకే ఉచిత ఇసుక విధానం ఉపయోగపడింది. చంద్రబాబు హయాంలో ప్రభుత్వానికి రావాల్సిన దాదాపు రూ.3,825 కోట్ల ఆదాయానికి గండిపడింది. ఈ సొమ్మంతా ఇసుక మాఫియా జేబుల్లోకి వెళ్లింది. మరోవైపు.. ప్రజలు అధిక ధరల్లో బ్లాక్ మార్కెట్‌లో ఇసుకను కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని కల్పించారు. అప్పట్లో ఇసుక మాఫియాను అడ్డుకున్నందుకు పశ్చిమ గోదావరి జిల్లాలో ఏకంగా ఒక మహిళా ఎమ్మార్వోపైనే నాటి ప్రభుత్వ విప్, దెందులూరు ఎమ్మెల్యేగా ఉన్న చింతమనేని ప్రభాకర్ దాడిచేసిన ఘటన ఇసుక మాఫియా ఆగడాలకు అద్దంపట్టింది. గత టీడీపీ ప్రభుత్వంలో ఇసుక లారీలు పెద్దఎత్తున పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయి. లెక్కాపత్రం లేకుండా విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిగాయి.

పొంతనలేని రాతలతో తప్పుడు ఆరోపణలు..

మరోవైపు.. రాష్ట్రంలో అక్రమంగా ఇసుక తవ్వకాలకు సంబంధించి అక్కడక్కడా వచ్చిన ఆరోపణలపై పలు జిల్లాల్లో కలెక్టర్లు, సంబంధిత అధికారులతో కూడిన బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈ తనిఖీలు జరుగుతున్నాయని రాసిన ఈనాడు.. కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు రీచ్‌ల వైపు రాలేదని, మరికొన్నిచోట్ల గనులు, కాలుష్య నియంత్రణ, భూగర్భ జలశాఖ, ఎస్ఈబీ అధికారులతో కమిటీలు వేసి వారితో తనిఖీలు చేయించారంటూ పొంతనలేని రాతలు రాసింది. అలాగే, తనిఖీలు కొనసాగుతుంటే.. అప్పుడే ఎన్జీటీకి నివేదికలు ఇచ్చారంటూ అడ్డగోలు వాదనకు తెరతీసింది. వాస్తవంగా ఏం జరుగుతుందో కనీసం తెలుసుకునే ప్రయత్నం చేయకుండా, కేవలం అధికారులపై బురదజల్లే ఉద్దేశంతోనే పరస్పరం పొంతనలేని కథనాలతో తప్పుడు ఆరోపణలు చేస్తోంది.

ఏటా రూ.785 కోట్ల ఆదాయం..

ఇప్పుడు ప్రతిఏటా ప్రభుత్వానికి రూ.785 కోట్లు ఆదాయం వస్తోంది. టన్ను ఇసుక ఓపెన్ రీచ్‌లలో రూ.475కి విక్రయిస్తున్నారు. అలాగే, రీచ్‌లు, డిపోల వద్ద రవాణా చార్జీలతో కలిపి ఇసుక ధరలను కూడా ప్రతివారం పత్రికల ద్వారా ప్రభుత్వం ప్రకటిస్తోంది. అంతకన్నా ఎక్కువకు ఎవరు విక్రయించినా, లేదా ఇసుక కొనుగోళ్లు, రవాణాలో ఎటువంటి సమస్యలున్నా టోల్‌ఫ్రీ నెంబరు ద్వారా ఫిర్యాదు చేసే సదుపాయం కల్పించారు. ఈ వాస్తవాలను పక్కనపెట్టి ఈనాడు పత్రిక తమ ఊహలను వార్తలుగా రాస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం ఇసుక తవ్వకాలపై పదేపదే అక్కసు వార్తలు వండి వారుస్తోంది.

ఎన్జీటీ సంతృప్తి.. ఈనాడు మొద్దు నిద్ర..

ఇప్పుడు సీఎంగా వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత.. పర్యావరణానికి ఎటువంటి విఘాతం ఏర్పడకుండా, పూర్తి అనుమతులతో ఇసుక తవ్వకాలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా జరిగిన ఇసుక తవ్వకాల కారణంగా ఎన్జీటి ఏకంగా రూ.100 కోట్ల జరిమానాను విధించిన సంగతి తెలిసిందే. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఇసుక పాలసీ ద్వారా తీసుకున్న చర్యలను పరిశీలించిన ఎన్జీటి సంతృప్తి వ్యక్తం చేస్తూ, గత ప్రభుత్వం తప్పిదాల వల్ల విధించిన రూ.100 కోట్ల జరిమానాను కూడా రద్దుచేసింది. ఈ విషయం తెలిసినా ఈనాడు తెలియనట్లు మొద్దునిద్ర నటిస్తోంది.

వైఎస్సార్‌సీపీలో 1,200 కుటుంబాల చేరిక

టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి కారుమూరి



ఇల్లిందలపర్రులో మంత్రి కారుమూరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులు

ఇరగవరం: పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలంలో 1,200 కుటుంబాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు గురువారం మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కె.ఇల్లిందలపర్రు గ్రామంలోని 500 కుటుంబాలు, పేకేరు శివారు నిట్లవారితోట గ్రామంలోని 150, ఓగిడిలోని 200, అయినపర్రులోని 150, కాకిలేరులోని 200 కుటుంబాలు.. మొత్తంగా 1,200 కుటుంబాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలకు మంత్రి కారుమూరి పార్టీ కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజాసంక్షేమ పాలన వల్లే ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారంతా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని అన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు. అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన, నాడు-నేడు తదితర పథకాల ద్వారా విద్యా రంగాన్ని సీఎం జగన్ సంస్కరించారని.. ప్రపంచస్థాయి విద్యను అందుబాటులోకి తెచ్చి పేద పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేశారని వివరించారు. ఇంతటి సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించుకుని.. వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పెన్మత్స సుబ్బరాజు, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, మల్లిరెడ్డి నాగార్జున, పంపన అంజిబాబు, వెలగల సాయిబాబారెడ్డి, ఘంటా లక్ష్మి, సత్తి వెంకటరెడ్డి, ఘంటా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కాపులకు రాజ్యాధికారం, రిజర్వేషన్లపై మీ వైఖరేంటి?

- కాపు జేఏసీకి కాపు ఐక్యవేదిక, కాపునాడు బహిరంగ లేఖ
- ఆర్థిక స్తోమతను పట్టించుకోకుండా అట్టడుగువర్గాలకు వైఎస్సార్‌సీపీ సీట్లు ఇస్తోంది
- కానీ టీడీపీ ఆర్థిక స్తోమతను సాకుగా చూపించి టికెట్లు నిరాకరిస్తోంది
- కాపులకు అధిక సీట్లు ఇచ్చేలా టీడీపీపై ఒత్తిడి పెంచండి

సాక్షి, అమరావతి: కాపులకు రాజ్యాధికారం, రిజర్వేషన్ల విషయంలో మీ వైఖరేంటో తేల్చాలని కాపు జేఏసీని కాపు నాడు, కాపు ఐక్యవేదిక డిమాండ్ చేశాయి. ఈ మేరకు కాపు జేఏసీకి కాపునాడు జాతీయ అధ్యక్షుడు తాడివాక రమేశ్‌నాయుడు, కాపు ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాస్ తదితరులు గురువారం బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 16న విజయవాడలో కాపు జేఏసీ నిర్వహిస్తున్న కాపు సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఈ రెండు అంశాలపై చర్చించి నిర్ణయాన్ని వెల్లడించాలని కోరారు. 'ఆర్థిక స్తోమతను పట్టించుకోకుండా.. సామాన్యులకు, అట్టడుగువర్గాలకు సైతం వైఎస్సార్‌సీపీ అండగా నిలబడి సీట్లు కేటాయిస్తోంది. కానీ టీడీపీ ఆ దిశగా ఆలోచించడం లేదు. ఆర్థిక స్తోమతను సాకుగా చూపించి.. నిజాయితీగా సమాజానికి సేవ చేస్తున్న వారిని కూడా పక్కన పెడుతోంది. వైఎస్సార్‌సీపీ సోషల్ ఇంజనీరింగ్ ద్వారా బీసీలకు అత్యధిక సీట్లు ఇస్తోంది. శ్రీకాకుళం నుంచి హిందూపురం వరకు ఉన్న లోక్‌సభ స్థానాల్లో పది బీసీలకు, మూడు కాపులకు వైఎస్సార్‌సీపీ కేటాయించింది. టీడీపీ కూడా కాపులకు అత్యధిక సీట్లు ఇచ్చేలా ఒత్తిడి పెంచండి. బీసీలకు, ఓసీలకు ఇబ్బంది లేకుండా కాపులకు రిజర్వేషన్లను సాధించాల్సిన అవసరముంది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో ఐదు శాతం సబ్ కోటా కాపులకు అవసరం లేదని తిప్పికొట్టండి. రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రంలో టీడీపీ, కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీలను విశ్వసించొద్దు. బీజేపీ జాతీయ నాయకులతో చర్చించేందుకు కాపు ప్రతినిధులు ఢిల్లీ వెళ్లాల్సిన అవసరముంది' అని తాడివాక రమేశ్‌నాయుడు, రావి శ్రీనివాస్ సూచించారు.

మార్చి 27న 'కాపు' బహిరంగ సభ

రాజ్యాధికారం, రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా మార్చి 27న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు కాపునాడు జాతీయ అధ్యక్షుడు తాడివాక రమేశ్‌నాయుడు తెలిపారు. ఈ సభ ఏర్పాట్లపై విజయవాడలో గురువారం ఆహ్వాన కమిటీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించినట్టు పేర్కొన్నారు. సభకు ప్రధాని మోదీ, సీఎం వైఎస్ జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, ఇతర పార్టీల అధ్యక్షులను, సినీ కళాకారులను ఆహ్వానించనున్నట్లు చెప్పారు.

బీజేపీతో స్నేహం చేస్తే అస్తిత్వాన్ని కోల్పోతారు

సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం



సురవరం సుధాకరరెడ్డిని సన్మానిస్తున్న సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): బీజేపీతో స్నేహం చేస్తే ఏ పార్టీ అయినా తన అస్తిత్వాన్ని కోల్పోవాల్సిందేనని సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అన్నారు. ఆ ప్రమాదాన్ని టీడీపీ, జనసేన గుర్తించాలన్నారు. కర్నూలులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సురవరం సుధాకరరెడ్డి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో సుధాకరరెడ్డి సహచరులు, మిత్రులు, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. సుధాకరరెడ్డి మాట్లాడుతూ సమాజంలో దోపిడీ, అవినీతి ఉన్నంతకాలం కమ్యూనిజం ఉంటుందని, కమ్యూనిస్టులు మతాన్ని నమ్మరని, అయితే మతాన్ని ద్వేషించరని వివరించారు. బీజేపీని ఓడించడమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని చెప్పారు.

రఘురామ అమాయకుడేమీ కాదు..

కోర్టుల్లో ఏం జరుగుతుందో ఆయనకు బాగా తెలుసు

- కోర్టు ప్రొసీడింగ్స్‌పై వ్యాఖ్యలు చేయడం కూడా తెలుసు
- అన్నీ తెలిసే వాస్తవాలను తొక్కిపెట్టి పిల్ వేశారు
- తనపై కేసుల గురించి చెప్పలేదు.. స్పీకర్‌కు ఫిర్యాదు ప్రస్తావనా లేదు.. పైగా తనపై కేసులే లేవని డిక్లరేషన్ ఇచ్చారు
- అన్నీ దాచిపెట్టి దురుద్దేశంతో దాఖలు చేసిన ఈ వ్యాజ్యానికి విచారణార్హత లేదు
- సీఎం గురించి ఏం మాట్లాడారో వీడియోలను చూడండి
- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్
- అంగీకరించిన జస్టిస్ దుర్గాప్రసాదరావు ధర్మాసనం
- తదుపరి విచారణ మార్చి 4కు వాయిదా



సాక్షి, అమరావతి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటూ నర్సాపురం ఎంపీ కె.రఘురామకృష్ణరాజు ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేయడం వెనుక దురుద్దేశాలున్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శ్రీరామ్ హైకోర్టుకు నివేదించారు. ఆయన తన వ్యక్తిగత కక్షతోనే ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారని తెలిపారు. అంతేకాక.. తన గురించి అనేక వాస్తవాలను తొక్కిపెట్టి ఆయన ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. రఘురామ దాఖలు చేసిన వ్యాజ్యం రిట్, పిల్ నిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. తనపై కేసుల గురించి కనీస స్థాయిలో కూడా ఆయన ప్రస్తావించలేదన్నారు. లోక్‌సభ స్పీకర్‌కు వైఎస్సార్‌సీపీ ఇచ్చిన ఫిర్యాదు గురించి, జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) ముందున్న కోర్టు ధిక్కార ప్రొసీడింగ్స్‌ను కూడా తన వ్యాజ్యంలో పేర్కొనలేదన్నారు. పైపెచ్చు తనపై ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులు లేవంటూ డిక్లరేషన్ కూడా ఇచ్చారని ఏజీ శ్రీరామ్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అసలు రఘురామ చట్ట నిబంధనల గురించి తెలియని అమాయకుడేమీ కాదన్నారు. కోర్టుల్లో ఏం జరుగుతుందో ఆయన బాగా తెలుసన్నారు. అలాగే, కోర్టుల్లో జరిగే కేసుల విచారణలపై వ్యాఖ్యలు చేయడం కూడా ఆయనకు తెలుసునని తెలిపారు. పైగా ఆయన పార్లమెంట్ సభ్యుడని, అలాంటి వ్యక్తికి చట్ట నిబంధనల గురించి తెలియకపోవడానికి ఏముంటుందని శ్రీరామ్ చెప్పారు. అన్నీ తెలిసే ఆయన ఉద్దేశపూర్వకంగా తనకు సంబంధించిన కీలక విషయాలను పిటిషన్‌లో బహిర్గతం చేయకుండా తొక్కిపెట్టారని కోర్టుకు వివరించారు. ముఖ్యమంత్రి, ఇతర ప్రభుత్వ పెద్దలపై విషం చిమ్ముతూ తప్పుడు ప్రచారం చేయడాన్నే రఘురామకృష్ణరాజు పనిగా పెట్టుకున్నారన్నారు. కోర్టులు ఒకవైపు కేసులను విచారిస్తుంటే మరోపక్క ఆయన మీడియా ముందు ఆ కేసుల గురించి మాట్లాడటమే కాక, వ్యక్తులపై విషం చిమ్ముతూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుంటారని ఏజీ వివరించారు. ఆయన పలు మీడియా ఛానెళ్లతో ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం, ఇతర ప్రభుత్వ పెద్దల గురించి మాట్లాడిన మాటల తాలూకు వీడియోలను పరిశీలించాలని ఆయన కోర్టును కోరారు. ఆ వీడియోలను తమ కౌంటర్‌తోపాటు జతచేశామని తెలిపారు. వాటిల్లో మాట్లాడిన మాటలను యథాతథంగా కౌంటర్‌లో పొందుపరిచామన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు స్పందిస్తూ.. ఈ వీడియోలను తాము ఇంటి వద్ద చూస్తామని, కౌంటర్‌లో రాసిన అంశాలను చూస్తామని తెలిపింది. తదుపరి విచారణను మార్చి 4కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

సంక్షేమ పథకాల నిర్ణయాలపై పిల్..

రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న పలు ప్రజా సంక్షేమ పథకాలకు దురుద్దేశాలను ఆపాదించడంతోపాటు వాటివల్ల పలువురికి లబ్ధిచేకూర్చేలా ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలున్నాయని, వాటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ రఘురామ పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీని విచారణార్హతపై రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం లేవనెత్తింది. దీంతో ధర్మాసనం కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులందరినీ ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు ప్రతివాదులు కౌంటర్లు దాఖలు చేశారు. తాజాగా.. ఈ వ్యాజ్యంపై జస్టిస్ దుర్గాప్రసాదరావు నేతృత్వంలోని ధర్మాసనం గురువారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపించారు. రఘురామ దురుద్దేశంతోనే పిల్ దాఖలు చేశారని, ఇలాంటి వ్యాజ్యానికి విచారణార్హతే లేదన్నారు. అడ్వొకేట్ జనరల్‌గా తాను కోర్టులకు సహకరిస్తుంటానని, తాను మొదట కోర్టు ఆఫీసర్‌నని, తనపై కూడా ఆయన నిందారోపణలు చేశారని తెలిపారు. ఆ వీడియోలనూ పరిశీలించాలని ఆయన ధర్మాసనాన్ని కోరారు. అందుకు ధర్మాసనం అంగీకరించింది.

విచారణార్హతపై వాదనలకే పరిమితం కావాలి

అంతకుముందు.. రఘురామ తరఫు న్యాయవాది ఉన్నం మురళీధరరావు నాయకులంటే ఎలా ఉండాలో వివరించడం మొదలుపెట్టారు. ధర్మాసనం ఆయన్ను వారిస్తూ, కేసు గురించి వాదనలు చెప్పాలని స్పష్టంచేసింది. దీంతో సీఎం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, అందుకే తాము ఈ పిల్ దాఖలు చేశామన్నారు. ఈ వ్యాజ్యం దాఖలు వెనుక ఎలాంటి దురుద్దేశాలు లేవన్నారు.

'స్కిల్' కేసులో అప్రూవర్ పిటిషన్‌పై విచారణ మార్చి ఒకటికి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం కేసులో అప్రూవర్‌గా మారేందుకు అనుమతించాలని కోరుతూ ఈ కేసులో నిందితుడు(ఏ-13)గా ఉన్న ఏసీఐ కంపెనీ ఎండీ చంద్రకాంత్ షా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం మార్చి ఒకటో తేదీకి వాయిదా వేసింది. అప్పటి టీడీపీ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో తాము బోగస్ ఇన్‌వాయిస్‌లు సమర్పించామని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ బోగస్ ఇన్‌వాయిస్‌లతోనే స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి నిధులు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ కుంభకోణానికి సంబంధించిన వాస్తవాలను వెల్లడించడానికి తాను అప్రూవర్‌గా మారేందుకు అనుమతించాలని చంద్రకాంత్ షా న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై గురువారం న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ కేసులో చంద్రకాంత్‌షా అప్రూవర్ వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు అనుమతించే విషయంపై తదుపరి విచారణను న్యాయస్థానం మార్చి 1వ తేదీకి వాయిదా వేసింది.

టీడీపీ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసులో అప్రూవర్‌గా మారేందుకు అనుమతించాలంటూ చంద్రకాంత్ షా దాఖలు చేసిన డాక్యుమెంట్ల కాపీలు కావాలన్న టీడీపీ పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం శుక్రవారానికి వాయిదా వేసింది. చంద్రకాంత్ షా దాఖలు చేసిన పిటిషన్‌పై చంద్రబాబు సన్నిహితుడు, ఈ కేసులో నిందితుడు(ఏ-2)గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ అభ్యంతరం తెలుపుతూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. చంద్రకాంత్ షా సమర్పించిన డాక్యుమెంట్ల కాపీలు తమకు ఇవ్వాలని కోరారు. దీనిపై గురువారం న్యాయస్థానం విచారణ జరపగా, సీఐడీ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ చంద్రకాంత్ షా దాఖలు చేసిన డాక్యుమెంట్లను టీడీపీకి ఇవ్వాల్సిన అవసరంలేదని అభిప్రాయపడ్డారు. అనంతరం విచారణను న్యాయస్థానం శుక్రవారానికి వాయిదా వేసింది.

ఆసరా లబ్ధిదారులకు డిజిటల్ నైపుణ్యాలు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణాల్లోని ఆసరా లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘం సభ్యుల జీవనశైలిని మెరుగుపరచడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. ఆసరా ద్వారా ప్రభుత్వం అందించిన ఆర్థికసాయంతో ఉత్పాదకతను పెంచేందుకు, డిజిటల్ చెల్లింపుల నైపుణ్యాల పెంపునకు శిక్షణ ఇవ్వనుంది. ఇందులో భాగంగా ఆర్థిక లిటరసీ, డిజిటల్ చెల్లింపులపై శిక్షణ ఇచ్చేందుకు వయోజన విద్య విభాగం ద్వారా ప్రత్యేక కార్యక్రమం చేపట్టనుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమాన్ని 26 జిల్లాల్లో అమలు చేయనున్నారు. 2027 వరకు రాష్ట్రంలోని 33,71,169 మంది ఆసరా లబ్ధిదారులకు ఆన్‌లైన్‌లో శిక్షణనిస్తారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మా పాపకు మాటొచ్చింది



మాది నిరుపేద కుటుంబం. పెద్దలిచ్చిన రెండెకరాల భూమే మాకు బతుకుదెరువు. అనంతపురం జిల్లా డీ హీరేహాళ్ మండలం జాజరకల్లు గ్రామంలో నేను, మా ఆయన జి.రామిరెడ్డి వ్యవసాయం చేసుకుంటున్నాం. మాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉమేష్ బెంగళూరులో డిప్లొమా చదువుతున్నాడు. అమ్మాయి శ్రావణి పుట్టుకతోనే మూగ, చెవిటి. ఆమెలో ఉన్న లోపాన్ని చూసి బాధతో కుంగిపోయేవాళ్లం. పాపకు మాటలు రప్పించేందుకు ఎన్నో ఆస్పత్రుల చుట్టూ తిరిగాం. ఎలాంటి ఫలితం కనిపించలేదు. మూగమ్మాయి అంటూ హేళన చేస్తారనే భయంతో స్కూలుకు వెళ్లకుండా అప్పుడప్పుడు మొండికేసేది. సర్దిచెప్పి మేమే పంపేవాళ్లం. ఈలోగా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చింది. స్థానిక నాయకుల సలహాతో మా అమ్మాయి సమస్యను సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి ఒక లేఖ ద్వారా తీసుకెళ్లాం. సత్వరం స్పందించిన ముఖ్యమంత్రి.. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా చేయించారు. ఇప్పుడు మా అమ్మాయికి మాటొచ్చింది. ప్రస్తుతం బెంగళూరులో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. బిడ్డకు నేను జన్మనిస్తే.. మేనమామగా సీఎం జగనన్న మాట్లాడే భాగ్యం కల్పించారు. మాలో ప్రాణం ఉన్నంత కాలం ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– లక్ష్మి, జాజరకల్లు
(ఈ.రాధాకృష్ణ, విలేకరి, రాయదుర్గం)

జగనన్న సంక్షేమ 'ఆటో'గ్రాఫ్



బతుకు తెరువుకోసం ఆటో నడుపుతుంటా. దాని ద్వారా వచ్చే ఆదాయమే మా కుటుంబానికి ఆధారం. అన్ని రోజులూ ఒకేలా ఉండవు. అప్పుడప్పుడు వాహనానికి మరమ్మతులు తప్పనిసరి. ఏటా ఇన్సూరెన్స్ చెల్లించాలి. ఇంకా కేసుల సంగతి సరేసరి. అలాంటి సందర్భాల్లో అప్పులు చేయడం తప్పనిసరి అయ్యేది. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక అప్పులు చేయాల్సిన బాధ తప్పింది. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం యాళ్లవానిగరువుకు చెందిన నాకు వాహనమిత్ర పథకం ద్వారా ఏటా రూ.10 వేలు అందుతోంది. ఈ సొమ్ముతో ఏటా ఇన్సూరెన్స్, ఆటో రిపేర్లు చేయించుకుంటున్నా. నాకు ఇద్దరు పిల్లలు. బాబు అభినయ్ ఐదో తరగతి. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాడు. పాప భవ్యశ్రీ స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15 వేలు అందుతోంది. నా భార్య మణికి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఏటా రూ.10 వేలు అందింది. సున్నా వడ్డీ ద్వారా మరో రూ.2 వేలు బ్యాంక్ ఖాతాలో పడింది. వాటితో మా జీవనం సాఫీగా సాగిపోతోంది. ఇప్పుడు మాకు బతుకు భయం లేదు.

– కలిగితి రమేష్, యాళ్లవానిగరువు
(కె శాంతారావు, విలేకరి, పాలకొల్లు అర్బన్)

సర్కారు సాయంతో స్వయం ఉపాధి



మాది వ్యవసాయ కుటుంబం. అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేట గ్రామంలో మాకు సుమారు రెండెకరాల పొలం ఉంది. మా ఆయన గోవింద్ వ్యవసాయం చేస్తారు. మాకు ఇద్దరు ఆడపిల్లలు. ఒక అబ్బాయి. వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం ఇంటి అవసరాలకు సరిపోయేది కాదు. పంట చేతికొస్తే సరేసరి. లేకుంటే అప్పులు చేయాల్సి వచ్చేది. దానిని తీర్చడానికి నానా కష్టాలు పడాల్సి వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా పోయింది. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ. 18,750 చొప్పున నగదు అందుకున్నా. దీనికి మరికొంత నగదు కలిపి రెండు ఆవులు కొనుగోలు చేశా. రెండేళ్లుగా పాల ద్వారా రోజుకు రూ.400కు పైగా.. నెలకు రూ.12 వేలకు పైగా సంపాదిస్తున్నా. రైతు భరోసా ద్వారా ఇప్పటి వరకు రూ.54 వేలు అందింది. దీంతో సాగుకు పెట్టుబడి ఇబ్బందులు తొలగాయి. 6 నెలల కిందట మా కుమార్తెకు వివాహం చేశాం. మా అబ్బాయి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. మా కుటుంబం అంతా సంతోషంగా ఉన్నాం. దానికి కారణం ఈ ప్రభుత్వమే.

– ఎల్లపు వెంకటలక్ష్మి, విజయరామరాజుపేట
(చప్పా రామలింగేశ్వరరావు, విలేకరి, బుచ్చెయ్యపేట)

పన్ను చెల్లించే స్థాయికి ఎంఎస్ఎంఈలు

దేశంలోనే రికార్డు స్థాయిలో ఐటీ రిటర్నుల వృద్ధి రాష్ట్రంలో నమోదు

- గడిచిన నాలుగేళ్లలో ఏపీలో కొత్తగా 18 లక్షల మంది పన్ను రిటర్నులు దాఖలు
- పెరిగిన ఐటీఆర్ ఫైలింగ్స్ 60 శాతం ఎంఎస్ఎంఈల వల్లేనని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి
- రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో ఉద్యమ్ పోర్టల్‌లో 6.6 లక్షల ఎంఎస్ఎంఈలు నమోదు
- ఇదే సమయంలో రాష్ట్రంలో 4.1 లక్షలు దాటిన జీఎస్టీ రిజిస్ట్రేషన్ల సంఖ్య



సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఏపీలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు వేగంగా విస్తరిస్తుండటమే కాక అవి ఆదాయ పన్ను చెల్లించే స్థాయికి చేరుకుంటున్నాయి. గడిచిన నాలుగేళ్లుగా రాష్ట్రంలో ఆదాయ పన్ను రిటర్నుల (ఐటీఆర్) దాఖలు సంఖ్య గణనీయంగా పెరుగుతుండటమే దీనికి నిదర్శనం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా 2019–20 నుంచి 2022–23 మధ్య కాలంలో రాష్ట్రంలో కొత్తగా 18.3 లక్షల మంది కొత్తగా ఆదాయ పన్ను రిటర్నులు దాఖలు చేసినట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో మధ్యతరగతి ప్రజల ఆదాయం పెరగడం.. ఎంఎస్ఎంఈ రంగానికి పెద్దపీట వేస్తుండడం ఐటీ రిటర్నుల సంఖ్య పెరగడానికి ప్రధాన కారణంగా అధికారులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ తర్వాత గడిచిన మూడేళ్ల కాలంలో మహారాష్ట్రలో అత్యధికంగా 13.9 లక్షలు, ఉత్తరప్రదేశ్ 12.7 లక్షలు, గుజరాత్ 8.8 లక్షలు, రాజస్థాన్ 7.9 లక్షలు చొప్పున ఐటీఆర్ పెరిగాయి. కానీ, ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్రంలో ఐటీ రిటర్నుల సంఖ్య 11.7 లక్షలు తగ్గడం గమనార్హం.

ఎంఎస్ఎంఈలు 1.93లక్షల నుంచి 6.6 లక్షలకు..

ఇక అసంఘటిత రంగంగా ఉన్న ఎంఎస్ఎంఈ రంగాన్ని సంఘటితం చేయడానికి కేంద్ర ప్రభుత్వం జూలై 1, 2020న ఎంఎస్ఎంఈ యూనిట్ల నమోదు కోసం ఉద్యమ్ పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్‌ను తీసుకొచ్చింది. ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్న ఎంఎస్ఎంఈలకు బ్యాంకు రుణాలు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, మార్కెటింగ్ వంటి అనేక సౌలభ్యాలు ఉండటంతో ఈ పోర్టల్‌లో నమోదు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. దీంతో తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రంలో 1,93,530గా ఉన్న ఎంఎస్ఎంఈల సంఖ్య ఇప్పుడు 6.6 లక్షలు దాటినట్లు ఉద్యమ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అలాగే, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వల్ల దేశవ్యాప్తంగా 2.18 కోట్ల ఎంఎస్ఎంఈలు కొత్తగా రిటర్నులు దాఖలు చేయడానికి దోహదపడినట్లు ఎస్‌బీఐ తన రీసెర్చ్ నివేదికలో పేర్కొంది. ఇక మొత్తం పెరిగిన ఐటీఆర్‌ల్లో 60 శాతం తొలి ఐదు రాష్ట్రాల నుంచే వచ్చినట్లు పేర్కొంది. ఇదే సమయంలో రాష్ట్రంలో జీఎస్టీ రిజిస్ట్రేషన్ల సంఖ్య 4.1 లక్షలకు దాటడం కూడా రిటర్నులు దాఖలు పెరగడంలో కీలకపాత్ర పోషించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ చర్యలవల్ల రానున్న కాలంలో ఈ రిటర్నులు సంఖ్య మరింత పెరిగే అవకాశముందని ట్యాక్స్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఎంఎస్ఎంఈలకు పునరుజ్జీవం..

కోవిడ్ సమయంలో సీఎం వైఎస్ జగన్ రిస్టార్ట్ ప్యాకేజీ, వైఎస్సార్ నవోదయం వంటి పథకాలతో చేయిపట్టి నడిపించడం ద్వారా ఎంఎస్ఎంఈ రంగానికి పునరుజ్జీవం కల్పించడంతో కొత్త యూనిట్లు ప్రారంభించడానికి ముందుకొస్తున్నాయి. గత ప్రభుత్వం ఎంఎస్ఎంఈలను పూర్తిగా నిర్లక్ష్యం చేయగా ప్రస్తుత ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రోత్సాహకాలను విడుదల చేస్తూ ఆదుకుంటోందని పారిశ్రామికవేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఎంఎస్ఎంఈలకు, స్పిన్నింగ్ మిల్లులకు కలిపి బకాయి పెట్టిన రూ.1,588 కోట్లను విడుదల చేయడమే కాకుండా రూ.2,087 కోట్ల ప్రోత్సాహకాలను విడుదల చేసి వాటిని ఆదుకుంది. ఇప్పుడు తాజాగా ఫిబ్రవరిలో ప్రోత్సాహకాలు విడుదల చేయనుంది. అంతేకాక.. నిర్వహణ వ్యయం తగ్గించి పెద్ద పరిశ్రమలతో పోటీపడేలా క్లస్టర్ విధానాన్ని, ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.118 కోట్లతో 'ర్యాంప్'కార్యక్రమాన్ని చేపట్టింది.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల
రాష్ట్ర కమిటీల నియామకం

సాక్షి, అమరావతి : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ విభాగం, స్టేట్ లీగల్ సెల్ కమిటీ, రాష్ట్ర సేవాదళ్ విభాగం, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కమిటీ నియమించారు. ఈ మేరకు గురువారం కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ఎస్టీ సెల్ విభాగ కమిటీని 69 మందితో, స్టేట్ లీగల్ కమిటీ 69 మందితో, రాష్ట్ర సేవాదళ్ కమిటీని 35 మందితో, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కమిటీ 10 మందితో నియమించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ విభాగం..

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మేరాజోత్ హనుమంత్‌నాయక్, మత్స్యరాస వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా సి.ఆనందరావు, కె.నిరీక్షణరావు, ఎం.రమేష్, పి.వెంకటేశ్వరరావు, బి.బాలాజీ, ఎస్.వెంకట్‌నాయక్, జి.మార్కొండయ్య, 8 మందిని జోనల్ ఇన్‌చార్జులుగా, ముగ్గురిని అధికార ప్రతినిధులుగా, మరో 25 మంది కార్యదర్శులుగా, పలువురిని సహాయ కార్యదర్శులుగా నియమించారు.

వైఎస్సార్‌సీపీ స్టేట్ లీగల్ కమిటీ నియామకం

వైఎస్సార్‌సీపీ స్టేట్ లీగల్ కమిటీ 69తో నియమించారు అధ్యక్షుడిగా మలసాని మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కె.పుల్లారెడ్డి, పి.వెంకటరెడ్డి, టి.వెలుగొండయ్య, పి.దామోదరరావు, సీఎస్‌కే విజయ భాస్కర్‌రెడ్డి, సి.రామచంద్రారెడ్డి, ఎస్.రామ్‌దాస్‌తో పాటు పలువురిని ఉపాధ్యక్షులుగా, అధికార ప్రతినిధులుగా, కార్యదర్శులుగా, సహాయ కార్యదర్శులుగా నియమించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ విభాగ కమిటీ

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ కమిటీని 35 మందితో నియమించారు. అధ్యక్షుడిగా మాశెం సుధీర్ కుమార్ రెడ్డి, కో - ప్రెసిడెంట్‌గా డాక్టర్ కట్టి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా జి.రవికుమార్, ఎం.వెంకటప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఎం.సుభాకరరావు, డి.కృష్ణప్రసాద్‌రెడ్డి, ఎస్.జైనుల్లాతో పాటు పలువురిని కార్యదర్శులుగా, సహాయ కార్యదర్శులుగా నియమించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కమిటీ

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కమిటీని పది మందితో నియమించారు. అధ్యక్షురాలిగా వంగపండు ఉష, ఉపాధ్యక్షులుగా యనమల జాషువ, పి.రామకృష్ణారెడ్డి, కార్యదర్శులుగా పి.రంగారావు, బి.వెంకట రమణ, ఎస్ ధర్మయ్య దొర, ఎస్ శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా టి.రామకృష్ణ, మల్లికార్జున శాస్త్రి, జి.బిజ్జప్ప, కె.జగదీశ్వరరావు

'రాజధాని ఫైల్స్' చిత్ర ప్రదర్శన ఆపండి

నిర్మాతలకు హైకోర్టు ఆదేశం • తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి : ఎన్నికల వేళ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్‌సీపీని అప్రతిష్ట పాల్జేయాలన్న ఏకైక లక్ష్యంతో తీసిన ×రాజధాని ఫైల్స్₹ సినిమా ప్రదర్శనకు హైకోర్టు తాత్కాలికంగా బ్రేక్ వేసింది. ఈ సినిమా ప్రదర్శనను ఆపకపోతే పూడ్చుకోలేని నష్టం వాటిల్లుతుందన్న పిటిషనర్ ఆందోళనను పరిగణనలోకి తీసుకుని సినిమా ప్రదర్శనపై స్టే విధిస్తున్నట్టు హైకోర్టు తెలిపింది. ఆ సినిమాకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) రివైజింగ్ కమిటీ సర్టిఫికెట్ ఇచ్చిందా లేదా అన్న విషయాన్ని సంబంధిత రికార్డులను పరిశీలించిన తరువాతే తేల్చాల్సి ఉంటుందని తెలిపింది. అందువల్ల ఈ సినిమా ప్రదర్శనకు సంబంధించి ఎగ్జామినింగ్ కమిటీ, రివైజింగ్ కమిటీ రికార్డులను శుక్రవారం (16వ తేదీ) నాటికల్లా తమ ముందుంచాలని సీబీఎఫ్‌సీ ప్రాంతీయ అధికారిని, రివైజింగ్ కమిటీ ప్రిసైడింగ్ అధికారిని హైకోర్టు ఆదేశించింది. చిత్ర ప్రదర్శనకు సర్టిఫికెట్ ఇచ్చేముందు చట్టం నిర్దేశించిన విధి విధానాలను పూర్తి చేయాల్సిన బాధ్యత సీబీఎఫ్‌సీపై ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను 16వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా ప్రదర్శనపై స్టే విధించిన విషయాన్ని చిత్ర నిర్మాతకు, పంపిణీదారులకు తెలియజేయాలని నిర్మాత, దర్శకుల తరఫు సీనియర్ న్యాయవాదికి స్పష్టం చేశారు.

సీఎం ప్రతిష్టను దెబ్బ తీసేందుకే..

ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకే 'రాజధాని ఫైల్స్' పేరుతో సినిమా తీశారని, ఈ చిత్ర ప్రదర్శనకు జారీ చేసిన సర్టిఫికెట్‌ను రద్దు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. ఈ వ్యాజ్యంపై ఈ నెల 13న విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య మధ్యంతర ఉత్తర్వుల జారీపై తన నిర్ణయాన్ని వాయిదా వేసిన విషయం తెలిసిందే. కాగా.. దీనిపై గురువారం మరోసారి విచారణ జరగ్గా.. చిత్ర ప్రదర్శనకు అనుమతినిస్తూ సర్టిఫికెట్ మంజూరు చేసే సమయంలో రివైజింగ్ కమిటీ ఎలాంటి కారణాలను తెలియచేయలేదని, ఇది చట్ట నిబంధనలకు విరుద్ధమన్న వైఎస్సార్‌సీపీ తరఫు న్యాయవాది ప్రశాంత్ వాదనతో న్యాయమూర్తి ఏకీభవించారు. సినిమా ప్రదర్శనకు అనుమతినిచ్చే విషయంలో ఎగ్జామినింగ్ కమిటీ, రివైజింగ్ కమిటీలు ఏం చేశాయో తెలుసుకునేందుకు సంబంధిత రికార్డులను పరిశీలన నిమిత్తం తమ ముందుంచాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

జీవన భృతి పెంచడం హర్షణీయం

1,236వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ : రాజధానిలో భూమిలేని నిరుపేదలకు గత ప్రభుత్వం అందిస్తున్న రూ. 2,500 జీవన భృతిని, రూ. 5వేలకు పెంచుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళాయిపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,236వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో చంద్రబాబును నమ్మి భూములు ఇచ్చిన 33 వేల ఎకరాల రైతులతోపాటు, ఆ భూమిని నమ్మి 29 గ్రామాల్లో జీవనం కొనసాగిస్తున్న 17వేల మంది రైతు కూలీలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రెండు నెలలకు లేదా, నాలుగు నెలలకో జీవన భృతి 2,500 అందేదన్నారు. అయితే రాజధాని ప్రాంత కూలీల విజ్ఞప్తి మేరకు ఏడాది క్రితం సీఎం జగన్ సాధారణ పెన్షన్లు అందించినట్లే ప్రతినెలా 1వ తేదీన జీవన భృతిని నేరుగా ఇంటికి పంపించి ఉదారతను చాటుకున్నారని తెలిపారు. పెరిగిన ఖర్చులు, జీవన విధానం నేపథ్యంలో తమకు ఇబ్బందిగా ఉంటుందని ఎమ్మెల్యే సుచరిత దృష్టికి రాజధాని ప్రాంత కూలీలు తీసుకురాగా, ఆమె సీఎం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే రూ. 5వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం ఆయనకు పేదల పట్ల ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. నాయకులు బేతపూడి రాజేంద్రకుమార్, మాదిగాని గుర్నాథం, పెద్దింటి విజయ్, బోదాల సలోమి, బోదాల సౌమ్య, బొలిమేర శామ్యూల్, కొమరపల్లి కిషోర్‌బాబు, కారుమూరు పుష్పరాజ్, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబులా నేను కుర్చీ లాక్కునే రకం కాదు

సమావేశ మందిరంలో కూర్చున్నా
రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



డాబాగార్డెన్స్ (విశాఖ జిల్లా): ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కుర్చీలో కూర్చుని రివ్యూ చేశానంటూ తనపై మీడియాలో వచ్చిన వార్తలపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయనిక్కడ విలేకరులతో మాట్లాడుతూ తనపై ఈ విమర్శలకు పాల్పడిన ధూళిపాళ్ల నరేంద్రకు కనీస ఇంగిత జ్ఞానం లేదన్నారు. చంద్రబాబులా తాను కుర్చీ లాక్కునే రకం కాదని, సచివాలయ సమావేశ మందిరంలో కూర్చున్నానే గాని, ముఖ్యమంత్రి కుర్చీలో కాదని స్పష్టం చేశారు. బహుశా ధూళిపాళ్ల నరేంద్ర చంద్రబాబునాయుడుని ఉద్దేశించి మాట్లాడినట్టు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఎన్టీఆర్ నుంచి పార్టీని, కుర్చీని చంద్రబాబు లాక్కుని, అతనిపై చెప్పులు వేయించిన నైజం చంద్రబాబుదన్నారు. సుమారు ఐదువేల కోట్ల రూపాయల విలువైన పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వర్చువల్ విధానంలో చేసేందుకు సెక్రటేరియట్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశామని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వివిధ కార్యక్రమాలలో బిజీగా ఉన్నందున ఆ బాధ్యతలను తనకు అప్పగించారని అమర్‌నాథ్ తెలియజేశారు. గతంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ధూళిపాళ్ల నరేంద్ర, చంద్రబాబు నాయుడు జైల్లో ఉన్నప్పుడు అసెంబ్లీకి వచ్చిన బాలకృష్ణ.. చంద్రబాబు నాయుడి కుర్చీలోనే కూర్చున్న విషయం ధూళిపాళ్లకి తెలియదా అని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి తనకు ఏ బాధ్యతలు అప్పగించినా చేయడానికి సిద్ధంగా ఉన్నానని, డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వర్తిస్తానని మంత్రి అమర్‌నాథ్ స్పష్టం చేశారు.

జేఈఈ మెయిన్‌లో సత్తా చాటిన నారాయణ

సాక్షి, హైదరాబాద్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడించిన జేఈఈ మెయిన్–2024 తొలి విడత ఫలితాల్లో నారాయణ సత్తాచాటింది. ఎం.సాయి తేజ, షేక్ సూరజ్, ఆర్యన్ ప్రకాశ్, పి.రోహన్ సాయి, హెచ్.విదిత్, ఎం.అనూప్ 300 మార్కులకు గాను 300 మార్కులు సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 23 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించగా.. వారిలో 8 మంది నారాయణ విద్యార్థులేనని పేర్కొన్నారు. ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: జేఈఈ(మెయిన్స్)–2024 ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని ఆ సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. దొంతుల మనీశ్ 295/300 మార్కులు(ఫిజిక్స్‌లో వంద పర్సంటైల్, కెమిస్ట్రీలో వంద పర్సంటైల్) 99.99 శాతం సాధించి జాతీయస్థాయిలో తమ విద్యాసంస్థల ప్రతిష్టను నిలిపారని పేర్కొన్నారు. తుమ్మ తేజస్విని 99.95 శాతం, ఆర్.దీపాంశరెడ్డి 99.91 శాతం, పి.నిహాల్ శ్రీవాత్సవ 99.91 శాతం పర్సంటైల్ సాధించినట్లు వివరించారు. కె.శ్రీరామ్‌రెడ్డి 99.88 శాతం, కె.సిద్ధార్థరెడ్డి 99.77 శాతం సాధించారని తెలిపారు. ఈ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన 18 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ప్రతిభ చాటిన విద్యార్థులను చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి అభినందించారు.

మంగళగిరిలో స్థానికులకే పట్టం కట్టాలి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు వి. విజయసాయిరెడ్డి



దుగ్గిరాల (తాడేపల్లి రూరల్): మంగళగిరి నియోజకవర్గంలో స్థానికులకే పట్టం కట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు, ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ వి. విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాలు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేగా ఆ వర్గానికి చెందిన వ్యక్తి కావాలో, అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి కావాలో నిర్ణయించుకోవాలన్నారు. హైదరాబాద్‌లో ఉండి చుట్టం చూపుగా వచ్చి వెళ్లే వారికి కాకుండా ప్రజల కష్టాలు తెలిసిన మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థినే మనం గెలిపించుకోవాలని కోరారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలలో వైఎస్సార్ సీపీ మండల కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇది వైఎస్సార్‌సీపీ కార్యాలయం మాత్రమే కాదని, వైఎస్సార్‌సీపీ సేవా సదన్ అని, ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొనే సమస్యలు త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ఏర్పాటు చేశామన్నారు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రారంభించింది కాదని, ఈ ప్రాంత ప్రజలకు శాశ్వతంగా సేవలందించే ఉద్దేశంతో ఏర్పాటు చేశామని అన్నారు. వారం రోజుల్లో అభ్యర్థిని అధికారికంగా ప్రకటిస్తామని, మంగళగిరి నియోజకవర్గం నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన చేనేత కులానికి చెందిన వ్యక్తి పార్టీ అభ్యర్థిగా ఉంటారని స్పష్టం చేశారు.

22లోగా రబీ ఈ క్రాప్, ఈ కేవైసీ పూర్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ శేఖర్‌బాబు



సాక్షి, అమరావతి: ప్రస్తుత రబీలో ఈ–క్రాప్, ఈకేవైసీల నమోదు ప్రక్రియను ఈ నెల 22లోగా పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ గెడ్డం శేఖర్ బాబు ఆదేశించారు. మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లాల వ్యవసాయ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. రబీలో ఎక్కువ సాగయ్యే శనగ, మొక్కజొన్న, మినుము వంటి మెట్టపంటలు కోతకు వచ్చే సమయం దగ్గర పడుతుందని, అందువలన సాధ్యమైనంత త్వరగా ఈ క్రాప్, ఈ కేవైసీల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో నియమించిన సూపర్ చెక్ బృందాల ప్రగతిపై ఆయన సమీక్షించారు. ఈ కేవైసీలో నూరుశాతం సాధించే దిశగా ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు జరుగుతున్న క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే ఖరీఫ్ 2024లో అవసరమైన ఎరువులు, విత్తనాల కోసం జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. పీఎం కిసాన్ 16వ విడత నిధులు త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో ఇంకా ఆధార్‌తో బ్యాంక్ ఖాతాలను అనుసంధానం చేయని వారిని గుర్తించి సత్వరమే ఆ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.


రాజధాని రైతు కూలీల ఇంట సంబరం

పదేళ్ల ఇబ్బందులు తొలగించిన ముఖ్యమంత్రి

రూ.5 వేలకు పింఛన్ పెంపుపై హర్షం

తాడికొండ: అమరావతి రాజధాని ప్రాంతంలో రైతు కూలీల ఫించనును ఐదువేల రూపాయలకు పెంచుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేసిన ప్రకటనపై రైతు కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పది సంవత్సరాల కిందట పూలింగ్‌లో భూములు తీసుకున్న నాటి నుంచి వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలు రోడ్డున పడ్డాయి. భూములిచ్చిన రైతులకు కౌలు పేరిట లాభం చేకూర్చిన చంద్రబాబు.. రైతు కూలీలను మాత్రం విస్మరించారు. ఎన్నో పోరాటాల అనంతరం జీవన భృతిని కేవలం రూ. 2,500గా ప్రకటించి చేతులు దులుపుకున్నారు. అప్పట్లో మూడు నుంచి ఐదునెలల పాటు పెన్షన్లు అందక ఇబ్బందులు పడిన సందర్భాలూ ఉన్నాయి. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే భృతి అందేలా చర్యలు తీసుకున్నారు. మరోవైపు జీవనభృతిని రూ. 5 వేలకు పెంచుతున్నట్లు గురువారం జరిగిన వలంటీర్ల అభినందన సభలో ముఖ్యమంత్రి ప్రకటించారు. దీని ద్వారా రాజధానికి భూములు ఇచ్చిన 29 గ్రామాల్లో కూలి పనులు లేక ఇబ్బందులు పడుతున్న దాదాపు 17 వేల మంది రైతు కూలీలకు మేలు జరగనుంది.

మనసున్న మారాజు జగనన్న



మనసున్న మారాజు మా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి. చంద్రబాబు చేసిన అన్యాయాన్ని చెప్పగానే స్పందించి కడుపు నింపే విధంగా వరాలు కురిపించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. బాబు చేసిన అన్యాయానికి పదేళ్లుగా ఉపాధి లేక, జీవన భృతి పింఛన్ చాలక నానా ఇబ్బందులు పడుతున్నాం. పేదల ఆకలి బాధ తెలిసిన దేవుడు జగనన్న అనేందుకు పెంచిన ఈ పింఛనే నిదర్శనం.

–షేక్ నాగూర్‌మీరా, తుళ్లూరు

గతంలో పెంచమని అడిగినా దిక్కులేదు



ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న మేము గత ఎన్నికల ముందే చంద్రబాబును జీవన భృతి పింఛన్ పెంచమని కోరితే పెడచెవిన పెట్టారు. బంగారం లాంటి మూడు పంటలు పండే భూములను అడవిని చేసి ఇప్పుడు అమరావతి పేరుతో దొంగ దీక్షలు చేస్తున్నారు. జీవన భృతిని రూ. 5 వేలుగా ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది. మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే.

–షేక్ జానిబాషా, రాయపూడి

అడిగిన వెంటనే నెరవేర్చారు



ఇచ్చిన హామీలతో పాటు ప్రజల అవసరాలను బట్టి వెంటనే సమస్యలు పరిష్కరిస్తారనేందుకు మాకు పెంచిన పింఛనే నిదర్శనం. బాబు మమ్మల్ని పట్టించుకోకుండా పెడచెవిన పెట్టినందునే గత ఎన్నికల్లో ఓడిపోయారు. కానీ జగనన్న అడిగిన వెంటనే హామీ నెరవేర్చి మా కుటుంబాల్లో ఆకలి బాధను తీర్చారు. ఇంతకన్న మంచి ముఖ్యమంత్రి ఎవరుంటారు.

– బిజ్జం లక్ష్మి, శాఖమూరు

బాబు ఇబ్బందులకు గురిచేశారు



చంద్రబాబు పేదల పట్ల కక్షపూరితంగా వ్యవహరించారు. పేదలకో న్యాయం.. పెత్తందారులకో న్యాయం చేసి మమ్మల్ని బానిసలుగా మార్చారు. భూములిచ్చిన రైతులకు కౌలు పరిహారం ఏడాదికి పది శాతం పెంచుతూ అప్పనంగా దోచి పెట్టాడు. భూమిని నమ్ముకొని బతుకుతున్న మాకు రూ. 2,500 పింఛన్ విదిల్చి ఉపాధి లేక రోడ్డున పడేలా చేశారు. పేదల కష్టం తెలుసుకున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పింఛను రూ. 5 వేలు చేసి కష్టాలు తీర్చారు. ఆయనకు రాజధాని ప్రాంత రైతు కూలీలంతా రుణపడి ఉంటాం.

– శృంగారపాటి సాంబయ్య, ఉద్దండరాయనిపాలెం


● రణ్‌వీర్ సింగ్

సెప్టెంబరులో స్టార్ట్

బాలీవుడ్ కొత్త డాన్‌గా రణ్‌వీర్ సింగ్ మారనున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు వచ్చిన హిందీ 'డాన్' ఫ్రాంచైజీ చిత్రాల్లో ముందు 1978లో వచ్చిన 'డాన్'లో అమితాబ్ బచ్చన్, ఆ తర్వాత 2006లో వచ్చిన 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్', 'డాన్ 2'లో షారుక్ ఖాన్ హీరోలుగా నటించారు. అమితాబ్, షారుక్ డాన్లుగా మెప్పించారు. ఇప్పుడు కొత్త తరం డాన్‌గా బాలీవుడ్ తెరపైకి రణ్‌వీర్‌సింగ్ రానున్నారు. 'డాన్ 3'లో రణ్‌వీర్ హీరోగా నటిస్తారని, 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్', 'డాన్ 2' చిత్రాలకు దర్శకత్వం వహించిన ఫర్హాన్ అక్తర్ ఈ సినిమాను తెరకెక్కిస్తారని ఇప్పటికే అధికారిక ప్రకటన వెల్లడైంది. కాగా ఈ సినిమా చిత్రీకరణను సెప్టెంబరులో ప్రారంభించేలా ఫర్హాన్ అక్తర్ ప్లాన్స్ రెడీ చేస్తున్నారని బాలీవుడ్ సమాచారం. ప్రస్తుతం అజయ్ దేవగన్ మెయిన్ లీడ్ చేస్తున్న 'సింగమ్ ఎగైన్' సినిమాలో రణ్‌వీర్ సింగ్ ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమాలో తన వంతు చిత్రీకరణను పూర్తి చేసుకున్న తర్వాత 'డాన్ 3' షూటింగ్‌లో పాల్గొంటారట రణ్‌వీర్ సింగ్. ఈ చిత్రం కోసం స్పెషల్‌గా మేకోవర్ కానున్నారు. ఇక 'డాన్ 3' తర్వాత రణ్‌వీర్ సూపర్ హీరో ఫిల్మ్ 'శక్తిమాన్' చిత్రీకరణలో పాల్గొంటారు.


● అల్లు అర్జున్

బెర్లిన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు అల్లు అర్జున్

జర్మనీ వెళ్లారు హీరో అల్లు అర్జున్. ఈ ఏడాది ఫిబ్రవరి 15 (గురువారం) నుంచి ఫిబ్రవరి 25వరకు జర్మనీలో జరుగుతున్న 74వ బెర్లిన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొంటారు అల్లు అర్జున్. ఈ చిత్రోత్సవాల్లో భారతీయ సినిమా ప్రాముఖ్యత, చరిత్ర గురించిన అంశాలను అల్లు అర్జున్ మాట్లాడనున్నారని తెలిసింది. అంతేకాదు...ఈ ఫెస్టివల్‌లో అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న 'పుష్ప' సినిమాలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' ప్రత్యేక ప్రదర్శన కూడా ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రం ప్రదర్శన అనంతరం అంతర్జాతీయ ఫిల్మ్ మేకర్స్, మార్కెటింగ్ స్ట్రాటజిస్టులతో అల్లు అర్జున్ మాట్లాడతారట. ఇక బెర్లిన్ ఫెస్టివల్ నుంచి తిరిగొచ్చిన తర్వాత 'పుష్ప' మలి భాగం 'పుష్ప: ది రూల్' షూటింగ్‌లో పాల్గొంటారు అల్లు అర్జున్. రష్మికా మందన్నా, ఫాహద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌లు నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.

యుద్ధానికి పిలుపు

అమెరికన్ ఫిల్మ్స్ 'గాడ్జిల్లా' ఫ్రాంచైజీలో వస్తున్న తాజా చిత్రం 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్: ది న్యూ ఎంపైర్' (2024). రెబెక్కా హాల్, బ్రియాన్ టైరీ హెన్రీ, డన్ స్టీవెన్స్, కైలీ హాట్లీ, అలెక్స్ ఫెర్న్స్, ఫలా చెన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఆడమ్ విన్‌గార్డ్ దర్శకుడు. భారీ బడ్జెట్‌తో లెజెండరీ పిక్చర్స్ నిర్మించిన ఈ సినిమాను వార్నర్ బ్రదర్స్ రిలీజ్ చేస్తున్నారు. 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్: ది న్యూ ఎంపైర్' చిత్రం అంతర్జాతీయంగా మార్చి 27న, యునైటెడ్ స్టేట్స్‌లో మార్చి 29న, జపాన్‌లో ఏప్రిల్ 26న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్: ది న్యూ ఎంపైర్' నుంచి లేటెస్ట్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 'మేము ఓ సిగ్నల్‌ని కనుగొన్నాం', 'ఏదో ఊహించనది జరగబోతోంది', 'అది కేవలం సిగ్నల్ మాత్రమే కాదు.. యుద్ధానికి పిలుపు' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఇక 2021లో వచ్చిన 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్'కి సీక్వెల్‌గా 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్: ది న్యూ ఎంపైర్' చిత్రం తెరకెక్కింది.


● 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్: ది న్యూ ఎంపైర్' పోస్టర్

ఆ నమ్మకానికి రుణపడి ఉన్నాం

- సందీప్ కిషన్

''ఊరు పేరు భైరవకోన' సినిమాకి దాదాపు వంద ప్రీమియర్ షోలు పడ్డాయి. థియేటర్స్‌కి వచ్చిన ప్రతి ప్రేక్షకుడికి థ్యాంక్స్. మా మూవీ పాటలు, ట్రైలర్, ప్రీమియర్‌కు మీరు (ప్రేక్షకులు) ఇచ్చిన స్పందన, మా మీద మీరు పెట్టుకున్న నమ్మకానికి రుణపడి ఉన్నాం'' అన్నారు సందీప్ కిషన్. వీఐ ఆనంద్ దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా, కావ్యా థాపర్, వర్ష బొల్లమ్మ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించారు. ఈ సినిమా నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన బ్లాక్ బస్టర్ ప్రీమియర్స్ సక్సెస్ ప్రెస్‌మీట్‌లో అనిల్ సుంకర మాట్లాడుతూ–''మా సినిమా ప్రీమియర్స్ కోటి రూపాయల వసూళ్లు సాధించడం ఆనందాన్నిచ్చింది'' అన్నారు. ''ఈ రోజు రిలీజవుతున్న మా సినిమాని అందరూ చూడాలి'' అన్నారు వీఐ ఆనంద్, రాజేశ్ దండా.


● కావ్య, సందీప్ కిషన్, వర్ష

ఆలోచింపజేసే సుందరం మాస్టర్

''నేను ఇండస్ట్రీకి వచ్చి పదేళ్లవుతోంది. ప్రతీసారి ఏదో కొత్తగా చేయాలని ప్రయత్నిస్తుంటాను. సుందరం మాస్టర్ పాత్రను చూస్తే మనలో ఒకరిని చూసినట్టుగానే అనిపిస్తుంది. 'సుందరం మాస్టర్'లో కామెడీతో పాటు డ్రామా ఉంటుంది. ఇది అందర్నీ ఆలోచింపజేసే చిత్రమవుతుంది'' అని హర్ష చెముడు అన్నారు. హాస్య నటుడిగా ప్రేక్షకులను అలరిస్తున్న హర్ష చెముడు హీరోగా నటించిన చిత్రం 'సుందరం మాస్టర్'. కల్యాణ్ సంతోష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దివ్య శ్రీపాద హీరోయిన్. హీరో రవితేజ, సుధీర్ కుమార్ కుర్రు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న రిలీజ్ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ని హీరో చిరంజీవి విడుదల చేసి, సినిమా విజయం సాధించాలన్నారు. ''ఓ గిరిజన గ్రామంలో అందరూ స్పష్టంగా ఇంగ్లిష్ ఎలా మాట్లాడతారనే దానికి గల కారణం మా సినిమా చూస్తే తెలుస్తుంది'' అన్నారు కల్యాణ్ సంతోష్. ''సినిమా చాలా బాగా వచ్చింది'' అన్నారు సుధీర్ కుమార్ కుర్రు.


● హర్ష, దివ్య శ్రీపాద


● శివ కార్తికేయన్


● రుక్మిణీ వసంత్

యాక్షన్ ఎంటర్‌టైనర్ షురూ

శివ కార్తికేయన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఓ సినిమా షురూ అయింది. శ్రీ లక్ష్మీ మూవీస్ బ్యానర్‌పై తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఈ మూవీలో కన్నడ నటి రుక్మిణీ వసంత్ కథానాయిక. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న చిత్రమిది. మురుగదాస్‌గారు తన పాపులర్ స్టోరీ టెల్లింగ్ స్టయిల్‌లో ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. వరుస బ్లాక్‌బస్టర్‌లను అందుకుంటున్న శివకార్తికేయన్ కెరీర్‌లో ఈ మూవీ బిగ్గెస్ట్, గ్రాండియస్ట్ చిత్రం కానుంది. గత సినిమాల్లో చూసినట్లు కాకుండా ఈ సినిమాలో పూర్తిగా ప్రత్యేకమైన, స్టైలిష్ లుక్‌లో కనిపిస్తారు శివ కార్తికేయన్. ఈ చిత్రం ప్రేక్షకులకు హై యాక్షన్-ప్యాక్డ్ అనుభూతిని అందిస్తుంది. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే తెలియజేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, కెమెరా: సుదీప్ ఎలామన్.

గ్రామీణ ప్రేమకథ


● రక్షిత్, కోమలి

గ్రామీణ ప్రేమకథగా రూపొందిన చిత్రం 'శశి వదనే'. రక్షిత్ అట్లూరి, కోమలి హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాకు సాయి మోహన్ ఉబ్బన దర్శకుడు. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోదాల నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాను ఏప్రిల్ 5న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు. 'మనసులో పుట్టే ప్రేమ మచ్చలేనిదైతే ఆ ప్రేమకు మరణం కూడా మనతోనే' అనే డైలాగ్ విడుదలైన పోస్టర్‌పై ఉంది.

గూఢచారితో...


● ఇమ్రాన్ హష్మీ

బాలీవుడ్‌లో రొమాంటిక్ హీరోగా పేరొందిన ఇమ్రాన్ హష్మీ తాజాగా తెలుగులో 'జీ 2'లో నటించడానికి పచ్చజెండా ఊపారు. అడివి శేష్ నటించిన హిట్ మూవీ 'గూఢచారి' (2018)కి సీక్వెల్‌గా 'జీ 2 '(గూఢచారి 2) రూపొందుతోంది. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇమ్రాన్ హష్మీ పోస్టర్‌ని 'ఎక్స్'లో షేర్ చేసిన అడివి శేష్.. 'జీ 2' యూనివర్స్‌లోకి బ్రిలియంట్ యాక్టర్ ఇమ్రాన్ హష్మీ సార్‌కి స్వాగతం'' అని పోస్ట్ చేశారు. దీనికి ఇమ్రాన్ హష్మీ రిప్లయ్ ఇస్తూ.. 'సార్ అని ఫార్మాలిటీస్ అవసరం లేదు.. ఇమ్రాన్ అని పిలువు. మీ సినిమాలో భాగం అయినందుకు హ్యాపీగా ఉంది'' అని పోస్ట్ చేసారు.

సెంథిల్ కుమార్ సతీమణి ఇకలేరు


● రూహి

ప్రముఖ కెమెరామేన్ సెంథిల్ కుమార్ (ఛత్రపతి, మగధీర, బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్) ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన సతీమణి రూహి మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఆమె తుదిశ్వాస విడిచారు. వృత్తి రీత్యా యోగా శిక్షకురాలు అయిన రూహి చాలా కాలం పాటు హీరోయిన్ అనుష్క శెట్టితో కలిసి యోగా క్లాసులు నిర్వహించారు. సెంథిల్ కుమార్-రూహిలకు 2009లో వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. రూహి మరణం పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

స్వచ్ఛమైన ప్రేమ

ప్రవీణ్ రాజ్‌కుమార్ హీరోగా శశికా టిక్కో, ఆషు రెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పద్మ వ్యూహంలో చక్రధారి'. సంజయ్ రెడ్డి బంగారపు దర్శకత్వంలో కె.ఓ. రామరాజు నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన టైటిల్ లాంచ్ వేడుకలో దర్శకులు శ్రీరామ్ ఆదిత్య, కృష్ణ చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ''రాయలసీమ ప్రాంతం అంటే ఇన్నాళ్లు గొడవలు, ఫ్యాక్షన్.. ఇవే చూశారు. ఆ ప్రాంతంలో ఉన్న స్వచ్ఛమైన ప్రేమని మా సినిమాలో చూపించబోతున్నాం'' అన్నారు సంజయ్‌రెడ్డి బంగారపు. ''లవ్, ఎమోషనల్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రమిది'' అన్నారు ప్రవీణ్ రాజ్‌కుమార్.


● ప్రవీణ్, ఆషురెడ్డి

ఉషశ్రీ సంస్కృతి సత్కారానికి మహాదేవమణి

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ అవధాన పండితుడు ధూళిపాళ మహాదేవమణిని ఉషశ్రీ సంస్కృతి సత్కారానికి ఎంపిక చేసినట్టు ఉషశ్రీ మిషన్ తెలిపింది. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఒక ప్రకటనలో వెల్లడించింది. రాజమహేంద్రవరానికి చెందిన మహాదేవమణి, అవధానవిద్యలో ఘటికుడు. అంతకుమించి అవధాన సంచాలకునిగా ప్రఖ్యాతి చెందారు. మాడుగుల నాగఫణి శర్మ చేసిన ద్విశతావధానానికి ఆయన తొలుత సంచాలకత్వం వహించారు. ప్రస్తుతం ఆయన అవధాన విద్యలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఆయన దగ్గర శిక్షితులైన వారిలో బులుసు అపర్ణ, తాతా సందీపశర్మ, ఉదయ చంద్రిక, తదితరులున్నారు. ధర్మ సందేహాలు కార్యక్రమంతో విజయవాడ ఆకాశవాణి కేంద్రం ద్వారా సుపరిచితులైన ఉషశ్రీ పేరిట ఆయన కుటుంబ సభ్యులు ఉషశ్రీ సంస్కృతి సత్కార పురస్కారాన్ని ఏటా అందిస్తున్నారు.

భారీ వైఎస్సార్‌సీపీ జెండా

18న విశాఖలో ఆవిష్కరణ



విశాఖ సిటీ: రాష్ట్రంలోనే అతి పెద్ద వైఎస్సార్‌సీపీ జెండా విశాఖలో ఏర్పాటవుతోంది. స్థానిక అక్కయ్యపాలెం జాతీయ రహదారి ప్రాంతంలో 60 అడుగుల ఎత్తున, వైఎస్సార్‌సీపీ భారీ పతాకాన్ని సిద్ధం చేస్తున్నారు. సుమారు రూ.8 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ఈ జెండాను ఈ నెల 18న వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి ఆవిష్కరించనున్నారు. జీవీఎంసీ 44వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ బాణాల శ్రీనివాస్ తన సొంత నిధులతో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. గాలి తీవ్రతను తట్టుకునేలా రూ.42 వేలు వెచ్చించి బెలూన్ క్లాత్‌తో పార్టీ జెండాను సిద్ధం చేయించారు.

దివ్యాంగురాలిపై లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

ఉంగుటూరు: దివ్యాంగురాలిపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తికి పదేళ్లు జైలు శిక్ష విధిస్తూ విజయవాడ మహిళా సెషన్స్ కోర్ట్ న్యాయమూర్తి ఐ.శైలజాదేవి గురువారం తీర్పునిచ్చారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు ఎస్‌ఐ రవి చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. 2017 సంవత్సరం జూన్ 10న ఇందుపల్లి గ్రామానికి చెందిన అనగాని అంజిబాబు అదే గ్రామానికి చెందిన మూగ, చెవిటి మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు లైంగికదాడికి పాల్పడ్డాడు. అలాగే ఆయన కుటుంబ సభ్యులు అనగాని పద్మావతి, అనగాని నాగబాబు, అనగాని శ్రీనివాసు ఆ మహిళపై దాడి చేశారు. ఈ కేసులో మహిళా సెషన్స్ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రగిరి విష్ణువర్ధన్ 14 మంది సాక్షులను ప్రవేశపెట్టగా విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి అంజిబాబుకు పదేళ్లు జైలు, రూ.2,500 జరిమానా, పద్మావతి, నాగబాబు, శ్రీనివాసులకు ఒక్కొక్కరికీ రూ.6 వేల చొప్పున జరిమానా విధించారు.

ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధం

సుప్రీంకోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ లోక్‌సభ ఎన్నికల వేళ సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, సమాచార హక్కుకు విఘాతం కలిగిస్తోందంటూ కుండబద్దలు కొట్టింది. 2018లో నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీఏ సర్కారు ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. పారదర్శకత, నల్లధనం కట్టడి కోసమే పథకం తెచ్చామన్న కేంద్ర ప్రభుత్వ వాదనను తోసిపుచ్చింది. ఈ పథకం కింద ఇప్పటిదాకా కొనుగోలు చేసిన బాండ్ల మొత్తం, కొనుగోలుదారులు, స్వీకర్తల పేర్లు తదితరాల వివరాలన్నింటినీ వెల్లడించాల్సిందేనని ఆదేశించింది. సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం ఏకగ్రీవంగా తీర్పు వెలువరించింది. ''ఓటేసేందుకు పౌరులకు ఉన్న స్వేచ్ఛపై ఎలాంటి అవాంఛిత ఒత్తిళ్లూ ఉండరాదు. ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది చాలా ముఖ్యమైన విషయం. అంతేగాక ఎన్నికల ప్రక్రియలో విశ్వసనీయత ప్రభుత్వాల ప్రజాస్వామిక స్ఫూర్తికి అత్యంత కీలకం. అందుకే రాజ్యాంగం కూడా స్వేచ్ఛాయుత ఎన్నికల ప్రక్రియకు ఎంతో ప్రాధాన్యమిచ్చింది. కార్పొరేట్ల నుంచి పార్టీలకందే ఆర్థిక విరాళాలకు రెండు కారణాలుంటాయి. తద్వారా తమ మద్దతును వ్యక్తీకరించడం. లేదా సదరు విరాళాలు క్విడ్ ప్రొ కో తరహావి కావడం. పరిమిత స్థాయిలో ఉండే వ్యక్తిగత విరాళాలను, అపరిమితమైన కార్పొరేట్ విరాళాలను ఒకే గాటన కట్టలేం. కార్పొరేట్ విరాళాలు స్వేచ్ఛాయుత ఎన్నికల ప్రక్రియకు విఘాతంగా మారాయి. కనుక సంస్థలు, కంపెనీల నుంచి పార్టీలకు అందే భారీ విరాళాలకు కారణాలను గోప్యంగా ఉంచడాన్ని అనుమతించరాదు''అని స్పష్టం చేసింది. కేవలం ఎన్నికలే ప్రజాస్వామ్యానికి ఆది, అంతం కావంటూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా రెండు విడి తీర్పులు రాశారు. మోదీ సర్కారుకు భారీ ఎదురుదెబ్బగా భావిస్తున్న ఈ తీర్పుపై కాంగ్రెస్‌తో పాటు విపక్షాలన్నీ హర్షం వెలిబుచ్చాయి. పలువురు మాజీ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్లు కూడా తీర్పును సమర్థించడం విశేషం. ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా కూడా ఉన్నారు. తనతో పాటు జస్టిస్ గవాయ్ తరఫున సీజేఐ 152 పేజీల తీర్పు, తనతో పాటు న్యాయమూర్తులు జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మిశ్రాల తరఫున జస్టిస్ ఖన్నా 74 పేజీల తీర్పు వెలువరించారు.

చాలా లోపాలున్నాయి...

ఎన్నికల బాండ్ల పథకాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత జయా ఠాకూర్ తదితరులు దాఖలు చేసిన నాలుగు పిటిషన్లపై ధర్మాసనం 2023 అక్టోబర్ నుంచి వాదనలు ఆలకిస్తూ వస్తోంది. ఈ పథకం రహస్య బ్యాలెట్ విధానం వంటిదేనని, విరాళాలిచ్చేవారి గోప్యతను కాపాడుతుందని కేంద్రం చేసిన వాదన లోపభూయిష్టమని తాజా తీర్పులో ధర్మాసనం స్పష్టం చేసింది. బాండ్లను కొనుగోలు చేసేలా వ్యక్తులను, సంస్థలను ఈ పథకం ద్వారా ఒత్తిడి చేయవచ్చని పేర్కొంది. బాండ్‌పై దాత పేరుండదు గనుక అవి ఎవరి నుంచి వచ్చాయన్న విషయం ఆ విరాళాన్ని అందుకునే పార్టీకి కూడా తెలిసే అవకాశం లేదన్న కేంద్రం వాదననూ తోసిపుచ్చింది. ''ఈ పథకం లోపరహితం కాదు. విరాళాలు ఇచ్చిందెవరో పార్టీలు తెలుసుకునేందుకు అవకాశం కల్పించే లోపాలెన్నో ఇందులో ఉన్నాయి''అని స్పష్టం చేసింది''పౌరులు రాజకీయ విశ్వాసాలు, అభిప్రాయాలు ఏర్పరచుకోవడం వారి రాజకీయ వ్యక్తీకరణలో తొలి దశ. అందుకే పౌరుల రాజకీయ విశ్వాసాలకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) రక్షణ కల్పిస్తోంది. కానీ ఈ పథకం నిబంధనల ప్రకారం బాండ్ల కొనుగోలుదారుల వివరాలను ఓటర్లకు తెలియకుండా గోప్యంగా ఉంచుతారు. ఇది రాజ్యాంగం కల్పిస్తున్న భావ ప్రకటన స్వేచ్ఛను ఉల్లంఘించడమే''అంటూ తప్పుబట్టింది. అంతేగాక కార్పొరేట్ సంస్థలు పార్టీలకు అపరిమితంగా విరాళాలు అందజేసేందుకు వీలు కల్పించేలా కంపెనీల చట్టంలోని నిబంధనను తొలగించడం ఆర్టికల్ 14 ద్వారా రాజ్యాంగం కల్పిస్తున్న సమానత్వపు హక్కుకు విరుద్ధమని పేర్కొంది. ఎన్నికల బాండ్ల పథకాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. 2019 ఏప్రిల్ 12 నుంచి ఇప్పటిదాకా దీనికింద కొనుగోలు చేసిన ఎన్నికల బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలను మార్చి 6కల్లా కేంద్ర ఎన్నికల సంఘానికి అందజేయాలని బాండ్ల జారీ అధీకృత సంస్థ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. ప్రతి బాండ్ ముఖ విలువ, కొనుగోలు తేదీ, కొనుగోలుదారు పేరు, తద్వారా పార్టీలవారీగా అందుకున్న విరాళాలు వంటి అన్ని వివరాలనూ పొందుపరచాలని పేర్కొంది. వాటన్నింటినీ మార్చి 13కల్లా ఈసీ అధికారిక వెబ్‌సైట్‌లో అందరికీ అందుబాటులో ఉంచాలని నిర్దేశించింది. ఇంకా నగదుగా మార్చుకోని బాండ్లను సంబంధిత పార్టీలు తిరిగి ఎస్బీఐలో జమ చేయాలని, సదరు మొత్తాలను కొనుగోలుదారు ఖాతాకు బ్యాంకు జమ చేయాలని ఆదేశించింది. పార్టీలు బాండ్ల ద్వారా తమకందిన విరాళాల పూర్తి వివరాలను ఈసీకి సీల్డ్ కవర్లో సమర్పించాలని 2019 ఏప్రిల్ 12న ధర్మాసనం మధ్యంతర తీర్పు వెలువరించడం తెలిసిందే.

క్విడ్ ప్రొ కోకు ఆస్కారం

పార్టీలకు భారీగా ఆర్థిక విరాళాలిచ్చే వారి ఉద్దేశమేమిటన్నది బహిరంగ రహస్యమేనని సీజేఐ అన్నారు. సాధారణంగా కార్పొరేట్ విరాళాల ఉద్దేశం క్విడ్ ప్రొ కో ప్రయోజనాలేనన్న వాదనతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా విభేదించలేదని గుర్తు చేశారు. రాజకీయ సమానత్వానికి మన దేశంలో రాజ్యాంగ రక్షణ ఉన్నా ఆ విషయంలో ఇప్పటికీ అసమానత కొనసాగుతూనే ఉందని సీజేఐ ఆవేదన వెలిబుచ్చారు. 'రాజకీయ నిర్ణయాలను ప్రభావితం చేయడంలో వ్యక్తుల సామర్థ్యంలో అసమానతలున్నాయి. పార్టీలకందే ఆర్థిక సాయాన్ని కూడా ఈ అసమానతలు నియంత్రిస్తున్నాయి. సంపన్నులకు పార్టీలకు భారీ ఆర్థిక విరాళమిచ్చే సామర్థ్యముంటుంది. తద్వారా ప్రజా ప్రతినిధులకు దగ్గరయ్యేందుకు, ప్రభుత్వ విధాన నిర్ణయాలను ప్రభావితం చేసేందుకు కూడా అవకాశముంటుంది. ఇది వారికి కావాల్సిన లైసెన్సులివ్వడమో, వారికి అనుకూలమైన విధాన నిర్ణయాలు తీసుకోవడమో జరిగే ఆస్కారముంది. ఇలా క్విడ్ ప్రొ కో జరిగే అవకాశముంది'అన్నారు. రాజకీయ సమానత్వాన్ని పాటించే సమాజంలో పౌరులందరికీ రాజకీయ ప్రక్రియను ప్రభావితం చేసే విషయంలో సమానంగా గళమెత్తే అవకాశం చాలా కీలకమని సీజేఐ అభిప్రాయపడ్డారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేయడానికి జస్టిస్ ఖన్నా తన తీర్పులో పలు కారణాలను ఉటంకించారు.

గోప్యత కీలకం: సీజేఐ

రాజకీయ పార్టీకి అందే విరాళాల గురించిన సమాచారం ఓటరుకు తెలియడం తప్పనిసరని సీజేఐ తన తీర్పులో పేర్కొన్నారు. అప్పుడే ఓటు హక్కును ప్రభావవంతంగా వినియోగించుకోగలడన్నారు. ''ఎన్నికల వ్యయంలో నల్లధనం కట్టడికి బాండ్లే ఏకైక మార్గం కాదు. దీనితో పోలిస్తే సమాచార హక్కు స్ఫూర్తికి గండి కొట్టని మెరుగైన ఇతర మార్గాలెన్నో ఉన్నాయి. అయితే అన్ని రాజకీయ విరాళాలనూ విధాన నిర్ణయాలను ప్రభావితం చేసే ప్రయత్నాలుగా చూడలేం. చట్టసభల్లో పెద్దగా ప్రాతినిధ్యం లేని పార్టీలకు కూడా విరాళాలందుతున్నాయి''అని ఆయన అభిప్రాయపడ్డారు. ''ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు, విధానాలను ప్రభావితం చేసేందుకు డబ్బు ఎంతో అవసరం. ఎన్నికల్లో ప్రజాస్వామికంగా పాల్గొనేందుకు కూడా డబ్బు కావాల్సిందే''అన్నారు. అయితే, ''వ్యక్తుల రాజకీయ విశ్వాసాలకు సంబంధించిన సమాచారాన్ని అసమ్మతిని అణచివేసేందుకు ప్రభుత్వం రాజకీయంగా వాడుకునే ఆస్కారముంది. అంతేగాక సదరు వ్యక్తులకు ఉద్యోగావకాశాల వంటివాటిని నిరాకరించే ప్రమాదం కూడా ఉంది. అంతేగాక అవి మెజారిటీ అభిప్రాయాలకు విరుద్ధంగా ఉండే పక్షంలో వారిపై ప్రతికూల ప్రభావం పడవచ్చు. అందుకే పౌరులకు తమ రాజకీయ విశ్వాసాలను గోప్యంగా ఉంచుకునే హక్కు చాలా ముఖ్యం''అని సీజేఐ అన్నారు. గోప్యత హక్కుకు రాజ్యాంగపరమైన రక్షణ ఉంటుందంటూ 9 మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావించారు. ''ఓటు ఎవరికేస్తున్నదీ గోప్యంగా ఉంచే హక్కు లేకుంటే పరిణామాలు దారుణంగా ఉంటాయి. తమకు వ్యతిరేకంగా ఓటేసేవారి ఓట్లను తొలగించేందుకు వాడుకునే ప్రమాదమూ ఉంది. నియోజక వర్గాలను కూడా ఓటర్ల రాజకీయ మొగ్గుదల ఆధారంగా విభజించే ఆస్కారముంది. అప్పుడు ఎన్నికల వ్యవస్థకే అర్థం లేకుండా పోతుంది''అని ఆందోళన వెలిబుచ్చారు. కాకపోతే ఈ గోప్యత హక్కును పార్టీలకు అందే విరాళాలకు కూడా వర్తింపజేయవచ్చా అన్నదే ప్రశ్న అని సీజేఐ చెప్పారు. పార్టీలకు ఆర్థిక విరాళాలకు కూడా రాజ్యాంగపరమైన రక్షణ ఉందా అన్న అంశంపై విచారణ జరపాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

అదంతా 'పచ్చ' అబద్ధం!

రాజకీయ దురుద్దేశంతో అసత్య కథనాలు రాస్తున్న ఈనాడు విలేకరి

- పెదకూరపాడు టీడీపీ నేతల ప్రోద్బలంతో నిత్యం అబద్ధాల వార్తలు
- ఇసుక రవాణా నిలిపివేసినా అక్కడున్న వాహనాల ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్
- దానిపై ప్రశ్నిస్తే తనపై దాడి చేశారంటూ అసత్య ఆరోపణలు
- దానికి మరింత మసాలా జోడించి ఈనాడులో పతాక శీర్షిక ప్రచురణ

సాక్షి, అమరావతి: నిత్యం కట్టుకథలతో పేజీలకు పేజీలు నింపేస్తున్న ఈనాడు పత్రిక గురువారం మరో అబద్ధాన్ని అందంగా అచ్చేసింది. తెలుగు దేశం పార్టీ నాయకుల పోద్బలంతో అక్కడి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వార్తలు రాస్తూ ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాలు చేసేందుకు యత్నిస్తున్న అమరావతి ఈనాడు విలేకరిపై ఏకంగా పెట్రోల్‌పోసి నిప్పంటించేస్తామని బెదిరించి... చంపబోయారన్నట్టు... ఓ అబద్ధపు వార్త ప్రచురించింది. వాస్తవానికి ఆ విలేకరి పీడీయాక్ట్‌పై జైలుకెళ్లి ఇటీవల విడుదలైన టీడీపీ నేత దండా నాగేంద్రతో సన్నిహితంగా ఉంటూ అతను చెప్పినట్టు ఇసుక సరఫరాపై నిత్యం తప్పుడు కథనాలు వండి వారుస్తున్నాడు. అక్రమాలకు పాల్పడుతున్న ఆ విలేకరిని వేరే పత్రిక తొలగిస్తే టీడీపీనేత దండా సిఫార్సుతో ఈనాడులో కొన్నాళ్ల క్రితం చేరాడు. అప్పటినుంచి స్వామిభక్తి చాటుకుంటూ ప్రశాంతంగా ఉన్న పెదకూరపాడు నియోజకవర్గంలో రాజకీయంగా అల్లర్లు సృష్టించేందుకు యత్నిస్తున్న నాగేంద్రం సూచనమేరకు ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా తప్పుడు కథనాలు రాస్తున్నాడు.

ఇసుక ర్యాంపులోకి అక్రమంగా...

అమరావతి మండలం మల్లాది ఇసుకరీచ్‌ను పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మంగళవారం స్వయంగా పరిశీలించారు. కానీ తవ్వకాలు ఆపమని బుధవారానికి ఎటువంటి ఆదేశాలు రాకపోవటంతో యథావిధిగానే ఇసుక తవ్వకాలు మొదలు పెట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్థాయి అధికారులు ఉదయం 10.30గంటలకు వచ్చి తవ్వకాలు ఆపేయాలని తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్టు తెలిపారు. అప్పటికే పది ఇసుక వాహనాలకు లోడింగ్ చేయటానికి నిర్వాహకులు బిల్లులు రాశారు, ఇంకా బిల్లులు రాయకుండా ఉన్న 15 వాహనాలను వెనక్కు పంపారు. బిల్లులు రాసి లోడైన ఆరు వాహనాలతో ఇసుక పంపించేశారు. అదే సమయంలో మల్లాది గ్రామానికి చెందిన ఈనాడు కంట్రిబ్యూటర్ పరమేశ్వరరావు ఇసుక రీచ్‌లోకి వచ్చి నదిలో ఇసుక లోడ్ అవుతున్న నాలుగు వాహనాల ఫొటోలు, వీడియోలు తీశారు. ఈ సమయంలో కూలీకి పనిచేస్తున్న మల్లాది యువకులు తమ ఊరు వాడే కదా అనే చనువుతో ×ఎంటబ్బాయ్ ఫొటోలు, వీడియోలు తీస్తున్నావు... గతంలో కూడా ఇలాగే ఫొటోలు తీసి నిజాలు దాచిపెట్టి అబద్ధాలు రాసి మన ఊరి పరువుతీస్తున్నావ౯ని సరదాగా అన్నారు. దానికి ఆయన ×నేను ఈనాడు విలేకరిని, మాకు మా యాజమాన్యం నుంచి ఆదేశాలు అలాగే ఉన్నాయి, అయినా మీకు చెప్పాలా, మీ పర్మిషన్ తీసుకుని రీచ్‌లోకి రావాలా ఏంటీ, అన్ని వాహనాలు సీజ్ చేయిస్తాను౯ అంటూ దురుసుగా మాట్లాడటంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో వాగ్వాదం జరిగింది. ఈనాడు కంట్రిబ్యూటర్ కవ్వింపు చర్యలకు దిగడంతో తోపులాట జరిగింది. వెంటనే ఇసుక తవ్వకాలు జరిపే కంపెనీ విజిలెన్స్ అధికారి రాంబాబు వారిని విడదీసి కంట్రిబ్యూటర్‌ను ద్విచక్ర వాహనంపై పంపించేశారు. కిందపడిపోయిన ఆయన సెల్‌ఫోన్‌ను తరువాత అక్కడకు చేరుకున్న సీఐ బ్రహ్మం ద్వారా అప్పగించారు.

ఈనాడులో వచ్చింది అబద్ధం

జరిగిన సంఘటన ఒకటైతే... ఈనాడు పత్రికలో వేరేవిధంగా వార్త వచ్చిందని ఇసుక కంపెనీ విజిలెన్స్ అధికారి రాంబాబు మీడియాకు తెలిపారు. అసలు ఎలాంటి అనుమతులు లేకుండా ఈనాడు కంట్రిబ్యూటర్ ఇసుక రీచ్‌లోకి ప్రవేశించడమే గాకుండా అక్కడున్న వారితో వాగ్వాదానికి దిగాడనీ ఆ సమయంలో ×పెట్రోల్ తీసుకురండి.. తగలెట్టేద్దాం౯ అని ఎవరూ అనలేదని, అసలు నిర్బంధించలేదని చెప్పారు. ఇసుక రీచ్‌కి సంబంధించిన సిబ్బంది ఎక్కడా వైఎస్సార్‌సీపీ అనిగానీ, ఎమ్మెల్యే శంకరరావు పేరుగానీ ప్రస్తావించకపోయినా ఈనాడులో తప్పుడు కథనాలు ప్రచురించారని తెలిపారు. దాడి జరిగిన వెంటనే మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ వచ్చి పరామర్శించి, రాజకీయ రంగు పులిమారనీ పేర్కొన్నారు. అమరావతి నుంచి దండా నాగేంద్ర కారులో కంట్రిబ్యూటర్ గుంటూరు ఈనాడు కార్యాలయానికి వెళ్లాక, అక్కడ కట్టు కథ అల్లి అడ్డగోలుగా వార్త ప్రచురించినట్టు స్పష్టమైంది.

దూదేకుల కులాన్ని నూర్‌బాషాలుగా మార్చండి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దూదేకుల కులం పేరును నూర్ బాషాగా మార్చాలని ముఖ్యమంత్రికి ఏపీ స్టేట్ మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహ్మద్ ఖాన్ లేఖ రాశారు. ఈ విషయమై నూర్ బాషా (దూదేకుల) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.పీర్ మహమ్మద్ గురువారం మైనారిటీస్ కమిషన్‌కు విజ్ఞాపన పత్రాన్ని అందించిన నేపథ్యంలో ఈ లేఖ రాశారు. రాష్ట్రంలో నూర్ బాషా జనాభా 23 లక్షల మంది ఉన్నారని, వారు ముస్లింలలో అంతర్భాగమని తెలిపారు. మైనారిటీ రిజర్వేషన్‌తోపాటు ప్రభుత్వం ద్వారా అందే సంక్షేమ పథకాలు వారికి అందాలని ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చిందని ఇక్బాల్ అహ్మద్ పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్

శుక్రవారం
16-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
288	71
72,050	21,911

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,859	▲ 1
డోజోన్స్	38,626	▲ 202
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,598	▲ 29
డాక్స్	17,047	▲ 101
షాంఘై (శుక్రవారం ముగింపు)	2,866	▲ 36
నికాయ్	38,158	▲ 455

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,508 ▼	82
బంగారం (99.5 స్వచ్ఛత)	61,262 ▼	82
వెండి (కిలో)	70,203 ▲	1,053

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.60	83.62
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.17	105.73
€	యూరో	ఎస్‌బీఐ	87.99	90.34
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.68	55.92
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.94	54.88
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.31	63.00
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.24	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.71	23.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.50

టాటా ప్లేలో రిలయన్స్‌కు వాటా!

30 శాతం డిస్నీ వాటాపై కన్ను



ముంబై: శాటిలైట్ టీవీ ప్రసారాల సంస్థ టాటా ప్లేలో వాటా కొనుగోలుకి ముకేశ్ అంబానీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం టాటా ప్లేలో టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌కు 50.2 శాతం వాటా ఉంది. మీడియా దిగ్గజం వాల్ట్ డిస్నీ కంపెనీ 29.8 శాతం వాటాను కలిగి ఉంది. అంతేకాకుండా సింగపూర్ ఫండ్ టిమాసెక్ చేతిలో మిగిలిన వాటా(20 శాతం) ఉంది. కాగా.. వాల్ట్ డిస్నీ వాటా కొనుగోలుకి ఆర్ఐఎల్ చర్చలు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తద్వారా దేశీయంగా టీవీ ప్రసారాలు, పంపిణీ విభాగంలో ఆర్ఐఎల్ మరింత పట్టుసాధించే వ్యూహంతో ఉన్నట్లు తెలియజేశాయి. ఒకవేళ చర్చలు సఫలమైతే తొలిసారి ఒక భాగస్వామ్య సంస్థ(జేవీ)లో టాటా గ్రూప్, ముకేశ్ అంబానీ గ్రూప్ భాగస్వాములయ్యే అవకాశముంది. ఇది టాటా ప్లే ప్లాట్‌ఫామ్ ద్వారా జియో సినిమా ప్రసారాలు మరింత విస్తరించేందుకు దోహదం చేస్తుంది. టాటా ప్లే పబ్లిక్ ఇష్యూలో భాగంగా ఇంతక్రితం వాటాను విక్రయించాలని డిస్నీ భావించింది. అయితే లిస్టింగ్ ప్రణాళికలు వాయిదాపడటంతో వాటా విక్రయానికి ఇతర అవకాశాలను అన్వేషిస్తోంది. టాటా ప్లే, ఆర్ఐఎల్, డిస్నీ ప్రతినిధులెవరూ ఈ అంశంపై స్పందించకపోవడం గమనార్హం! కాగా.. బిలియన్ డాలర్ల విలువలో టాటా ప్లేలో 20 శాతం వాటా అమ్మకానికి గతేడాది టిమాసెక్ సైతం టాటా గ్రూప్‌తో చర్చలకు తెరతీసింది. అయితే ఎలాంటి ఒప్పందమూ కుదరలేదు. డిస్నీ వాటా ఆర్ఐఎల్ సొంతమైతే మొత్తం జియోసినిమా కంటెంట్ బకెట్‌ను టాటా ప్లే కస్టమర్లకు ఆఫర్ చేసే వీలున్నట్లు పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

స్పోర్ట్స్ హాస్పిటాలిటీ వ్యాపారంలోకి ఓయో

12 నగరాల్లో 100 హోటల్స్ షార్ట్‌లిస్ట్

న్యూఢిల్లీ: ఆతిథ్య రంగ టెక్ సంస్థ ఓయో తాజాగా స్పోర్ట్స్ హాస్పిటాలిటీ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. భారీ స్థాయి క్రీడల పోటీల నిర్వహణకు సంబంధించి ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, పుణె సహా 12 కీలక నగరాల్లో 100 హోటల్స్‌ను షార్ట్‌లిస్ట్ చేసింది. వివిధ స్పోర్ట్స్ ఈవెంట్లలో పాల్గొనే క్రీడాకారులు, అధికారులకు వసతి సదుపాయం కల్పించేందుకు ఇవి ఉపయోగపడగలవని సంస్థ



తెలిపింది. స్పోర్ట్స్ టీమ్‌లు, పెద్ద బృందాల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ప్యాకేజీలు, గ్రూప్ బుకింగ్ ఆప్షన్స్ ఇస్తామని ఓయో వివరించింది. అలాగే క్రీడాకారులు, ఈవెంట్లను వీక్షించేందుకు వచ్చే వారి ఆహార, రవాణా అవసరాలను తీర్చే థర్డ్-పార్టీ ఏజెన్సీల సేవలను కూడా అందుబాటులో ఉంచుతామని పేర్కొంది.

రెడ్ సీ సవాళ్లున్నా.. ఎగుమతులు రయ్!

- జనవరిలో 3.12 శాతం పురోగతి
- విలువ 37 బిలియన్ డాలర్లు
- మూడు నెలల గరిష్ట స్థాయి
- తొమ్మిది నెలల కనిష్టానికి వాణిజ్యలోటు



న్యూఢిల్లీ: ఎర్ర సముద్రం ప్రాంతంలో అలాగే అంతర్జాతీయంగా నెలకొన్న సంక్షోభ పరిస్థితులను జనవరిలో భారత్ వస్తు ఎగుమతులు అధిగమించాయి. 2023 జనవరిలో పోల్చితే 2024 జనవరిలో భారత్ ఎగుమతులు 3.12 శాతం పెరిగాయి. విలువలో 36.92 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇక రెండు నెలల క్షీణత అనంతరం జనవరిలో వస్తు దిగుమతులు 3 శాతం పెరిగి 54.41 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్యలోటు 17.49 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. గడచిన తొమ్మిది నెలల్లో ఇంత తక్కువ స్థాయి వాణిజ్యలోటు ఇదే తొలిసారి. ఎర్ర సముద్రం సంక్షోభం ఎగుమతిదారులపై ప్రభావం చూపుతోంది. వారు తమ వస్తువులను యూరప్- ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలకు రవాణా చేయడానికి - ఆఫ్రికాను చుడుతూ కేప్ ఆఫ్ గాడ్ హోప్ మార్గాన్ని ఎంచుకోవాల్సి వస్తోంది. దీనితో రవాణా వ్యయం తడిసి మోపెడవుతోంది. సరకు రవాణాలో 14 రోజుల ఆలస్యంతోపాటు బీమా వ్యయాలు కూడా పెరిగాయి. యెమెన్‌కు చెందిన హౌతీ మిలిటెంట్ల దాడుల కారణంగా ఎర్ర సముద్రం- మధ్యధరా సముద్రాన్ని హిందూ మహాసముద్రానికి కలిపే కీలకమైన షిప్పింగ్ మార్గం బాబ్-ఎల్-మండేబ్ జల సంధి చుట్టూ పరిస్థితి తీవ్రరూపం దాల్చింది.

ముఖ్యాంశాలు...

- సమీక్షా నెల జనవరిలో క్రూడ్ ఆయిల్ దిగుమతులు 4.33 శాతం పెరిగి 16.56 బిలియన్ డాలర్లకు ఎగశాయి.
- పసిడి దిగుమతులు ఏకంగా 174 శాతం పెరిగి 1.9 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

10 నెలల్లో క్షీణత

కాగా, ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి వరకూ 10 నెలల కాలంలో ఎగుమతుల విలువ 4.89% క్షీణించి 353.92 బిలియన్ డాలర్లకు పడ్డాయి. దిగుమతులు కూడా 6.71% పడిపోయి 561.12 బిలియన్ డాలర్లకు చేరాయి. వెరసి వాణిజ్యలోటు 207.2 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. మొత్తం దిగుమతుల విలువలో క్రూడ్ ఆయిల్ విలువ 15.91% పడిపోయి 146.75 బిలియన్ డాలర్లుగా నమోదైంది. పసిడి దిగుమతులు 301.7% పెరిగి 38 బిలియన్ డాలర్లకు చేరాయి.

సేవలు..ఓకే

ఇదిలాఉండగా, భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో మెజారిటీ వాటా కలిగిన సేవల రంగం జనవరిలో 32.8 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు జరిపింది. 2023లో ఈ విలువ 28 బిలియన్ డాలర్లు. ఇక ఏప్రిల్ నుంచి జనవరి మధ్య ఈ విలువ 267.5 బిలియన్ డాలర్ల నుంచి 284.45 బిలియన్ డాలర్లకు ఎగసింది.

హయత్ హోటల్స్ ఐపీవో 21నుంచి

ధరల శ్రేణి షేరుకి రూ.342–360



న్యూఢిల్లీ: ఆతిథ్య రంగ దిగ్గజం జూనిపర్ హోటల్స్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు షేరుకి రూ.342–360 చొప్పున ధరల శ్రేణిని ప్రకటించింది. హయత్ బ్రాండ్‌తో హోటళ్లను నిర్వహించే కంపెనీ ఇష్యూ ఈ నెల 21న ప్రారంభమై 23న ముగియనుంది. దీనిలో భాగంగా మొత్తం రూ. 1,800 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. వెరసి రూ. 1,800 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 40 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. జూనిపర్ హోటల్స్‌ను సరఫ్ హోటల్స్‌తోపాటు.. అనుబంధ సంస్థ జూనిపర్ ఇన్వెస్ట్‌మెంట్స్, టూ సీస్ హోల్డింగ్స్ ప్రమోట్ చేశాయి. ఆతిథ్య రంగ గ్లోబల్ కంపెనీ హయత్ హోటల్స్ కార్పొరేషన్‌కు పరోక్ష అనుబంధ సంస్థ ఇది. కాగా.. జూనిపర్ హోటల్స్ ఏడు హోటళ్లు, సర్వీస్‌డ్ అపార్ట్‌మెంట్లను నిర్వహిస్తోంది. 2023 సెప్టెంబర్‌కల్లా మొత్తం 1,836 గదులను కలిగి ఉంది.

మళ్లీ 72 వేలపైకి సెన్సెక్స్

- 71 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల సానుకూలతలు
- సూచీలకు మూడో రోజూ లాభాలు



ముంబై: అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, మహీంద్రాఅండ్‌మహీంద్రా షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు మూడో రోజూ లాభపడ్డాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లోని సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. సెన్సెక్స్ 228 పాయింట్లు పెరిగి 72వేల స్థాయిపైన 72,050 వద్ద నిలిచింది. నిఫ్టీ 71 పాయింట్లు బలపడి 21,911 వద్ద స్థిరపడింది. అమెరికా, ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ప్రథమార్థపు ట్రేడింగ్‌లో స్తబ్ధుగా కదలాడిన సూచీలు మిడ్ సెషన్‌లో యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభంతో జోరు పెంచాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 71,644 వద్ద కనిష్టాన్ని, 72,165 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 21,795 – 21,954 శ్రేణిలో ట్రేడైంది. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆయిల్‌అండ్‌గ్యాస్, విద్యుత్, ఆటో, ఐటీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈలో స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 1.24%, 0.93 % చొప్పున రాణించాయి. రంగాల వారీగా బీఎస్‌ఈ ఆయిల్‌అండ్‌గ్యాస్ 2.61%, యుటిలిటీస్ 2.59%, పవర్ 2%, ఆటో 1.41%, టెలికం 1.26% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ. 3,064 కోట్ల షేర్లను విక్రయించగా.., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,277 కోట్ల షేర్లు కొన్నారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- డిసెంబర్ క్వార్టర్ నికర లాభం 61% వృద్ధి నమోదుతో మహీంద్రాఅండ్‌మహీంద్రా షేరు దూసుకెళ్లింది. బీఎస్‌ఈలో ఆరున్నరశాతం పెరిగి రూ.1766 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 8% ర్యాలీ చేసి రూ.1784 ఆల్‌టైం హైని నమోదు చేసింది. సెన్సెక్స్.
- ఫెమా నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి తన అనుబంధ సంస్థ పీపీబీఎల్ అధికారులపై ఈడీ విచారణ కొనసాగుతుండంతో పేటీఎం షేరు బీఎస్‌ఈలో 5% లోయర్ సర్క్యూట్‌తో రూ.325 వద్ద లాకైంది.
- ప్రభుత్వరంగ ఎస్‌ఎండీసీ షేరు 5% లాభపడి రూ.246 వద్ద ముగిసింది. క్యూ3లో నికర లాభం జోరుతో ట్రేడింగ్‌లో 7% ఎగసి రూ.253 వద్ద కొత్త జీవితకాల గరిష్టాన్ని తాకింది.
- బ్లాక్‌డీల్ ద్వారా రెండుశాతానికిపైగా వాటాకు సమానమైన రూ.2,600 కోట్ల విలువైన షేర్లు చేతులు మారినట్లు వార్తలు వెలుగులోకి రావడంతో వేదాంత షేరు 4% నష్టపోయి రూ.268 వద్ద ముగిసింది.

వీసాపై ఆర్‌బీఐ ఆంక్షలు!



ముంబై: కార్డు చెల్లింపులను స్వీకరించని సంస్థలకు మధ్యవర్తుల ద్వారా చెల్లింపులు జరపడాన్ని నిలిపివేయాలంటూ కార్డు నెట్‌వర్క్ సంస్థ వీసాను ఆర్‌బీఐ ఆదేశించినట్లు సమాచారం. ఇలాంటి లావాదేవీల ద్వారా పెద్ద మొత్తంలో నిధులు చట్టవిరుద్ధంగా బదిలీ అవుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది. 'కార్డు ద్వారా చెల్లింపులను స్వీకరించని సంస్థలకు నిర్దిష్ట మధ్యవర్తుల ద్వారా చెల్లింపులు జరిగేలా ఒక కార్డ్ నెట్‌వర్క్ సంస్థ ఒప్పందం చేసుకున్నట్లు మా దృష్టికి వచ్చింది' అంటూ వీసా పేరును ప్రస్తావించకుండా రిజర్వ్ బ్యాంక్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ వ్యవహారంపై చేపట్టిన అధ్యయనం పూర్తయ్యే వరకు అటువంటి ఒప్పందాలను నిలిపివేయాలని కార్డు కంపెనీకి సూచించినట్లు వివరించింది. అయితే, క్రెడిట్ కార్డుల సాధారణ వినియోగంపై ఎలాంటి ఆంక్షలు లేవని పేర్కొంది. ఆర్‌బీఐ ప్రత్యేకంగా పేరు ప్రస్తావించనప్పటికీ సదరు కార్డు నెట్‌వర్క్ సంస్థ వీసానే అని సంబంధిత వర్గాలు తెలిపాయి. నిబంధనల ప్రకారం ఇది కూడా ఒక తరహా చెల్లింపు విధానం కిందకే వస్తుందని, అధికారికంగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని ఆర్‌బీఐ పేర్కొంది.

సోనాలికా నుంచి 10 కొత్త ట్రాక్టర్లు



న్యూఢిల్లీ: అత్యంత అధునాతన సాంకేతిక సామర్థ్యం కలిగిన టైగర్ సిరీస్ నుంచి పది ట్రాక్టర్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసినట్లు సోనాలిక ట్రాక్టర్స్ ప్రకటించింది. యూరప్‌లో తయారైన ఈ ట్రాక్టర్లను 40 – 75 హెచ్‌పీ సామర్థ్యంతో రూపొందించినట్లు తెలిపింది. భారతీయ రైతులకు, ఇక్కడి వాతావరణ పరిస్థితులకు తగ్గినట్లు తయారీ చేసిన వీటిలో 5 అత్యంత శక్తివంతమైన మోడళ్లు కాగా, మరో ఐదు మల్టీ–స్పీడ్ ట్రాన్స్‌మిషన్ మోడళ్లని పేర్కొంది. అయిదు హైడ్రాలిక్స్ కలిగిన ఈ ట్రాక్టర్లు 2,000–2,500 కేజీల సరుకును అవలీలగా తీసుకెళ్తాయని వివరించింది. ''ఈ ట్రాక్టర్లతో రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయి. దేశీయ ట్రాక్టర్ల విపణిలో మరింత వాటాను పెంచుకోవాలనే లక్ష్యంతోనే పలు మోడళ్లను ప్రవేశపెట్టాము'' అని కంపెనీ వైస్ చైర్మన్ అమృత్ సాగర్ మిట్టల్ తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్




భారత్‌కు తొలి పరాజయం

ప్రొ హాకీ లీగ్ టోర్నీలో భారత పురుషుల జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. ఆస్ట్రేలియాతో గురువారం భువనేశ్వర్‌లో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 4–6 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ (12వ, 20వ ని.లో) రెండు గోల్స్ చేయగా... సుఖ్‌జీత్ (18వ ని.లో), మందీప్ (29వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఆస్ట్రేలియా తరఫున బ్లేక్ గోవర్స్ (2వ ని.లో) రెండు గోల్స్ చేయగా... జలెవ్‌స్కీ (40వ ని.లో), షార్ప్ (52వ ని.లో), అండర్సన్ (55వ ని.లో), జాక్ వెల్చ్ (58వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో భారత్ ఆడుతుంది.

సెమీస్‌లో సాకేత్–రామ్‌కుమార్ జోడీ

బెంగళూరు ఓపెన్ టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాకేత్ – రామ్‌కుమార్ (భారత్) ద్వయం 6–4, 6–4తో ష్నయిటర్–వాల్నర్ (జర్మనీ) జోడీపై గెలిచి సెమీఫైనల్ చేరింది. సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సుమిత్ నగాల్ (భారత్) 6–2, 7–5తో కోల్మన్ వాంగ్ (హాంకాంగ్)పై గెలిచాడు.

శతకాలతో శుభారంభం



రోహిత్, జడేజా సెంచరీలు • భారత్ 326/5
అరంగేట్రంలోనే అర్ధ సెంచరీతో అదరగొట్టిన సర్ఫరాజ్

బ్యాటింగ్‌కు బాగా అనుకూలమైన పిచ్‌పై టాస్ గెలిచిన భారత్ ఒక దశలో 33/3 స్కోరు వద్ద నిలిచింది. ఈ స్థితిలో రోహిత్, జడేజా 204 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. అయితే గురువారం ఆటలో అందరి దృష్టినీ ఆకర్షించిన ఆటగాడు మాత్రం సర్ఫరాజ్ ఖాన్. సుదీర్ఘ కాలంగా దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తూ తన అవకాశం కోసం ఎదురు చూస్తున్న అతను ఎట్టకేలకు భావోద్వేగాల నడుమ భారత క్రికెటర్‌గా అరంగేట్రం చేశాడు. అంచనాలకు తగినట్లుగా చూడచక్కటి షాట్లతో అలవోకగా అర్ధ సెంచరీని అందుకున్నాడు. జోరు మీదున్న దశలో దురదృష్టవశాత్తూ రనౌట్‌గా వెనుదిరిగినా...తానేంటో అతను నిరూపించుకున్నాడు. ఇక మిగిలిన ఐదు వికెట్లతో రెండో రోజు భారత్ ఇంకా ఎన్ని పరుగులు జోడిస్తుందనేది ఆసక్తికరం.





రాజ్‌కోట్: ఇంగ్లండ్‌తో మూడో టెస్టులో భారత్‌కు శుభారంభం లభించింది. గురువారం ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 326 పరుగులు చేసింది. రోహిత్ శర్మ (196 బంతుల్లో 131; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (212 బంతుల్లో 110 బ్యాటింగ్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలు సాధించగా... సర్ఫరాజ్ ఖాన్ (66 బంతుల్లో 62; 9 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో మార్క్ వుడ్‌కు 3 వికెట్లు దక్కాయి.

ద్విశతక భాగస్వామ్యం...

అండర్సన్ వేసిన మ్యాచ్ తొలి బంతిని యశస్వి (10) ఫోర్‌గా మలచడంలో భారత్ ఇన్నింగ్స్ ప్రారంభమైంది. అయితే వుడ్ జోరులో భారత్ రెండు పరుగుల తేడాతో యశస్వి, గిల్ (0) వికెట్లు కోల్పోయింది. హార్ట్‌లీ బంతిని ఆడలేక రజత్ పటిదార్ (5) కూడా సునాయాస క్యాచ్ ఇచ్చాడు. ఈ దశలో సర్ఫరాజ్ వస్తే ఒత్తిడిలో మరో వికెట్ పోయేదేమో! కానీ జట్టు వ్యూహాత్మకంగా కుడి, ఎడమ కాంబినేషన్ కోసం ఐదో స్థానంలో జడేజాను పంపించడం అద్భుతంగా పని చేసింది. రోహిత్, జడేజా కలిసి జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను నిర్మించారు. 29 పరుగుల వద్ద స్లిప్‌లో రూట్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన రోహిత్ లంచ్‌కు ముందు 71 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. విరామం తర్వాత పూర్తిగా భారత్ హవా సాగింది. ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా రోహిత్, జడేజా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. ఈ క్రమంలో భాగస్వామ్యం వంద పరుగులు దాటింది. 97 బంతుల్లో జడేజా అర్ధ సెంచరీ పూర్తయింది. ఈ సెషన్‌లో భారత్ 27 ఓవర్లలో 92 పరుగులు చేసింది. ఈ జోడీని విడదీయలేక ఇంగ్లండ్ తీవ్రంగా ఇబ్బంది పడింది. ఈ సిరీస్‌లో ఒక్క వికెట్ కూడా పడని తొలి సెషన్ ఇదే కావడం విశేషం. టీ తర్వాత తొలి ఓవర్లోనే రోహిత్ 157 బంతుల్లో తన కెరీర్‌లో 11వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. పార్ట్‌నర్‌షిప్ 200 పరుగులు దాటాక ఎట్టకేలకు ఇంగ్లండ్‌కు వికెట్ దక్కింది. షార్ట్ బంతులకు వరుసగా పరుగులు రాబట్టిన రోహిత్ చివరకు అదే షాట్‌కు ప్రయత్నించి వెనుదిరిగాడు.

సర్ఫరాజ్ రనౌట్...

కొత్త ఆటగాడు సర్ఫరాజ్, జడేజా భాగస్వామ్యం జట్టును నడిపించింది. ముఖ్యంగా తన కెరీర్ తొలి ఇన్నింగ్స్‌లో సర్ఫరాజ్ ఇంగ్లండ్ స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్వీప్, లాఫ్టెడ్ షాట్లతో వేగంగా పరుగులు రాబట్టాడు. సర్ఫరాజ్ క్రీజ్‌లోకి వచ్చినప్పుడు జడేజా స్కోరు 84 కాగా... సర్ఫరాజ్ వెనుదిరిగే సమయానికి 99 మాత్రమే! 77 పరుగుల ఈ ఐదో వికెట్ భాగస్వామ్యంలో జడేజా 15 పరుగులు చేయగా, సర్ఫరాజ్ 62 పరుగులు చేశాడంటేనే అతని జోరు అర్థమవుతుంది. 93 పరుగుల వద్ద హార్ట్‌లీ బంతి జడేజా ప్యాడ్‌ను ముందుగా తగిలినా... ఇంగ్లండ్ బలంగా అప్పీల్ చేయలేదు. రీప్లేలో అతను అవుటయ్యేవాడని తేలింది! ధాటిగా ఆడిన సర్ఫరాజ్ 48 బంతుల్లోనే హాఫ్ సెంచరీని చేరుకున్నాడు. అయితే దురదృష్టవశాత్తూ జడేజాతో సమన్వయ లోపం అతని ఆటను ముగించింది. జడేజా 99 వద్ద అండర్సన్ బౌలింగ్‌లో సింగిల్ కోసం ముందుకు వచ్చి మళ్లీ వెనక్కి తగ్గాడు. అప్పటికే ముందుకు వెళ్లిన సర్ఫరాజ్ వెనక్కి వచ్చేలోగా వుడ్ డైరెక్ట్ హిట్ వికెట్లను తాకింది. తర్వాతి బంతికే సింగిల్‌తో జడేజా టెస్టుల్లో నాలుగో సెంచరీ పూర్తయింది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (సి) రూట్ (బి) వుడ్ 10; రోహిత్ (సి) స్టోక్స్ (బి) వుడ్ 131; గిల్ (సి) ఫోక్స్ (బి) వుడ్ 0; పటిదార్ (సి) డకెట్ (బి) హార్ట్‌లీ 5; జడేజా (బ్యాటింగ్) 110; సర్ఫరాజ్ (రనౌట్) 62; కుల్దీప్ (బ్యాటింగ్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (86 ఓవర్లలో 5 వికెట్లకు) 326. వికెట్ల పతనం:** 1–22, 2–24, 3–33, 4–237, 5–314. **బౌలింగ్:** అండర్సన్ 19–5–51–0, వుడ్ 17–2–69–3, హార్ట్‌లీ 23–3–81–1, రూట్ 13–1–68–0, రేహాన్ 14–0–53–0.

భావోద్వేగ క్షణాలు...



రాజ్‌కోట్ టెస్టు ద్వారా ఇద్దరు ఆటగాళ్లు సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురేల్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టారు. సర్ఫరాజ్‌కు అనిల్ కుంబ్లే, జురేల్‌కు దినేశ్ కార్తీక్ టెస్టు క్యాప్‌లు అందించారు. రెండేళ్ల వ్యవధిలో 15 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల తర్వాత అవకాశం లభించిన వికెట్ కీపర్ జురేల్‌తో పోలిస్తే సర్ఫరాజ్ ప్రస్థానం భావోద్వేగభరితమైంది. అందుకే మ్యాచ్‌కు ముందు మైదానంలో అలాంటి దృశ్యాలు కనిపించాయి. ఎనిమిదేళ్ల ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో దేశవాళీలో 70 సగటుతో భారీగా పరుగులు సాధించిన సర్ఫరాజ్ భారత్ తరఫున ఆడేందుకు ఎంతో కాలంగా ఎదురు చూశాడు. పలుమార్లు అవకాశం వచ్చినట్లే వచ్చి చేజారింది. అందుకే అరంగేట్రం ఖాయమైన క్షణాన కోచ్, మెంటార్ అయిన తండ్రి నౌషాద్ ఖాన్ తన కన్నీళ్లను ఆపుకోలేకపోయాడు. చిన్నప్పటినుంచి అన్నీ తానే అయి సర్ఫరాజ్‌ను క్రికెటర్‌గా తీర్చిదిద్దిన ఆయన టెస్టు క్యాప్‌ను ముద్దాడి తన కొడుకును హత్తుకున్నాడు. సర్ఫరాజ్ అర్ధసెంచరీ పూర్తయినప్పుడు అన్ని వైపుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. జడేజా కూడా ఆట ముగిసిన తర్వాత రనౌట్‌లో తనదే తప్పంటూ బాధపడుతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు!





చైనా చేతిలో భారత్ ఓటమి

షా ఆలమ్ (మలేసియా): ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా చైనాతో జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 2–3తో పరాజయం పాలైంది. తొలి మ్యాచ్‌లో ప్రణయ్ 6–21, 21–18, 21–19తో వెంగ్ హంగ్ యంగ్‌పై గెలిచాడు. రెండో మ్యాచ్‌లో అర్జున్–ధ్రువ్ కపిల జోడీ 15–21, 21–19, 19–21తో చెన్ బొ యంగ్–లియు యి చేతిలో ఓడింది. మూడో మ్యాచ్‌లో లక్ష్య సేన్ 21–11, 21–16తో లీ లాన్‌పై నెగ్గాడు. నాలుగో మ్యాచ్‌లో సూరజ్–పృథ్వీ జంట 13–21, 9–21తో జియాంగ్ యు–జి హావో ద్వయం చేతిలో ఓడింది. ఐదో మ్యాచ్‌లో చిరాగ్ సేన్ 15–21, 16–21తో వాంగ్ జెంగ్ జింగ్ చేతిలో ఓడిపోవడంతో భారత్ 2–3తో పరాజయం చవిచూసింది. మహిళల విభాగం క్వార్టర్ ఫైనల్లో హాంకాంగ్‌తో భారత్; పురుషుల విభాగం క్వార్టర్ ఫైనల్లో జపాన్‌తో భారత్ ఆడతాయి. గెలిచిన జట్లకు కనీసం కాంస్య పతకాలు ఖాయమవుతాయి.



న్యూజిలాండ్ లక్ష్యం 267

హామిల్టన్: దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో విజయానికి న్యూజిలాండ్ మరో 227 పరుగుల దూరంలో నిలిచింది. 267 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 13.5 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 40 పరుగులు చేసింది. అంతకుముందు దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 69.5 ఓవర్లలో 235 పరుగులకు ఆలౌటైంది. డేవిడ్ బెడింగమ్ (110; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. న్యూజిలాండ్ బౌలర్ విలియమ్ ఒరూర్కీ ఐదు వికెట్లు పడగొట్టాడు.

టి20 ప్రపంచకప్ వరకు రాహుల్ ద్రవిడే కోచ్: జై షా

రాజ్‌కోట్: టి20 ప్రపంచకప్ ముగిసేవరకు భారత జట్టు హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ కొనసాగుతాడని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. ద్రవిడ్ పదవీ కాలం గతేడాది వన్డే ప్రపంచకప్‌తోనే ముగిసింది. అనంతరం నిర్దిష్ట వ్యవధి అని లేకుండా దక్షిణాఫ్రికా పర్యటనకు అతన్ని కొనసాగించారు. 'ప్రపంచకప్ తర్వాత వెంటనే సఫారీ టూర్‌కు వెళ్లడంతో ద్రవిడ్‌తో మాట్లాడటం కుదరకే నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడు టి20 ప్రపంచకప్ వరకు అందుబాటులో ఉంటానని చెప్పడంతో ద్రవిడ్‌నే కొనసాగించాలని నిర్ణయించాం' అని జై షా అన్నారు.

క్లుప్తంగా...

డెంటల్ డాక్టర్ పోస్టు భర్తీకి వాక్-ఇన్-రిక్రూట్‌మెంట్

సాక్షి, అమరావతి: కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఆదోని ఈఎస్ఐ డయగ్నోస్టిక్స్ సెంటర్‌లో ఒక డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టు భర్తీకి ఈనెల 20వ తేదీన వాక్-ఇన్-రిక్రూట్‌మెంట్ నిర్వహించనున్నామని ఆ సంస్థ డైరెక్టర్ వి.ఆంజనేయులు గురువారం తెలిపారు. https://dimsap.uat.dcservices.in.imcs/ వెబ్‌సైట్‌లో వివరాలు అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20వ తేదీన విజయవాడలోని ఈఎస్ఐ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించే వాక్-ఇన్-రిక్రూట్‌మెంట్‌కు హాజరవ్వాలని సూచించారు.

20 నుంచి రీసెర్చ్ సెట్ దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి/తిరుపతి సిటీ: రాష్ట్రంలోని వర్సిటీల్లో పీహెచ్‌డీ సీట్ల భర్తీకి శ్రీ వెంకటేశ్వర వర్సిటీ గురువారం ఏపీ రీసెర్చ్‌సెట్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 20వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనుండగా మార్చి 19వ తేదీ వరకు తుది గడువు విధించింది. ఏప్రిల్ 4 నుంచి 7వ తేదీ వరకు దరఖాస్తుల్లో సవరణలకు వెసులుబాటు కల్పించింది. ఏప్రిల్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. పీహెచ్‌డీ అడ్మిషన్లకు సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులు పొందిన అభ్యర్థులే ప్రవేశ పరీక్షకు అర్హులుగా పేర్కొంది. పూర్తి వివరాలకు 9030407022, http://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

పాఠశాల విద్యాశాఖ (ఇన్‌ఫ్రా) కమిషనరేట్ చిరునామా మార్పు

వడ్డేశ్వరంలోని ప్రైమ్‌హిల్ క్రెస్ట్‌లో ఏర్పాటు

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలోని స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిషనర్ కార్యాలయాన్ని గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో ఉన్న ప్రైమ్ హిల్ క్రెస్ట్ భవనంలోకి మార్చారు. నూతన కార్యాలయాన్ని గురువారం కమిషనర్ కాటమనేని భాస్కర్ ప్రారంభించారు. గతంలో ఈ కార్యాలయం విజయవాడలోని ఏపీ సమగ్ర శిక్ష కార్యాలయం ప్రాంగణంలో ఉండేది. ఇకపై వడ్డేశ్వరం నుంచి కార్యకలాపాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. మన బడి: నాడు-నేడు పనులు, పాఠశాల మౌలిక వసతుల కల్పనలకు సంబంధించిన పనులు ఈ కార్యాలయం నుంచే నిర్వహిస్తారని కాటమనేని భాస్కర్ పేర్కొన్నారు.

తీర్పులోని టైపింగ్ తప్పిదాలు సరిదిద్దాం: సుప్రీం

సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై జనవరి 16న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయితే, తీర్పులో కొన్ని టైపింగ్ తప్పిదాలు వచ్చినట్లు ఆఫీస్ రిపోర్టు ద్వారా రిజిస్ట్రీ సుప్రీంకోర్టు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చింది. దీంతో గురువారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం ఈ అంశాన్ని పరిశీలించింది. ఆఫీస్ రిపోర్టులో పేర్కొన్న తప్పిదాలను సరిదిద్దినట్లు ఆదేశాలు వెలువరించింది.

ఎన్నికల బాండ్లపై 'సుప్రీం' తీర్పు చరిత్రాత్మకం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ఎన్నికల బాండ్లను సేకరించడం రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాగా దేశ వ్యాప్తంగా శుక్రవారం నిర్వహిస్తున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు సీపీఎం మద్దతు తెలుపుతుందని శ్రీనివాసరావు మరో ప్రకటన విడుదల చేశారు.

మాజీ ఎమ్మెల్యే బాచిన సస్పెన్షన్

వెల్లడించిన వైఎస్సార్‌సీపీ

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, బాచిన కృష్ణ చైతన్యలను సస్పెండ్ చేస్తున్నట్టు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్టు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫారసుల మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది.

'ఇండియా కూటమి గెలిస్తే మద్దతు ధరపై చట్టం'

సాక్షి, అమరావతి: ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పంటలకు మద్దతు ధర ఉండేలా చట్టం చేస్తామని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ సమన్వయకర్త కొప్పుల రాజు తెలిపారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా దేశంలో 'అన్యాయ కాల్' సాగుతోందన్నారు.కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తుందని ఎంపీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్కం ఠాగూర్ తెలిపారు.ఈ నెలాఖరులో ఆంధ్రాలో సభలు, ర్యాలీలు నిర్వహించనున్నామన్నారు.



'ఐబీ' ఇదిగో

విజయవాడలో మొదలైన కార్యకలాపాలు

26 నుంచి జిల్లాల్లో ఐబీ బృందం పర్యటన

- వివిధ మేనేజ్‌మెంట్లలోని పాఠశాలల పరిశీలన
- ఉపాధ్యాయులతో మమేకమై అవగాహన
- వెనువెంటనే టీచర్లకు ఐబీలో మాస్టర్ శిక్షణ
- 2025 జూన్‌లో ఒకటో తరగతి నుంచి ఐబీ సిలబస్ అమలు

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బాకలారియేట్ (ఐబీ) సిలబస్ అమలుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. దీనికి సంబంధించి గత నెల 31వతేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఐబీ సంస్థతో ఏపీ ఎస్సీఈఆర్టీ ఒప్పదం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 15 రోజుల వ్యవధిలో ఐబీ ప్రతినిధులు ఏపీలో విద్యా విధానం, సంస్కరణల అమలు, ఉపాధ్యాయ శిక్షణ తదితర అంశాలను పరిశీలించారు. ఒప్పందం జరిగిన వెంటనే విజయవాడలోని ఎస్సీఈఆర్టీ కార్యాలయంలో ఐబీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సంస్థ ప్రతినిధులు కార్యకలాపాలు ప్రారంభించారు. ఈనెల 26వతేదీ నుంచి 9 రోజుల పాటు ఐబీ అధికారుల బృందం జిల్లాల్లో పర్యటించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా, మండల, మున్సిపల్ స్కూళ్లతో పాటు ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర మేనేజ్‌మెంట్ పాఠశాలను బృందం పరిశీలిస్తుంది. క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రభుత్వం కల్పించిన సదుపాయాలు, ఉపాధ్యాయుల సామర్థ్యాలను అంచనా వేయనున్నారు.

- సాక్షి, అమరావతి

అత్యధిక ఐబీ స్కూళ్లు ఏపీలోనే..

ప్రాథమిక విద్యా బోధనలో ప్రపంచంలోనే అత్యుత్తమ విధానాలను ఫిన్‌ల్యాండ్ అమలు చేస్తోంది. పాలనలో పారదర్శకత, మానవ వనరుల వినియోగం, ప్రణాళికలో ఎప్పుడూ ముందు వరుసలో నిలుస్తోంది. ప్రస్తుతం ఐబీ బోర్డు డైరెక్టర్ జనరల్‌గా ఉన్న ఓలి పెక్కా హీనోనెన్ ఫిన్‌ల్యాండ్ జాతీయ విద్యాశాఖకు డైరెక్టర్ జనరల్‌గా సేవలందించారు. ఆయనే స్వయంగా ఏపీ ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ విధానాలను పర్యవేక్షిస్తుండడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 5 వేల వరకు ఐబీ స్కూళ్లు ఉండగా 2025 జూన్‌లో ప్రపంచంలోనే అత్యధిక ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్ అమలు చేస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలువనుంది. ఏపీలో దాదాపు 45 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్ (ప్రాథమిక, ప్రాథమికోన్నత) స్కూళ్లు 39 వేల వరకు ఉన్నాయి. ఈ స్కూళ్లలో 2025 జూన్‌లో ఒకటో తరగతితో ఐబీ బోధన ప్రారంభం కానుంది. అంతర్జాతీయంగా పేరున్న ఐబీ బోర్డుకు ప్రపంచంలోనే అతి పెద్ద నెట్‌వర్క్ మన రాష్ట్రంలోనే ఉండడం విశేషం.

తొలుత విజయవాడలో టీచర్లకు శిక్షణ

ఇంటర్నేషనల్ బాకలారియెట్ సిలబస్ బోధనపై మార్చి నుంచి విజయవాడలో మాస్టర్ ట్రైనర్స్‌గా తొలుత కొందరు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని యోచిస్తున్నారు. మెక్సికోకు చెందిన ఐబీ ప్రతినిధి ఆల్డో ఇటీవల ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను స్వయంగా పరిశీలించారు. సదుపాయాలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల వినియోగం, బోధనా విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల పనితీరును అడిగి తెలుసుకోవడంతో పాటు వారితో సంభాషించి పలు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న 'జగనన్న గోరుముద్ద'ను సైతం రుచి చూశారు. పాఠశాలల్లో భౌతిక, జీవశాస్త్ర ప్రయోగశాలలు, ఇంగ్లిష్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్‌లను పరిశీలించి ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఐబీకి చెందిన మరో ప్రతినిధి ఆశిష్ రెండు రోజులు విద్యాశాఖ అధికారులతో సమావేశమై పాఠశాలల్లో ఐటీ, ఆన్‌లైన్ సేవలను తెలుసుకున్నారు. ఏపీ విద్యా విధానాలు ఐబీకి దాదాపు దగ్గరగా ఉన్నాయని పేర్కొనడం గమనార్హం.

వచ్చే ఏడాది ఒకటో తరగతి నుంచి..

ఐబీ అమలుపై 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యాశాఖ సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. ఉపాధ్యాయులతోపాటు మండల, జిల్లా విద్యాధికారులు, ఎస్సీఈఆర్టీ, డైట్ సిబ్బంది, ఎస్సెస్సీ, ఇంటర్ బోర్డు సిబ్బంది వీరిలో ఉంటారు. వీరికి దశలవారీగా 'ఐబీ'పై అవగాహన, నైపుణ్యం, సామర్థ్యాల పెంపుపై శిక్షణ ఇచ్చి ఐబీ సర్టిఫికెట్లు అందచేస్తారు. దీంతో వీరంతా ప్రతిష్టాత్మక ఐబీ గ్లోబల్ టీచర్ నెట్‌వర్క్‌లో భాగమవుతారు. అనంతరం 2025 జూన్‌లో ప్రారంభమయ్యే 2025-26 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతితో ఐబీ విద్యాబోధన ప్రారంభం అవుతుంది. ఏటా ఒక్కో తరగతి చొప్పున పెంచుకుంటూ వెళతారు. విద్యార్థులు 2035 నాటికి పదో తరగతి, 2037లో ప్లస్ 2లో ఐబీ సిలబస్‌లో పరీక్షలు రాస్తారు. విద్యార్థులకు ఐబీ, ఏపీ ఎస్సీఈఆర్టీ కలిసి అందించే జాయింట్ సర్టిఫికేషన్‌కు అంతర్జాతీయ గుర్తింపు ఉంటుంది.

రూ.73 వేల కోట్లతో సంస్కరణలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద పిల్లలు అధికంగా చదువుకునే పాఠశాల విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రాథమిక స్థాయి నుంచి ప్రణాళికలు అమలు చేస్తోంది. జగనన్న అమ్మఒడి, విద్యా కానుక, గోరుముద్ద తదితర విప్లవాత్మక కార్యక్రమాలను ప్రవేశపెట్టి విద్యార్థుల ఉన్నతికి బాటలు వేసింది. 2019 జూన్ నుంచి 2024 జనవరి వరకు విద్యా రంగ సంస్కరణల కోసం ఏకంగా రూ.73,293.68 కోట్లు వెచ్చించింది. ఇప్పుడు ఐబీ బోధనను సైతం ప్రభుత్వ స్కూళ్లలో అందుబాటులోకి తెస్తోంది.

రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్‌మీనా

సాక్షి, అమరావతి: రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) ముకేశ్‌కుమార్ మీనా స్పష్టంచేశారు. జిల్లా స్థాయిలో ప్రసారం చేసే ప్రకటనలకు జిల్లా ఎంసీఎంసీ కమిటీ, రాష్ట్ర స్థాయిలో ప్రసారం చేసే ప్రకటనలకు రాష్ట్ర ఎంసీఎంసీ కమిటీ ఆమోదం పొందాలని చెప్పారు. రాజకీయ ప్రకటనల విషయంపై ఏపీ సీఈవో ముకేశ్‌కుమార్ మీనా గురువారం మధ్యాహ్నం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలు ఇచ్చే విషయంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను అన్ని పార్టీలు పాటించాలని కోరారు. రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయాలనుకున్న తేదీకి కనీసం మూడు రోజుల ముందు సంబంధిత పార్టీలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లో కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. రాష్ట ఎంసీఎంసీ కమిటీ కన్వీనర్, డిప్యూటీ సీఈవో మల్లిబాబు, కమిటీ సభ్యులు, అడిషనల్ సీఈవో కోటేశ్వరరావు, దూరదర్శన్ కేంద్రం విజయవాడ రీజినల్ న్యూస్ యూనిట్ డిప్యూటీ డైరెక్టర్ జి.కొండలరావు, పీఐబీ మీడియా కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.హెన్రీరాజ్, జాయింట్ సీఈవో వెంకటేశ్వరరావు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


రేపు జీఎస్ఎల్‌వీ ఎఫ్-14 ప్రయోగం

నేడు కౌంట్‌డౌన్ ప్రారంభం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): స్థానిక భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) షార్ కేంద్రంలోని రెండో ప్రయోగ వేదిక నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు జీఎస్ఎల్‌వీ ఎఫ్-14 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో గురువారం మిషన్ రెడీనెస్ రివ్యూ (ఎంఆర్ఆర్) సమావేశం నిర్వహించిన తర్వాత ప్రయోగ పనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్) వారికి అప్పగించారు. అనంతరం లాంచ్ ఆథరైజేషన్ బోర్డు చైర్మన్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో మరోసారి ల్యాబ్ సమావేశం నిర్వహించారు.శుక్రవా రం మధ్యాహ్నం 2.05 గంటల నుంచి 27.30 గంటల కౌంట్‌డౌన్ అనంతరం జీఎస్ఎల్‌వీ ఎఫ్-14 రాకెట్‌ను ప్రయోగిస్తారు. మొత్తం 2,272 కిలోలు బరువు కలిగిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలో ప్రవేశపెట్టేలా ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ప్రయోగాన్ని డిజైన్ చేశారు. ఇది షార్ కేంద్రం నుంచి 92వ ప్రయోగం కాగా, జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో 16వ ప్రయోగం పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో క్రయోజనిక్ ఇంజిన్లు తయారు చేసుకుని చేస్తున్న 10వ ప్రయోగం కావడం విశేషం.

'జల్లికట్టు'లో సీఎం జగన్ ఫొటో

తమ అభిమానాన్ని చాటుకున్న తమిళనాడు వాసులు



పలమనేరు(చిత్తూరు జిల్లా): తమిళనాడు వాసులు కూడా ఏపీ సీఎం వైఎస్ జగన్‌పై తమకున్న అభిమానాన్ని చాటుకుంటున్నారు. తమిళనాడులో ప్రస్తుతం జల్లికట్టు మైలేర్ల సీజన్ కొనసాగుతోంది. మైలేర్లలో వేగంగా పరుగెత్తిన ఎద్దుకు బహుమతులు రూ.10 లక్షల దాకా ఉన్నాయి. ఇప్పటిదాకా పరుగు పందెంలో కచ్చితంగా గెలిచే ఎద్దులకు కొండ గుర్తుగా రజనీకాంత్, విజయ్, సూర్య ఫొటోలను మాత్రం కొమ్ములకు ప్రభలను కట్టి పందేల్లో వదిలేవారు. ఇప్పుడు వేలూరు, క్రిష్ణగిరి, తిరప్పత్తూరు జిల్లాలోని చాలాచోట్ల జరిగే జల్లికట్టు, మైలేర్లలో ఆంధ్రా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలున్న ప్రభలతో ఎద్దులు కనిపిస్తున్నాయి. పందేలు జరిగేచోట సైతం మైక్‌లో కామెంటరీ చేసేవాళ్లు ఆంధ్రా టైగర్ జగన్ వద్దాంధ్రా, సిద్ధం అంటూ పొగడటం విశేషం.

విశాఖ, విజయవాడ ఆర్థిక వృద్ధిపై ఫోకస్

సీఐఐ సదరన్ రీజియన్ చైర్మన్ కమల్‌బాలి



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం, విజయవాడ ఆర్థిక వృద్ధిపై ఫోకస్ పెడుతున్నట్టు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సదరన్ రీజియన్ చైర్మన్ కమల్ బాలి తెలిపారు. ఈ రెండు నగరాలు ఆదర్శ నగరాలుగా, రాష్ట్ర వృద్ధి కేంద్రాలుగా ఎదగడానికి అవసరమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయన్నారు. గురువారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2047 నాటికి దక్షిణ భారతదేశాన్ని ఆర్థిక వృద్ధిపరంగా ప్రోత్సహించేందుకు సీఐఐ తొమ్మిది ఫోకస్డ్ ట్రాక్‌లను ప్రారంభించినట్టు చెప్పారు. ప్రజలు-సంస్కృతి పునరుజ్జీవనం, సంపూర్ణ సుస్థిరత, డిజిటల్, ఎనర్జీ ట్రాన్స్‌ఫర్మేషన్, టెక్ అడాప్షన్, స్టార్టప్ ఎకో సిస్టమ్స్, మాన్యుఫ్యాక్చరింగ్ ఎక్సలెన్స్, ఇండస్ట్రీ 4.0, ఇంటర్నేషనల్ లింకేజెస్, ఎంఎస్ఎంఈ వంటివి ఇందులో ఉన్నాయని వివరించారు. 2023-24 సంవత్సరానికి వృద్ధి, సుస్థిరత, నమ్మకం, ప్రపంచీకరణ అనే అంశాలపై దృష్టి సారిస్తున్నామన్నారు. సేవల రంగానికి ప్రపంచవ్యాప్త గమ్యస్థానంగా భారత్ నిలుస్తోందని, అందువల్ల పలు ఫార్చ్యూన్ 500 కంపెనీలు దేశంలో తమ సాంకేతిక కేంద్రాలను ఏర్పాటు చేశాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సహకరించడానికి సీఐఐ కట్టుబడి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సీఐఐ జాయింట్ కన్సల్టేటివ్ ఫోరంలు అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలను బలోపేతం చేయడం, వ్యూహాత్మక ఫ్రేమ్‌వర్క్‌లను రూపొందించడం, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడానికి నిర్దిష్ట సంస్కరణలు అమలు చేయడం, పారిశ్రామిక వృద్ధికి అనుకూల విధానాలను రూపొందించడానికి ప్రభుత్వ-పరిశ్రమల భాగస్వామ్యాలను సులభతరం చేయడంపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో తయారీ పెట్టుబడులను పెంచడానికి తమవంతు సహకరిస్తామని, ఎలక్ట్రానిక్ సిస్టం డిజైన్, తయారీ, డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా, బయోటెక్నాలజీ తదితర రంగాల్లో పెట్టుబడులకు అనుకూలంగా ఉందని వివరించారు. ప్రస్తుతం దేశంలోని మత్స్య ఎగుమతుల్లో ఏపీ అత్యధిక వాటాను కలిగి ఉందని తెలిపారు. సీఐఐ ఏపీ చైర్మన్ ఎం.లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రోత్సాహం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సముద్ర ఆహార ఉత్పత్తి, ఎగుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వారివెంట సీఐఐ రీజనల్ డైరెక్టర్ ఎస్ఎంపీ జయేష్ ఉన్నారు.

నేడు 'ఎడెక్స్' ప్రోగ్రామ్ ప్రారంభం

- ఏపీ విద్యార్థులకు ప్రపంచ వర్సిటీ అధ్యాపకుల బోధన
- సుమారు 2 వేలకు పైగా వరల్డ్‌క్లాస్ కోర్సులు ఉచితంగా అందుబాటులోకి
- లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, హార్వర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి వర్సిటీల సర్టిఫికేషన్లు
- 12 లక్షల మంది విద్యార్థులకు మేలు
- నేడు ప్రారంభించనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అంతర్జాతీయ వర్సిటీల కోర్సులను ఉచితంగా అందించేందుకు శ్రీకారం చుట్టింది. విద్యారంగంలో విప్లవాత్మక మార్పుల్లో భాగంగా ప్రముఖ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో ఒప్పందం చేసుకుంది. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎడెక్స్ ఆన్‌లైన్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఎడెక్స్, ఉన్నత విద్యాశాఖ సంయుక్తంగా టీచింగ్, లెర్నింగ్ కోసం కొత్త టెక్నాలజీ, బోధన విధానాలను రూపొందించాయి. హార్వర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, కొలంబియా, న్యూయార్క్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్స్, ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్ వంటి ఎన్నో ప్రతిష్టాత్మక వర్సిటీల నుంచి వివిధ కోర్సుల్లో ఏపీ విద్యార్థులు సర్టిఫికేషన్లు సులభంగా పొందొచ్చు. తద్వారా మంచి వేతనాలతో కూడిన జాతీయ, అంతర్జాతీయ ఉద్యోగాలను సాధించేలా ప్రోత్సహిస్తోంది.

12 లక్షల మందికి లబ్ధి

ఆంధ్రప్రదేశ్‌లోని 12 లక్షల మందికి పైగా విద్యార్థులు వరల్డ్ క్లాస్ వర్సిటీలు, ఇతర విద్యాసంస్థలు అందించే రెండు వేలకు పైగా ఎడెక్స్ ఆన్‌లైన్ కోర్సులను, రెగ్యులర్ కోర్సులతో పాటు ఉచితంగా చదువుకోవచ్చు. అనంతరం ఎడెక్స్, అంతర్జాతీయ వర్సిటీల నుంచి సర్టిఫికెట్లు అందుకుంటారు. ఇక్కడ ప్రపంచంలోని అత్యున్నత స్థాయి విశ్వవిద్యాలయాలు, సంస్థలకు చెందిన అత్యుత్తమ అధ్యాపకులతో బోధన లభిస్తుంది. ప్రపంచంలోని శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు సామాజిక, సాంఘిక శాస్త్రాలకు సంబంధించి వివిధ సబ్జెక్టులను పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉచితంగా నేర్చుకోవచ్చు. ఈ కోర్సుల్లో ఎక్కువ వర్టికల్స్ పెట్టడం ద్వారా విద్యార్థి నచ్చిన వర్టికల్స్ చదువుకునేలా ప్రణాళిక రూపొందించింది. విదేశాలకు వెళ్లి అక్కడి మేటి కాలేజీల్లో చదువుకోలేని ఎంతో మంది విద్యార్థులకు మేలు చేకూరనుంది. కరిక్యులమ్‌లో భాగంగా ఎడెక్స్ కోర్సులకు అంతర్జాతీయ వర్సిటీలే ఆన్‌లైన్‌లో ఎగ్జామ్స్ నిర్వహించి సర్టిఫికెట్లు అందిస్తాయి. ఆ క్రెడిట్స్ మన కరిక్యులమ్‌లో భాగమవుతాయి. తద్వారా ఏపీ విద్యార్థులు గ్లోబల్ స్టూడెంట్స్‌గా ఎదుగుతారు. ప్రొఫెషనల్, సంప్రదాయ డిగ్రీ విద్యలో లోటుపాట్లను సరిచేసి స్కిల్ ఓరియెంటెడ్ కోర్సులను అందించడం ద్వారా నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధిలో ఎడెక్స్ ఎంతో ఉపయోగపడనుంది.

సింహం ముందు తొడగొట్టాడు.. ప్రాణాలు పోగొట్టుకున్నాడు

- తిరుపతి జూ పార్క్‌లో దుర్ఘటన
- సింహాల ఎన్‌క్లోజర్‌లోకి దూకిన రాజస్థాన్ వాసి
- సింహం దూసుకు రావడంతో చెట్టెక్కేందుకు యత్నం
- కాలుజారి కిందపడి చివరికి సింహానికి చిక్కిన వైనం



యువకుడిని చంపిన సింహం

తిరుపతి (మంగళం): సింహం ముందు తొడగొట్టిన వ్యక్తి చివరకు దానికి ఆహారంగా మారిన దుర్ఘటన తిరుపతి జూ పార్క్‌లో గురువారం చోటుచేసుకుంది. ఈ ఘటన సందర్శకుల్ని భయభ్రాంతులకు గురిచేసింది. సందర్శకులు, జూ అధికారుల కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన ప్రహ్లాద గుర్జర్ (38) అనే వ్యక్తి గురువారం హైదరాబాద్ నుంచి తిరుపతి వచ్చాడు. ఇక్కడి జంతు ప్రదర్శన శాలను సందర్శించేందుకు వెళ్లాడు. సందర్శకులతో కలిసి పులులు, ఇతర జంతువులను చూసుకుని సింహాలు ఉండే ఎన్‌క్లోజర్‌కు చేరుకున్నాడు. సింహాలు ఉండే ఎన్‌క్లోజర్ మొదటి గేటు ఎక్కి లోనికి ప్రవేశించాడు. బోనులో ఉండే సింహాల ఇనుప ప్రహరీని ఎక్కి ఎన్‌క్లోజర్‌లోకి దూకేశాడు. వంద మీటర్ల దూరంలో ఉన్న సింహాన్ని చూసి గట్టిగా అరిచాడు. సింహం తన వైపు చూడగానే తొడగొట్టి పిలిచాడు. సింహం అతడివైపు రావడంతో పక్కనే ఉన్న చెట్టెక్కే ప్రయత్నంలో కాలుజారి కిందపడ్డాడు. వెంటనే సింహం ప్రహ్లాద్ గుర్జర్ మెడను నోటితో పట్టుకుని వంద మీటర్లకుపైగా దూరం లాక్కెళ్లి చంపేసింది. సమాచారం అందుకున్న జూ క్యూరేటర్ సెల్వం, చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్, తిరుపతి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అతడు చనిపోవడానికే సింహాలు ఉండే ఎన్‌క్లోజర్‌లోకి దూకి ఉంటాడని భావిస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.